www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 239 | సోమవారం 19-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కొఠారి కోట్లెత్తేశాడు..?

- బ్యాంకులకు రూ.800 కోట్లు ఎగనామం
- రొటోమాక్ గ్రూప్ అధినేతపై ఆరోపణలు
- పీఎన్‌బీ స్కామ్ తర్వాత మరొకటి వెలుగులోకి..

న్యూఢిల్లీ : దేశంలో ఆర్థిక కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు సంబంధించి వ్యాపారవేత్త నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల మేర ఎగనామం పెట్టడం సంచలనం సృష్టిస్తోంది. తాజాగా రొటోమాక్ గ్రూప్ అధినేత విక్రమ్ కొఠారి బ్యాంకుల నుంచి రూ.800 కోట్లు కొట్టేసి పరారైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకుల నుంచి రొటోమాక్ పెన్నుల కంపెనీ అధినేత కొఠారి రూ.800 కోట్ల రుణాలు పొందినట్లు సమాచారం. రుణ నిబంధనల్లో బ్యాంకులన్నీ 'రాజీ' పడిపోయాయని తెలుస్తోంది. అలహాబాద్ బ్యాంకు నుంచి రూ.352 కోట్లు, యూకో బ్యాంకు నుంచి రూ.485 కోట్ల రుణాలను - మిగతా 2 లో



నిలదీద్దాం!

- అవిశ్వాస తీర్మానానికి ఎంపీలందరూ మద్దతివ్వాలి
- బడ్జెట్ సమావేశాల్లోపే ఢిల్లీలో వేడి పుట్టించాలి
- ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై మధు, చలసాని శ్రీనివాస్, రఘువీరారెడ్డి, కొణతాల, ముప్పాళ్ల తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సహా విభజన చట్టంలోని హామీల అమలుకోసం ఐక్య ఉద్యమాలు, పోరాటాల ద్వారా కేంద్రాన్ని నిలదీయాలని వక్తలు పిలుపునిచ్చారు. పార్టీల పరంగా ఎవరి ఎజెండాలు వారికున్నప్పటికీ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ముక్తకంఠంతో నినదించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. నాలుగేళ్లుగా మాయమాటలతో మోసం చేస్తున్న బీజేపీ-టీడీపీల నాటకాలను బహిరంగసభలు, సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ పాలనకు చరమగీతం పాడేందుకు పార్లమెంటులో పెట్టే అవిశ్వాస తీర్మానానికి ఎంపీలంతా మద్దతివ్వాలన్నారు. లేకపోతే చరిత్రహీనులుగా మారిపోవడం ఖాయమన్నారు. ప్రత్యేక తరగతి హోదా సాధించే - మిగతా 11 లో

1న గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు

11 లో

ఘరానా దొంగలు

- నిబంధనల్లో లోపాలే వీరికి చుట్టాలు
- కోట్లు కుమ్మరిస్తున్న బ్యాంకులు
- ఆర్భాటానికి ఏ మాత్రం తగ్గరు
- బ్రాండ్ అంబాసిడర్లుగా సెలబ్రిటీలు
- ఆనక విదేశాలకు చెక్కుడు
- రప్పించడం తలకు మించిన భారం



విజయ్‌మాల్యా



సంజయ్ భండారీ



దీపక్ తల్వార్



లలిత్ మోడీ



నీరవ్ మోడీ

దేశంలో వైట్ కాలర్ నేరాలు పెరిగిపోతున్నాయి. దురదృష్టవశాత్తూ వీటికి జాతీయ బ్యాంకులు వేదికగా మారుతున్నాయి. బడాబాబులు కావడం, ఎక్కడాలేని హడావుడి సృష్టిస్తూ, లేని దర్పాన్ని నటిస్తూ అప్పుల కోసం బ్యాంకులకు రావడం, బ్యాంకింగ్ నిబంధనల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని అప్పులు తీసుకోవడం పరిపాటిగా మారింది. ఇలాంటి మోసాలు బయట పడిన తరువాత ప్రభుత్వ రంగ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి ఓ పదిరోజులో, పదిహేను రోజులో కాస్త హడావుడి సృష్టిస్తాయి. వారిపై కేసులు నమోదు చేస్తాయి. ఇంతవరకే... వారు ఎక్కడున్నారో తెలుసు, ఏం చేస్తున్నారో తెలుసు... అయినా ఏం చేయలేని పరిస్థితి. విదేశాల నుంచి వారికి ఇక్కడకు రప్పించడం భారత్‌కు తలకుమించిన భారం. 11లో



బారులు తీరిన ఓటర్లు (ఇన్‌సెట్‌లో) ఓటు వేస్తున్న సీఎం మాణిక్ సర్కార్

త్రిపుర ఎన్నికలు

ప్రశాంతం

- 76 శాతం ఓటింగ్
- మార్చి 3న ఫలితాలు

అగర్తలా : త్రిపుర రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 60 మంది సభ్యుల అసెంబ్లీలో 59 స్థానాలకుగాను ఆదివారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. సీపీఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దేబర్మ మరణం తర్వాత చరులం నియోజకవర్గంలో ఓటింగ్ మార్చి 12కు వాయిదా పడింది. త్రిపురలో 76 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు)తో చిన్నపాటి సమస్య మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. 3,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23 మంది మహిళలతో సహా 292 మంది అభ్యర్థుల అదృష్టాన్ని ఈశాన్య రాష్ట్రంలో జరిగిన ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి. రాష్ట్రంలో 25 ఏళ్లుగా - మిగతా 2 లో

రాజ్యాంగ రక్షణకు ఐక్యవేదిక : సురవరం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : బీజేపీ నుంచి దేశానికి విముక్తి కలిగించడమే తమ లక్ష్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి స్పష్టం చేశారు. దేశంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నెలకొందని, ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలకు వామపక్ష శక్తులే కీలకభూమిక పోషిస్తాయని చెప్పారు. ఎన్నికలకు సంబంధం లేకుండా రాజ్యాంగ పరిరక్షణ కోసం లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, ప్రగతిశీల శక్తులు, వ్యక్తులతో ఐక్య వేదికను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సంఘపరివార్ ఫాసిజాన్ని నిలువరించడానికి ప్రతిఘటన ఉద్యమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. మితవాద అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో బలమైన పోరాటాలు సాగిస్తామన్నారు. బీజేపీ అధికారంలో కొచ్చాక అభద్రతభావం, భయం పెరిగాయన్నారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో పార్టీ రాష్ట్ర సహాయకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి సురవరం మీడియాతో మాట్లాడారు. అంతకుముందు సీపీఐ రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని పత్రికలకు విడుదల చేశారు. మహాసభల్లో రాజకీయ తీర్మానంపై చర్చ ఉంటుందని, దీనిపై పార్టీ సభ్యులు అభిప్రాయం చెబుతారని పేర్కొన్నారు. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ యువతను రెచ్చగొడుతున్నారని సుధాకరరెడ్డి విమర్శించారు. అరబ్ దేశాలను రెచ్చగొడుతూ అమెరికా ఆయుధ వ్యాపారం చేసుకుంటుందని విమర్శించారు. ఇచ్చిన హామీలు విస్మరించిన నరేంద్రమోడీ దేశంలో మతఘర్షణలు రెచ్చగొడుతున్నారని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత అంబానీ, అదానీతో పాటు ఇతర సంపన్న వర్గాల ఆస్తులు 49శాతం నుంచి 73 శాతానికి పెరిగాయని, నరేంద్రమోడీ ఎవరికోసం పనిచేస్తున్నారని ప్రశ్నించారు. వామపక్ష లౌకికవాదులు, మేధావులు ఒకే వేదికను - మిగతా 2 లో





ఇరాన్ విమానం కూలి 66 మంది మృతి

టెహ్రాన్ : ఇరాన్ ప్రయాణీకుల విమానం ఆదివారం కూలిపోయి 66 మంది మృతిచెందారని ఎయిర్‌లైన్స్ కంపెనీ అధికారులు తెలిపారు. ది అసిమన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టెహ్రాన్ నుంచి యాసుజ్ నగరానికి బయలుదేరింది. మార్గంలో జాగ్రోస్ పర్వతాల్లో కూలిపోయింది. రెడ్‌క్రిసెంట్ సంస్థ గాలింపు, సహాయ బృందాలను విమానం కూలిన ప్రాంతానికి పంపింది. ఈపీ 3704 విమానం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు టెహ్రాన్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన గంట తరువాత రాడార్‌కు సిగ్నల్స్ అందలేదు. యాసూజ్ నగరానికి 22 కిలోమీటర్ల దూరంలోని దీనా పర్వతాలలో విమానం కూలిపోయినట్టు - మిగతా 2 లో

సీపీఐ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు మరో 14మంది కార్యవర్గ - మిగతా 2 లో



మోడీ సర్కారుపై ముప్పేట దాడి

బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రం : కాంగ్రెస్ డిమాండు

సుపరిపాలన అంటే ఇదేనా మమత, మాయావతి

అరుణాచల్ సీఎంపై అత్యాచార ఆరోపణ

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

మోడీ నోట మళ్లీ దేశభక్తి మాట

9 లో

ఇదీ లోకం!



మీకు లోన్ ఇవ్వడానికి మాకేం అభ్యంతరం లేదు..కానీ విదేశాలకు పారిపోడానికి మీకు సొంత విమానం ఉంది కదా?

టీడీపీ దోస్తీపై కాషాయ పార్టీలో చీలిక

- మిత్రపక్షంపై బీజేపీలో భిన్నాభిప్రాయాలు
- అబద్ధాలపై బస్సుయాత్ర చేద్దామన్న నేతలు
- నిర్ణయాలు కాదు సూచనలివ్వండి హరిబాబు సీరియస్
- అరుపులు, కేకలతో దద్దరిల్లిన సమావేశం
- సర్దిచెప్పిన మాణిక్యాలరావు, విష్ణుకుమార్, పురందేశ్వరి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : టీడీపీతో దోస్తీపై కాషాయ పార్టీలో చీలికలు ఏర్పడ్డాయి. ఒక వర్గం టీడీపీతోనే కలిసి 2019 ఎన్నికల్లో పోటీ చేయాలని సూచిస్తే, మరో వర్గం ఎట్టి పరిస్థితిలోనూ కలిసి ఉండే ప్రసక్తేలేదంటూ తెగేసి చెప్పేసింది. ఇదే విషయాన్ని అధిష్టానానికి తెలియజేయా లని కూడా గట్టిగా డిమాండు చేసింది. ఇప్పటికే బీజేపీ శాసనపక్ష నేత పీ విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజుతోపాటు కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి టీడీపీతో తెగతెంపులు చేసుకునేరీతిలో బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే మరో వర్గం మాత్రం - మిగతా 2 లో

మినీ యార్డులుగా కోల్డ్ స్టోరేజ్‌లు

ఈ-నామ్ వెబ్‌సైట్ ద్వారా జాతీయ మార్కెట్‌లో ఏపీ రైతు ఉత్పత్తులు



విశాలాంధ్ర - అమరావతి : ఈ ఏడాది నుండి వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచే శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజ్)లు మినీ మార్కెట్ యార్డులుగా మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్) పథకం వల్ల ఇది సాధ్యం కానుంది. ఈ-నామ్ పథకాన్ని గతేడాదే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి దేశంలో కొన్ని మార్కెట్‌యార్డుల్లో ఈ పథకాన్ని మోడల్‌గా ప్రవేశపెట్టింది. ఈ ఏడాది నుండి అన్ని మార్కెట్‌యార్డుల్లో ఈ-నామ్ అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు రైతులు తమ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించేవరకు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచుతారు. సరైన ధర లభించేవరకు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచినందుకు అద్దె చెల్లించాలి. రైతు ఉత్పత్తికి ధర లభించకపోతే అద్దెల నష్టం కూడా రైతు భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో దాదాపు 250 వరకు శీతలగిడ్డంగులు ఉన్నాయి. ప్రధానంగా గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ఆయా ప్రాంతాల రైతు ఉత్పత్తులను నిల్వ ఉంచుతారు. అయితే ఇక నుండి ఈ పద్ధతిలో మార్పు వస్తుంది. అన్ని మార్కెట్‌యార్డుల పరిధిలో కోల్డ్ స్టోరేజ్‌లు ఉండేలా, మార్కెట్‌యార్డుల్లో క్వాలిటీ ల్యాబ్‌లు కూడా దశలవారీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటివల్ల రైతు తాను పండించిన వాణిజ్య పంటలు మిర్చి, పత్తి, ఇతర ఉత్పత్తులు కోల్డ్ స్టోరేజ్‌లకు చేర్చి తన ఉత్పత్తులకు సంబంధించిన ల్యాబ్ రిపోర్ట్‌ను తీసుకుంటాడు. ప్రస్తుతానికి రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు మిర్చియార్డులో 35లక్షలతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. మిర్చి పండించిన రైతు తాను పండించిన మిర్చికాయను ల్యాబ్‌కు అందిస్తే అందులో కారం, నూనె, రంగు, ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం, నాణ్యత, సైజుల వివరాలతో కూడిన నివేదికతో పాటు రైతు పేరు, గ్రామం, పంట విస్తీర్ణం, - మిగతా 2 లో

పోలెండ్ ప్రధానిపై నెతన్యాహు విమర్శ



టెల్‌అవీవ్ : సర్వవినాశనానికి యూధులే కారకులని పోలెండ్ ప్రధాని వ్యాఖ్యానించారని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హేళనచేశారు. మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సదస్సులో పోలెండ్ ప్రధాని మాటిజ్ మొరావికి రెచ్చిపోయారని నెతన్యాహు వ్యాఖ్యానించారు. పోలెండ్ పాలకులు చరిత్రను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు. నాజీల నేరాల పట్ల అలక్ష్యం వహించడం, పోలెండ్‌ను నిందించడం చట్టవిరుద్ధంగా పరిగణించాలని పోలెండ్ ఇటీవల ఒక చట్టాన్ని రూపొందించింది. అయితే, ఈ చట్టాన్ని ఇజ్రాయిల్ ఖండించింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధమేనా?కాదా? అని పోలెండ్ సర్వోన్నత న్యాయస్థానం తేల్చనున్నది. సర్వవినాశనానికి కారకులైన వారితో పోలెండ్ పాలకులు కుమ్మక్కయారా? అని ఇజ్రాయిల్ జర్నలిస్టు ఒకరు ప్రశ్నించారు. అయితే, వినాశకారకులతో కుమ్మక్కైనట్టు ప్రచారం చేయడం పోలెండ్ చట్టం క్రింద నేరంగా పరిగణిస్తారు. నెతన్యాహు విమర్శపైన పోలెండ్ ప్రధాని మొరావికి బహిరంగంగా స్పందించలేదు. అయితే, వాస్తవాలకు విరుద్ధంగా పోలెండ్‌ను లేదా ప్రభుత్వాన్ని నిందించిన వారు నాజీలు జరిపిన నేరాల పట్ల నిర్లక్ష్యంవహించినట్టేనని, ఆ నేరాలకు వారే బాధ్యులవుతారని పోలెండ్ పేర్కొన్నది.

రష్యా ప్రమేయం లేదు : వైట్‌హౌస్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలుపు కోసం రష్యా సహకరించిందన్న ఆరోపణలలో నిజం లేదని వైట్‌హౌస్ తెలిపింది. రష్యా ప్రమేయం ఆరోపణలపై ప్రత్యేక విచారణాధికారి రాబర్టు ముల్లర్ 13 మంది రష్యన్ జాతీయులు ట్రంప్ గెలుపు కోసం సహకరించినట్టుగా వెల్లడించడంతో వైట్‌హౌస్ తాజాగా ఈ ప్రకటన చేసింది. 2016లో అమెరికా అధ్యక్షుడి పదవికి ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ట్రంప్ గెలుపునకు రష్యా సహకరించిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. రష్యా పాత్ర తన గెలుపులో ఏమీలేదని ట్రంప్ అనేక ట్వీట్లు చేశారు. ట్రంప్ ప్రచారానికి కూడా రష్యా ఏమీ సహకరించలేదని ఆయన పేర్కొన్నారు. మరో ట్వీట్‌లో ట్రంప్ డిప్యూటీ అటార్నీ జనరల్ రడ్ రోసెల్‌స్టెలిన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ అమెరికా అధికారులతో రష్యా కుమ్మక్కు కాలేదని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా న్యాయశాఖ ముల్లర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా 13 మంది రష్యన్ జాతీయులపైన, మూడు రష్యన్ సంస్థలపైన అభియోగాలను నమోదుచేసింది.

విశాలాంధ్ర ప్రపంచం

మాల్దీవులను రక్షించండి

భారత ప్రభుత్వానికి నషీద్ విజ్ఞప్తి



మాలే : కల్లోల పరిస్థితులు నెలకొనివున్న మాల్దీవులను రక్షించాలని ఆ దేశ మాజీ అధ్యక్షుడు, ప్రవాసంలో ఉన్న మహ్మద్ నషీద్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంపైన ఒత్తిడి చేసి న్యాయంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించేలాగా చూడాలని నషీద్ కోరారు. సైన్యాన్ని పంపించమని తాను కోరడంలేదని, భారత ప్రభుత్వం కనుక తన అధికారాన్ని వినియోగించి దూతను పంపడం ద్వారా మాల్దీవుల అధ్యక్షుడు యమీన్‌పై ఒత్తిడి చేయాలని ఆయన కోరారు. భారతదేశం చెప్పితే యమీన్ వింటాడని నషీద్ అన్నారు. మాల్దీవులలో ప్రభుత్వం మారాలని కూడా తాను కోరడం లేదని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేందుకు తాత్కాలిక ఏర్పాటు జరగాలని తాము కోరుకుంటున్నామని నషీద్ తెలిపారు. తక్షణం భారత్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు.

హిందూమహాసముద్రం ప్రాంతంలో తమ పరిస్థితి ఏమిటని ఆలోచించుకోవాల్సిన సందర్భం ఏర్పడిందని ఆయన అన్నారు. పోటీరంగంలో మరెవరూ లేకుండా 2018లో అధ్యక్ష ఎన్నికలు జరిగితే యమీన్ తప్ప మరొకరు గెలిచే అవకాశంలేదని నషీద్ చెప్పారు. యమీన్ పరిపాలిస్తే కనీసం మరో పదేళ్లు నియంతృత్వ పాలనలో ఉండాల్సి వస్తుందని నషీద్ అన్నారు. ఆ పరిస్థితి ఏర్పడితే భారత్‌కానీ, మరెవరైనా కానీ మమ్మల్ని రక్షించే అవకాశం ఉండదని ఆయన అన్నారు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల మూలంగా, భూముల ఆక్రమణ కోసం మరిన్ని అధికారాలు కావాలని ప్రయత్నించడం వల్ల ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. భద్రతా దళాలు, న్యాయవ్యవస్థ, వివిధ ప్రభుత్వ ఏజెన్సీలలోని కీలక స్థానాలలో ఉగ్రవాదులు చేరి తమ పనులు నిర్వర్తించుకుంటున్నారని, వీధిరౌడీలుగా సైతం చలాయిస్తున్నారని నషీద్ అన్నారు. ఉగ్రవాదులు దేశంలో పోటీప్రభుత్వాన్ని నడుపుతున్నారని చెప్పారు. మానవహక్కులకు రక్షణలేని దేశాలలో భూముల ఆక్రమణ విచ్చలవిడిగా సాగుతోందని మాల్దీవులు అందుకు మినహాయింపుగా లేదని నషీద్ అన్నారు.

అమెరికా దళాలపై దాడులకు కారకులెవరు?

ప్రశ్నించిన అమెరికా రక్షణమంత్రి జిమ్ మట్టీస్

వాషింగ్టన్ : సిరియాలో అమెరికా దళాలు, అది మద్దతు తెలుపుతున్న ఇతర దళాలపై ఈ నెల 7వ తేదీన దాడులకు ఎవరు పురికొల్పారు? అమెరికా రక్షణ శాఖ మంత్రి జిమ్ మట్టీస్ ఈ ప్రశ్నలు సంధిస్తున్నారు. దాడులకు బహుశా రష్యా పౌర కాంట్రాక్టర్లే కారణమై ఉండవచ్చునని మట్టీస్ అన్నారు. రష్యా ప్రైవేట్ సైనిక సంస్థకు చెందిన దళాలు సిరియాలో దాడులు జరిపి ఉండవచ్చునని రాయటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఈ దాడులలో సిరియా ప్రభుత్వ అనుకూల దళాలకు చెందిన వందమంది చనిపోయి ఉంటారని అమెరికా చెపుతోంది. అయితే, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని రష్యన్ సైనికాధికారులు చెప్పారు. ఇది జరిగిన తరువాత పది రోజులకు మట్టీస్ మాట్లాడడమేమిటని రష్యన్ అధికారులు ప్రశ్నించారు. పది



రోజుల తరువాత కూడా ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని మట్టీస్ పూర్తిగా చెప్పలేకపోతున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశం తిరిగి వచ్చిన మట్టీస్ ఈ దాడులను స్థానికంగా ప్రోత్సహించారా?లేకపోతే విదేశీ శక్తులు ప్రేరేపించాయా? అని ప్రశ్నించగా ఆ విషయమై తనను అడగవద్దని మట్టీస్ అన్నారు. ప్రైవేట్ సైనిక కాంట్రాక్టర్లు ఇందులో భాగస్వాములై ఉండవచ్చుననే అంశం మాస్కోకు తెలియవచ్చు అని మట్టీస్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా నాయకత్వంలోని దళాలకు, సిరియా ప్రభుత్వ దళాలకు మధ్య జరిగిన ఘర్షణలలో ఐదుగురు రష్యన్ పౌరులు చనిపోయారని ఆ దేశ అధికారులు తెలిపారు. సిరియాలో తమ ప్రైవేట్ సైనిక కాంట్రాక్టర్లు ఎవరూ లేరని, తాము అలాంటి వారిని ఎవరిని నియమించలేదని రష్యా అధికారులు స్పష్టంచేశారు.



ఆస్ట్రేలియాలో రెడ్‌అలర్ట్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా పశ్చిమ ప్రాంతంలో కెల్విన్ తుపాను బీభత్సం సృష్టించే అవకాశం ఉందని ప్రభుత్వం ఆదివారం రెడ్‌అలర్ట్ ప్రకటించింది. తుపాను తీరందాటడంతో గంటకు 250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని, అయితే తక్షణం ఆందోళన చెందవద్దని అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగాలు హెచ్చరించినట్టుగా జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. పిల్‌బరా, కింబర్లీ ప్రాంతాలలో ప్రజలు తమ ఇళ్లలోనే సురక్షిత ప్రదేశాలలో ఉండవలసిందిగా ప్రభుత్వం హెచ్చరించింది. కిటికీలు, తలుపుల వద్ద కాకుండా ఖాళీ ప్రాంతాలలో ఉండాలని సూచించింది. ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతంలో గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనా శాఖ హెచ్చరించింది.

తుపాకి చట్టాలను కట్టుదిట్టం చేయాలి

విద్యార్థులపై కాల్పులకు నిరసనగా ప్రదర్శన

వాషింగ్టన్ : పార్క్‌ల్యాండ్ డగ్లస్ హైస్కూల్‌లో మూడు రోజుల క్రితం స్కూల్ పిల్లలపై మాజీ విద్యార్థి కాల్పులు జరిపి 17 మందిని పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. వారికి సంతాపం తెలుపుతూ ఆయా కుటుంబ సభ్యులు, విద్యార్థులు విషణ్ణ వదనంతో ప్రదర్శన జరిపారు. ర్యాలీలో పాల్గొన్న వారు అత్యధికులు ఎంతో ఆవేదనతో తమ బాధను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు తుపాకుల వినియోగ చట్టాలను కట్టుదిట్టం చేయాలని వారు డిమాండు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మాత్రమే కాకుండా ఉపాధ్యాయులు సైతం ఈ ర్యాలీలో పాల్గొని తమ సంతాపం తెలిపారు. చట్టాలను కట్టుదిట్టం చేయడానికి పూనుకోకుండా ఉన్న నేతలను ఓటర్లు తిరస్కరించాలని వారు నినదించినట్టు మీడియా తెలిపింది. ఈ నెల 14వ తేదీన ఆ స్కూల్ పూర్వ విద్యార్థి విద్వేషంతో పిల్లలపై కాల్పులు జరిపినట్టు సీఎన్ఎన్ పేర్కొన్నది. ఇప్పటికైనా చట్టాల రూపకర్తలు కనీసం విద్యాలయాలలో కాల్పులు జరగకుండా తగిన చర్యలు తీసుకో వాలని ప్రదర్శకులు కోరారు. తుపాకులు కొనుగోలు చేయకుండా వారాంతపు సెలవు రోజుల్లో స్నేహితులతో సంతోషంగా గడిపేందుకు ఎందుకు ప్రయత్నించడంలేదో అర్థం చేసుకోలేకపోతున్నామని డగ్లస్ స్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయులు ఎమ్మా గుంజాలెజ్ అన్నారు. కాల్పులు జరిగినప్పుడు తాను ఆడిటోరియంలో ఉన్నానని చెప్పారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ వద్ద విరాళాలు తీసుకుని వారికి ప్రచారం అందించే రాజకీయ నాయకులు ఇలాంటి ఘటనలకు సిగ్గుపడాలని గుంజాలెజ్ విమర్శించారు. రాజకీయ నాయకులు సిగ్గుపడాల్సిన అంశమని ప్రదర్శకులు నినాదాలు చేశారు. తుపాకుల వినియోగ చట్టాలను సవరించాలని ఆమె కోరారు.

నైజీరియాలో 20వేల మంది మృతి

బొకోహరం మిలిటెంట్ల తిరుగుబాటు పరిణామం

అబూజా : నైజీరియాలోకి బొకోహరం తీవ్రవాదులు వచ్చిన తరువాత దాదాపు 20వేల మంది దేశ ప్రజలు మరణించగా, 20 లక్షల మందికిపైగా ప్రజలు తమ ఇళ్లను వదిలిపెట్టి ఇతర దేశాలకు వలస వెళ్లిపోయారు. బొకోహరం తీవ్రవాదులు నైజీరియాని ఇస్లాం రాజ్యంగా మార్చే యోచనతో 2009లో దేశంలో తిరుగుబాటుకు శ్రీకారం చుట్టారు. ఇస్లామిక్ తీవ్రవాదుల చొరబాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని న్యాయమంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. బొకోహరం తీవ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్నట్టు భావిస్తున్న 475 మందిని నైజీరియా కోర్టు ఆదివారం విడుదల చేసింది. 2014లో చిబక్ పాఠశాల బాలికలను కిడ్నాప్ చేసినందుకుగానూ గత వారం ఒక తీవ్రవాదికి 15 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. అనుమానితులను అరెస్టు చేసి జైలులో పెట్టడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బొకోహరం తీవ్రవాదులుగా భావిస్తున్న వారిని వదిలిపెట్టారు. గత వారం నిర్బంధంలో ఉన్న కొంతమంది తీవ్రవాదులను 2010 తరువాత మొదటిసారిగా కోర్టు విచారించిందని న్యాయమంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, వీరిపైన తగిన సాక్షాధారాలు లేనందువల్ల పోలీసులు కేసులు నమోదు చేయలేకపోయారు. గత అక్టోబరులో 45 మందిని బొకోహరంతో సంబంధాలున్నాయన్న అనుమానంతో అరెస్టు చేసి దోషనిర్ధారణ కావడంతో జైలులో పెట్టారు.

కోట్లెత్తేశాడు..?

(మొదటిపేజీ తరువాయి)

కొఠారి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధాన మొత్తానికి వడ్డీ కూడా చెల్లించలేదు. కాన్పూర్ నగరం కేంద్రంగా పని చేస్తున్న కొఠారి కార్యాలయం గత కొన్ని వారాలుగా మూతపడి ఉంది. కొఠారి జాడ కూడా ప్రస్తుతం కనిపించడం లేదు. రుణ మొత్తాన్ని స్వాధీనం చేసుకునేందుకు సంస్థ ఆస్తులను వేలం వేయాలని బ్యాంకులు యోచిస్తున్నాయి. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) పెరిగి పోతుండటంతో బ్యాంకులను రీక్యాపిటలైజేషన్‌తో ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుండగా రుణ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తూ బ్యాంకులకు సమ్మెట పోటుగా మారాయి.

బ్యాంకుల అంతర్గత నియంత్రణ, ఆడిటింగ్‌లో నిర్లక్ష్యమే ఈ రుణ మోసాలకు దోహదపడు తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.11,400 కోట్ల భారీ పీఎన్‌బీ కుంభకోణం మొత్తంతో పోల్చితే ఈ రూ.800 కోట్లు స్వల్పమే అయినప్పటికీ, ఈ రుణ మోసాల భారాలు ఖజానాను, సామాన్యుడిని ఛిద్రం చేసే అవకాశాలు ఉన్నాయి.

ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఎం అధికారంలో ఉంది. కాగా బీజేపీ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)తో పొత్తు పెట్టుకుని 51 స్థానాల్లో పోటీ చేసింది. ఐపీఎఫ్‌టీకి తొమ్మిది స్థానాలు ఇచ్చింది. సీపీఎం 57 స్థానాల్లో తన అభ్యర్థులను పోటీకి నిలిపింది. ముఖ్యమంత్రి మాణిక్ సర్కారు సొంత నియోజకవర్గం దంపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. కాగా ఎన్నికల ఫలితాలు మార్చి 3న వెలువడతాయి.

సీపీఐ కార్యదర్శిగా తాటిపాక మధు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా, సమితి 55 మంది ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నల్లారామారావు(రాజమహేంద్రవరం), కె.సత్తిబాబు (అమలాపురం), మండా దుర్గాప్రసాద్(కూనవరం), నక్కా కిషోర్(కాకినాడ), తోకల ప్రసాద్(భవన నిర్మాణం), దేవ రాజేంద్ర ప్రసాద్(రాజోలు), వంగమూడి కొండలరావు(జట్లు లేబర్ యూనియన్), పి.సత్యనారాయణ (సామర్లకోట), జుత్తుక కుమార్ (రంపచోడవరం), కుంచే అంజిబాబు(పిఠాపురం), ఎం.నాగమణి(ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య), పి.రాము(రామచంద్రపురం), నక్కా శ్రీనివాసరావు(రైతు సంఘం), కిర్ల కృష్ణ(ఏఐటీయుసి), ఆహ్వానితులుగా డాక్టర్ సి.స్టాలిన్, టి.అన్నవరం, నల్లా భ్రమరాంబలు

కాషాయ పార్టీలో చీలిక

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. లోక్‌సభలో ఆర్థికశాఖ మంత్రి అర్జున జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి మిత్రపక్షాలు బీజేపీ, టీడీపీ మధ్య కొద్ది రోజులుగా మాటలయుద్ధం సాగు తోంది. ఈ నేపథ్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, మంత్రులు, ఎమ్మె ల్యేలు, ఎంపీల సమావేశం అరుపులు, కేకలతో దద్దరి ల్లింది. టీడీపీతో దోస్తీపై పార్టీలోని నేతలు, ప్రజా ప్రతిని ధులు రెండు వర్గాలుగా చీలిపోయారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలకంటే ఎక్కువగానే చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వంపైనా, బీజేపీ నేతలపైనా టీడీపీ నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకునేదిలేదంటూ ఒక వర్గం నాయకులు మండిపడ్డారు. టీడీపీ అబద్దాలపై రాష్ట్రంలో బస్సు యాత్ర చేసి వాస్తవాలను చెప్పటంతోపాటు టీడీపీతో మైత్రిని కట్ చేసుకోవాలంటూ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీపతిరాజా ఆవేశంగా చెప్పారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు సీరియస్ అయ్యారు. సమావేశంలో ఏం చేయాలో సూచనలే ఇవ్వాలేగానీ, నిర్ణయాలు చెప్పొ ద్దంటూ హెచ్చరించారు. దీనిపై లక్ష్మీపతిరాజా కూడా అంతేస్వరంతో తమకూ బాధ్యతలు తెలుసంటూ హరిబాబుకు కౌంటర్ ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం నెలకొంది. అరుపులు, కేకలతో నాయకులు ఏం మాట్లాడుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. హరిబాబు, లక్ష్మీపతి రాజా మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. సమావేశం అదుపుతప్పే సూచనలు కనిపించటంతో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి పీ మాణి క్యాలరావు, బీజేపీ శాసనపక్ష నేత పీ విష్ణుకుమార్ రాజు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి వేదికపై నుంచి దిగి వచ్చి లక్ష్మీపతిరాజాకు సర్ది చెప్పటంతో వివాదం కాస్త సర్దుమణిగింది. అయితే పదాధికారుల సమావేశంలో మాత్రం టీడీపీతో కలిసి ఉండాలా, వద్దా అనే అంశంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం.

చేసింది చెప్పుకోపోతే కాంగ్రెస్ గతే

రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ఏం చేసిందో చెప్పుకోకపోతే తెలంగాణాలో కాంగ్రెస్‌కు ఏ గతి పట్టిందో రాష్ట్రంలోనూ పార్టీకి అదే గతి పడుతుందని పార్టీ నాయకులు పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. సీఎం మొదలు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులుసైతం బీజేపీని బజారుకీడుస్తుంటూ చూస్తూ ఎలా ఊరుకోవాలని పలువురు ప్రశ్నించినట్లు సమాచారం. మూడున్నర సంవత్సరాలలో బిల్లులో ఉన్నవి ఏం చేశాం, లేనివి ఏం చేశామో ప్రజలకు వివరించేలా నాయకులు సిద్ధంకావాలని హరిబాబు సూచించారు. ఇప్పటికే బీజేపీపై రాష్ట్రంలో మచ్చపడిందని, దీనిని రూపుమాపుకోవాలంటే 13 జిల్లాల్లోనూ యాత్రలు చేయాల్సిందేనని మరికొందరు పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఎట్టిపరిస్థితిలోనూ విమర్శలను ఘాటుగా తిప్పికొట్టాల్సిందేనని సమావేశంలో నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్సీ సోము వీర్రాజు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఎక్కడ, ఎపుడు చర్చ పెట్టినా వస్తామన్నారు. చర్చకు చంద్రబాబు కూడా వస్తే తామూ వస్తామన్నారు. ఢిల్లీ తరహాలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తుంటే, సహకరించకపోవటం శోచనీయమన్నారు. కేంద్రం ఏం చేసిందో రిపోర్టు ఇవ్వాల్సిన పరిస్థితి తమ పార్టీ అధ్యక్షుడు హరిబాబుకేం పట్టలేదన్నారు.

టీడీపీ దాడిని తిప్పికొడతాం : విష్ణుకుమార్‌రాజు

మిత్రపక్షం టీడీపీ తమపై చేస్తున్న దాడిని తిప్పికొడతామని పదాధికారుల సమావేశం అనంతరం బీజేపీ శాసనపక్ష నేత పీ విష్ణుకుమార్‌రాజు చెప్పారు. ప్రజలకు వాస్తవాలను వివరించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. విభజన హామీలు అమలు చేయటానికి చాలా సమయం ఉన్నా, మూడున్నర సంవత్సరాల్లోనే చాలా చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మొత్తాలాను రెవెన్యూ లోటుతో కలపటం సరికాదన్నారు. ఇదిలావుండగా, ప్రజల కోసం బీజేపీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఒక్క ఎంపీ తక్కువగా ఉండటంతో ప్రభుత్వాన్నే వదులుకున్నామని, అవసరం లేకున్నా ఇతర పార్టీల వాళ్లను లాగటం ఇపుడు చూస్తున్నామంటూ టీడీపీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు మిస్టర్ పీఎం అని సంబోధిస్తున్నారని, కాని తమది మిస్టర్ సీఎం అనే సంస్కృతికాదన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు అసెంబ్లీని వేదికగా చేసుకుంటామన్నారు. ఏపీకి బీజేపీ ద్రోహం చేసింది, మోసం చేసిందనే భాష సరికాదని చెబీఎప్పారు. మిత్రపక్షంగా ఉంటూ దిష్టిబొమ్మలు దగ్ధం చేయటం సరికాదన్నారు. ఇదిలావుండగా, బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ, పదాధికారుల సమావేశంలో ఎలాంటి గొడవలు జరగలేదన్నారు. టీడీపీ మాతో ఉంటేనే చంద్రబాబు సీఎం అవుతారని, మరి ఆ పార్టీ మిత్రపక్షంగా ఉంటుందో, ఉండదో తేల్చుకోవాల్సిందే ఆ పార్టీ నేతలేనన్నారు.

హోంగార్డులకు రోజుకు రూ.667.80 ఇవ్వండి

- రూ.400తో భారంగా కుటుంబ పోషణ
- పని భారమూ పెరుగుతోంది
- అధికారుల ఇళ్లల్లో పనులన్నీ చేయాల్సిందే
- వేతనాల పెంపుపై ఒక్కరూ పట్టించుకోరు
- బడ్జెట్‌లో నిధుల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు

విశాలాంధ్రబ్యూరో – అమరావతి

సాధారణ పోలీస్ కానిస్టేబుల్ చేస్తున్న అన్ని రకాల పనులనూ హోంగార్డులతోనూ చేయిస్తున్నారు. ఎనిమిది గంటల డ్యూటీ పేరుతో రోజుకు 12 నుంచి 16 గంటలపాటు పని చేసే హోంగార్డులూ ఉన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్, డీఎస్పీ, ఏసీపీ, ఎస్పీ, డీసీపీ, పోలీస్ కమిషనర్ ఇలా అందరి ఇళ్లలోనూ కనీసం ఇద్దరు ముగ్గురు పని చేస్తూ ఉంటారు. వారి పిల్లలను స్కూళ్లకు తీసుకు వెళ్లటం, మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకురావటం, తోట పని, ఇంటి పని ఇలా ఒక్కటేంటీ అన్ని రకాల పనులనూ చేయించుకుంటున్నారు. కాని వేతనాల పెంపు విషయంలో మాత్రం ఒక్కరంటే ఒక్కరూ సహకరించని పరిస్థితి నెలకొంది. పోలీసు కానిస్టేబుల్‌తో సమానంగానే కాదు వారికంటే ఎక్కువగానే కష్టపడుతున్నా అందుకు తగ్గ ప్రతిఫలం లభించటంలేదు. ఇప్పటికీ రోజువారీ వేతనం కిందే వీరంతా పని చేస్తుతన్నారు. అనేక సంవత్సరాల ఫలితంగా రోజువారీ వేతనం రూ.400కు పెంచినా, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇళ్ల అద్దెలు, ఫీజులు తదితరవి తలకుమించిన భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా తమ వేతనాలను పెంచేలా అన్ని రాజకీయ పార్టీల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా హోంగార్డులు అడుగులు వేస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్ మూలవేతనంతో సమానంగా వేతనాలు చెల్లించాలనే డిమాండును మరోసారి వారు తెరపైకి తెచ్చారు. వచ్చే నెల ఐదో తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 వేల మంది హోంగార్డులకు రోజువారీ వేతనాన్ని రూ.667.80గా చెల్లించాలని రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసు కానిస్టేబుల్ మూల వేతనానికి సమానంగా ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. ఏటా తమ వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇస్తుందేగానీ, అది కార్యరూపం దాల్చటంలేదంటున్నారు.

సర్వీస్ ఆర్గనైజేషన్‌నంటూ...పనులన్నీ...

హోంగార్డులది సర్వీస్ ఆర్గనైజేషన్ అంటూనే అన్ని రకాల పనులనూ ప్రభుత్వం చేయించుకుంటుంది. పోలీస్ స్టేషన్‌తోపాటు ట్రాఫిక్ డ్యూటీలు, జీపు డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఇతర అనేక రకాల పనులలో వీరు పని చేస్తున్నారు. చివరకు అధికారుల ఇళ్లల్లోనూ నానా చాకిరీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేసినా, హోంగార్డులు మాత్రం పోలీసు ఉన్నతాధికారుల ఇళ్లల్లో పనులు చేస్తుండటం గమనార్హం. పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం వేతనాల దగ్గరకొచ్చే సరికి సర్వీస్ ఆర్గనైజేషన్ అంటూ మెలిక పెట్టటంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల వారీ వేతనాన్ని రూ.20,034గా చెల్లించేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయాలని సంఘం నాయకులు డిమాండు చేస్తున్నారు. అందులో భాగంగానే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ కూర్పుపై అన్ని శాఖలతో సమీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తమకూ అదనంగా బడ్జెట్‌ను కేటాయించేలా చూడాలని వారు అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్రాల వారీగా హోంగార్డుల వేతనాలు

రాష్ట్రం పేరు	వేతనం (రూపాయల్లో)
ఢిల్లీ	633
పంజాబ్	972
హిమాచలప్రదేశ్	571
హర్యానా	572
తెలంగాణా	675
తమిళనాడు	560
కేరళ	600
పుదుచ్చేరి	500
నాగాలాండ్	520
గోవా	620

కోల్డ్ స్టోరేజ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

దిగుబడి వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు సమగ్రంగా అందిస్తుంది. ఆ వివరాలను క్వాలిటీ ల్యాబ్‌లు ఇచ్చిన నివేదికను రైతు ఈ-నామ్ వెబ్‌సైట్‌లోనమోదు చేయించుకుంటాడు. దేశ వ్యాప్తంగా ఉన్న ఈ వెబ్‌సైట్‌లో నమోదైన వెంటనే ఎగుమతి, దిగుమతిదారులు చూసుకొని ఉత్పత్తులు నచ్చితే వాటికి ధరను నిర్ణయించి రైతుతో నేరుగా మాట్లాడి ధరను ఖరారు చేసి చెల్లింపులు నేరుగా రైతు ఖాతాకు జమచేసి కోల్డ్ స్టోరేజ్ నుండి రైతు ఉత్పత్తిని తీసుకువెళ్ళే వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో ఉన్న రైతు ఉత్పత్తులు సైతం దేశ వ్యాప్తంగా తెలిసే అవకాశం కలుగుతుంది. నాణ్యత ఎక్కువగా ఉన్న ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలలో ఉన్న వ్యాపారులు సైతం కొనేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పోటీలో రైతుకు అధికధర లభించే అవకాశం ఏర్పడుతుంది. మార్కెట్‌యార్డుల్లోని టెస్టింగ్‌లు జరగని రైతు ఉత్పత్తులకు స్త్రైనెస్ బోర్డుల ల్యాబుల్లో పంట ఉత్పత్తుల నాణ్యత వివరాలను తీసుకొని ఈ-నామ్ వెబ్‌సైట్‌లో పొందుపరచవచ్చు. ఈ కొత్త విధానం వల్ల జాతీయ మార్కెట్‌లో ఏ ప్రాంత రైతు ఉత్పత్తినైనా కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా రైతు, వ్యాపారుల మధ్య ఉన్న దళారి వ్యవస్థ కూడా అంతమవుతుంది. రవాణా ఛార్జీల భారం కూడా రైతులకు తగ్గుతుంది. రైతులు పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెప్తున్నారు.

ఐక్యవేదిక

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుచేసి సంఘ్‌పరివార్ శక్తులను ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. నీరవ్ మోడీ కేంద్రంగా జరిగిన దోపిడీ తమ పాలనలో జరగలేదని కేంద్రం తప్పించుకుంటుందని. 2016లోనే నీరవ్ పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.17,600 కోట్లు దండుకున్నారని విమర్శించారు. 2018 జనవరిలో పారిపోయేందుకు అవకాశం ఎందుకు కల్పించారని, నీరవ్ మోడీ దావోస్‌లో మోడీతో కలిసి ఫోటో ఎలా దిగాడని. నీరవ్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేశారు. నాడు విజయ్ మాల్యా, లలిత్‌మోడీకి సహకరించినట్లుగానే నీరవ్‌కు సహకరించారన్నారు. బీజేపీ మద్దతుతోనే ఆర్థిక నేరస్థులు పెరుగుతున్నారన్నారు. 2008లో మొదలైన ఆర్థిక సంక్షోభం నేటికీ కొనసాగుతోందని విమర్శించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుపై ప్రభుత్వ వైఖరిని పారదర్శకంగా ప్రకటించాలని డిమాండు చేశారు. కర్ణాటకలో జనతాదళ్ పార్టీతో జట్టుకడతామని ప్రకటించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడి, మితవాద, మతోన్మాద సిద్ధాంత ప్రయోజనాలను కాపాడే ఫాసిస్టు ధోరణితో పాలన సాగిస్తోందన్నారు. బీజేపీ గద్దె దించడమే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. వామపక్షాలు తమ ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో నయా, ఉదారవాద విధానాలను ఎదుర్కొంటాయని స్పష్టం చేశారు. మతోన్మాదుల వల్ల లౌకికవాదం, ప్రజాస్వామ్యం, బహుళత్వం, భిన్నత్వంలో ఏకత్వం అనే అంశాలకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.

66 మంది మృతి (మొదటిపేజీ తరువాయి)

ఇరిన్ వార్తా సంస్థ తెలిపింది. జంట ఇంజిన్లుతో కూడిన ఈ విమానం ఫ్రాన్స్‌లో ఉత్పత్తి అయింది. విమానంలో 60 మంది ప్రయాణీకులు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు ఉన్నారు. ప్రయాణీకులంతా మరణించినట్టుగా ఎయిర్‌లైన్స్ ప్రతినిధి మహమ్మద్ టబాటా బాయ్ చెప్పారు. చనిపోయిన వారిలో ఒక పసిబిడ్డ కూడా ఉన్నారు. ఆ ప్రాంతంలో వాతావరణం అనుకూలించక సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలిగింది. అత్యవసర సహాయ బృందాలు ఆ ప్రాంతానికి హెలికాప్టర్ ద్వారా వెళ్లడం కంటే భూమార్గంలోనే వెళ్లడం సరైందని తెలుస్తోంది. ఇరాన్‌లో ఇటీవల కాలంలో విమానప్రమాదాలు పెరిగాయి. పాతబడిన విమానాలను వినియోగించడం వల్ల ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. అంతర్జాతీయ ఆంక్షల మూలంగా ఇరాన్ తన విమానాలను నిర్వహించడంలో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. 2015లో కుదిరిన పౌర అణుఒప్పందం మూలంగా కొన్ని ఆంక్షలను తొలగించారు. అసిమన్ విమానయాన సంస్థ ఇరాన్‌లో అతిపెద్ద మూడోవ సంస్థ.

డయాలసిస్ యూనిట్ల పెంపుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం



ఏపీ డయాలసిస్ టెక్నీషియన్, థెరపిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కృష్ణమాచార్యులు, రహీమ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కొత్త డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ డయాలసిస్ టెక్నీషియన్,థెరపిస్ట్ యూనియన్(ఏపీటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, షేక్ రహీమ్ విమర్శించారు.విజయవాడ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర డయాలసిస్ టెక్నీషియన్ అసోసియేషన్ల బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి సుధాకర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి షేక్ రహీమ్ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి డయాలసిస్ సెంటరుకు నెఫ్రాలజిస్టును, క్వాలిఫైడ్ టెక్నీషియన్లను కేటాయించాలని డిమాండు చేశారు.ప్రముఖ మూత్రపిండ వ్యాధి నిపుణులు డాక్టర్ అమ్మన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డయాలసిస్ యూనిట్లలో క్వాలిఫైడ్ నెఫ్రాలజిస్టులను నియమించట్లేదని, దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయని పేర్కొన్నారు.క్వాలిఫైడ్ అయిన నెఫ్రాలజిస్టులను, టెక్నీషియన్లను నియమించకుండా డయాలసిస్ యూనిట్లను నడపడం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.యూనియన్ నాయకులు ఖాజా రసూల్ మాట్లాడుతూ, దొంగ నకిలీ సర్టిఫికెట్లతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి వుందని వాపోయారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, చంద్రరాజు, వెంకటేశ్వరరావు, మౌలాలి పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా వ్యవస్థకు శ్రీకారం



- ▶వసతుల కల్పనకు రూ. 4,848 కోట్లు
- ▶ఉర్దూ పాఠశాలల ఉన్నతీకరణ
- ▶బయోమెట్రిక్ అటెండెన్స్
- ▶5వేల డిజిటల్ తరగతులు

విశాలాంధ్ర అమరావతి: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పటిష్టత, ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం దృష్టిపెట్టారు. పాఠశాల విద్యావ్యవస్థను చక్కదిద్దేందుకు పూనుకుంది. వ్యవస్థలో వచ్చే సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. పాఠశాల స్థాయి నుంచి కాలేజీ స్థాయి వరకు ఇటీవల కాలంలో పెరిగిపోతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుపడేవరకు, విద్యాశాఖ పనితీరు గాడిలో పడేంతవరకు అవసరమైతే వారానికోసారి సమీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్ర పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో 17వ స్థానం, మాథ్స్ లో 6వ స్థానం, సైన్స్‌లో 11వ స్థానంలో వున్నారు. 2022 నాటికి ఇంగ్లీష్, మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో రాష్ట్ర విద్యార్థులు దేశంలోనే మొదట నిలిచేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇ-హాజరు 100 శాతం అమలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. 41,601 పాఠశాలలు,1,66,931 మంది ఉపాధ్యాయులు, 34,04,109 విద్యార్థులు ఇ-హాజరు పరిధిలోకి వచ్చారు. ఉపాధ్యాయుల హాజరులో 82.49 శాతంతో శ్రీకాకుళం జిల్లా ముందుండగా, 70.67 శాతంతో ప్రకాశం జిల్లా చివరి స్థానంలో ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో కూడా బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ప్రవేశ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వ్యవస్థను చక్కదిద్దే కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు రేటింగ్ విధానం అమలు చేస్తారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం అమలు చేయడంపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరు వరకు 5,582 ఉపాధ్యాయ పోస్టులలో ఖాళీలు వున్నాయి. మే 2018 నాటికి మరో 501 పోస్టులు ఖాళీ అవుతాయని అధికారులు లెక్క తేల్చారు. ఈ పోస్టులను వచ్చే ఏడాది భర్తీ చేసే అవకాశం ఉంది. సామాజికసేవ, స్వచ్ఛాంధ్రప్రదేశ్ రెండింటిలో విద్యార్థులను మరింతగా భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో వారికి గ్రేస్ మార్కులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి వివరాలను ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేసి, అందరి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్త పరుస్తారు. పదో తరగతి ఉత్తీర్ణత తర్వాత ఎంతమంది విద్యార్థులు ఇంటర్మీడియేట్, తత్సమాన కోర్సులు చదువుతున్నారో, పాఠ్యాంశాల్లో ఎలాంటి మార్పులు చేర్పులు తీసుకురావాలనే దానిపై అధ్యయనం జరగవలసిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వైఫై ఏర్పాటు చేస్తారు. అన్ని విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లకు ఏపీ ఫైబర్ గ్రిడ్ ద్వారా 100 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తారు. అలాగే అన్ని కళాశాలలకు, పాఠశాలలకు వర్చువల్ క్లాస్ రూముల కోసం 15 ఎంబీపీఎస్ వేగం కలిగిన ఇంటర్నెట్ కనెక్షన్లు ఇస్తారు. రాష్ట్రంలోని మొత్తం 447 ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ల్యాబ్‌తో పాటు తాగునీటి సదుపాయం కల్పించారు. 402 కళాశాలకు సొంత భవనాలు వుండగా, 45 కళాశాలలకు సొంత భవనాలు నిర్మించవలసి ఉంది. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం, పలు విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించేందుకు, సమీక్షించేందుకు, ఇ-కంటెంట్ కోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఇ-నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ పోర్టల్ ప్రారంభించారు. కేంద్రం ఇదే తరహాలో తీసుకొచ్చిన దీక్ష పోర్టల్‌తో దేశంలో మొట్టమొదటగా అనుసంధానమైన పోర్టల్ ఇదే. ఏపీఈకేఎక్స్ ద్వారా 130 మంది విషయ నిపుణులు సేవలు అందిస్తున్నారు.

పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతులు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి దశలో 5 వేల పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభిస్తారు. ఇప్పటివరకు 2,399 పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేశారు. సాధారణ పద్ధతిలో ఉపాధ్యాయుడు గంటసేపు చెప్పగలిగే పాఠ్యాంశాన్ని వర్చువల్ క్లాస్ రూమ్ పద్ధతిలో 10 నిమిషాల్లో విద్యార్థి అవగాహన చేసుకునే వీలుంది. ప్రతి పాఠశాలకు ఒక టీవీని అందజేస్తారు. వర్చువల్ క్లాస్‌రూమ్ ద్వారా చెప్పే పాఠాలను టీవీ ద్వారా మళ్లీ మళ్లీ ప్లే చేసుకొని చూసే అవకాశం ఉంటుంది. వర్చువల్ క్లాస్‌రూమ్స్ కోసం 40 స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క స్టూడియోలో 10 మంది సబ్జెక్ట్ నిపుణులు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఉంటారు. బోధనాంశాల తయారీ కోసం ప్రత్యేక విభాగం ఉంటుంది. ఒక్కొక్క వర్చువల్ స్కూలుకు సమీపంలో ఉన్న మరో 20 పాఠశాలలు అనుసంధానంగా ఉంటాయి. ఒకే సమయంలో ఈ 20 స్కూళ్ల విద్యార్థులు పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. డిజిటల్ తరగతులకు పాఠ్య ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మునిసిపల్ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక శాతాన్ని పెంచడానికి, వారికి మెరుగైన రీతిలో విద్య బోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనలతో ప్రణాళికలు రూపొందించింది. కెరీర్ ఫౌండేషన్ కోర్స్ (సీఎఫ్‌సీ) ప్రవేశపెట్టింది. ఈ కోర్సులో ప్రతిభ చూపిన వారికి అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సు (ఏఎఫ్‌సీ)లో అవకాశం కల్పిస్తారు. సివిల్స్, ఐఐటీ వంటి చదువులకు విద్యార్థుల్లో ఆసక్తి పెంచి ప్రోత్సహించడానికి వారి ఉజ్వల భవితకు ఈ కొత్త కోర్సులు బాటవేస్తాయి. సీఎఫ్‌సీకి 57,252 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి 1,500 మంది రెగ్యులర్ టీచర్లు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 2019-20 నాటికి 33,145 అదనపు తరగతి గదులు,21,249 పాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించడంతో పాటు, 40,665 పాఠశాలలకు ఫర్నిచర్ సౌకర్యం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 220 ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా ఉన్నతీకరిస్తారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 4,848 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నూరు శాతం గ్యాస్ కనెక్షన్లు ఇప్పించడంతో పాటు నూరు శాతం గ్యాస్ వినియోగించేలా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని 9వ తరగతి విద్యార్థులకు ఓడీఎఫ్ పై ప్రాజెక్టు వర్క్ ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని 27,813 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది.



విజయవంతంగా ఎస్టీయూ

ఏపీ టెట్ నమూనా పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ-ఏపీ) ఆధ్వర్యాన ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పేపర్-1 నమూనా పరీక్షను విజయవంతంగా నిర్వహిం చారు. 13జిల్లాలోని 35 సెంటర్లలో నిర్వహించిన పరీక్షకు దాదాపు 4వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు.టెట్ నమూనా పేపరు, ఓఎంఆర్‌షీట్లను అభ్యర్థులకు అందజేశారు.పరీక్షలో ప్రతిభ చూపిన ప్రథమ, ద్వితీయ, తృతీయ అభ్యర్థులకు బహుమతులను ఎస్టీయూ రాష్ట్ర, జిల్లాల నేతలు అందజేశారు. గుంటూరు, విజయవాడలోని టెట్ నమూనా పరీక్షలను ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు పర్యవేక్షించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో అభ్యర్థుల కోసం డీఎస్సీ నమూనా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల్ని తీర్చిదిద్దంలో ఎస్టీయూ కీలకపాత్ర పోషిస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఎస్టీయూ రాష్ట్ర హెడ్ క్వార్టర్ సెక్రటరీ శీరంశెట్టి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి సీహెచ్.వీఆర్.ఎన్.సురేష్‌కుమార్, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ఎన్ ప్రసాద్,సహాయధ్యక్షులు ఎంవి శ్రీనివాస్, విజయవాడ నగర ఎస్టీయూ నాయకులు వై.నాగ రామారావు, మస్తాన్ వలి పాల్గొన్నారు.

అన్నీ ఇస్తున్నాం... అన్నీ చేస్తున్నాం...

- అన్నింటినీ ప్రజలకు చెప్పండి
- రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వస్తాయి
- విజయవాడ, విశాఖ మెట్రోలకు నిధులిస్తాం

బీజేపీ పదాధికారుల సమావేశంలో అధ్యక్షుడు హరిబాబు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం. చట్టంలో చెప్పనవీ కూడా చేస్తున్నాం. అయినప్పటికీ విమర్శలు చేయటం మంచి పద్ధతికాదని మిత్రపక్షం టీడీపీని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు వ్యాఖ్యానించారు. ఏదైనా ప్రాజెక్టుకు సంబంధించి నిధులన్నింటినీ ఒకేసారి ఎక్కడా విడుదల చేయరని, ఖర్చును బట్టి నిధుల మంజూరు ఉంటుందనే విషయం కూడా తెలియకుండా మాట్లాడటం శోచనీయమన్నారు. మూడున్నర సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయి, ఏం చేసిందో నాయకులు ధైర్యంగా ప్రజలకు వివరించగలగాలని సూచించారు. అందుకోసమే ప్రత్యేకంగా బుక్‌లెట్‌లను ముద్రించి ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వలేదంటూ మిత్రపక్షం బీజేపీపై అధికార టీడీపీ మండిపడుతోంది. సీఎం చంద్రబాబు మొదలు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో బీజేపీ కూడా తన వైఖరిని చెప్పుకుంటో పోతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడలోని బలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగింది. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మూడున్నర సంవత్సరాలలో రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో హరిబాబు వివరించారు. సుమారు రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాజధాని శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండానే రూ.2,500 కోట్లు మంజూరు చేశామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు రూ.1,050 కోట్లు ఇచ్చామని పునర్విభజన చట్టంలో పేర్కొన్న 16 విద్యాసంస్థలను మంజూరు చేయటంతోపాటు మౌలిక వసతులకు నిధులు కూడా కేటాయించామన్నారు. చట్టంలో పేర్కొనని వాటిని కూడా చేస్తున్నా అవి హక్కు ప్రకారం వస్తాయంటూ వ్యంగ వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు. తగిన ప్రతిపాదనలు ఇస్తే విజయవాడ, విశాఖ మెట్రోకు నిధులు కేటాయించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. విశాఖ రైల్వేజోన్, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, మరో పోర్టును కూడా ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. సాధ్యంకాని వాటిని కూడా శతవిధాలుగా అమలు చేసేందుకు బీజేపీ కృతనిశ్చయంతో ఉంటే, ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థంకావటంలేదన్నారు. రైల్వేజోన్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 2014-15 సంవత్సరానికి సంబంధించిన రెవెన్యూ లోటుపై స్పష్టతరాలేదని, ఎట్టి పరిస్థితిలోనూ లోటును భర్తీ చేస్తామని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల నేపథ్యంలో ప్రత్యేక హోదా ఉన్నా, లేకున్నా నిధుల విడుదలలో తేడా ఉండదని, అందుకే రాష్ట్రాన్ని కేంద్రం ప్రత్యేకంగా చూస్తోందని, కాని హోదా కోసం పట్టుబడటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో హక్కుల కోసం పోరాడిందే ఒక్క బీజేయేనని, అందుకే మూడున్నర సంవత్సరాలలో ఏం చేశామో ప్రజలకు చెప్పేందుకు పదాధికారులు సంసిద్ధులుకావాలని హరిబాబు పిలుపునచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, పీ మాణిక్యాలరావు, ఎంపీ గోకరాజు గంగరాజు, బీజేపీ శాసనపక్ష నేత పీ విష్ణుకుమార్‌రాజు, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, మాధవ్, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం

- పేదలకోసం డయాలసిస్ కేంద్రాలు
- సంచార వైద్యశాలలు
- మహిళా మాస్టర్ హెల్త్ చెకప్

విశాలాంధ్ర అమరావతి : పేదల ఆరోగ్యం, సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్టీఆర్ వైద్య పరీక్ష, చంద్రన్న సంచార చికిత్స, మహిళా మాస్టర్ హెల్త్ చెకప్, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఉచిత డయాలసిస్ వంటి వాటి ద్వారా వైద్య సేవలు అందిస్తోంది. పట్టణ పేదలకు, మురికివాడలలో నివసించేవారికి ఉచితంగా స్పెషాలిటీ సేవలు, పూర్తికాల వైద్యాధికారి నుంచి నాణ్యమైన ఆరోగ్య రక్షణ లభిస్తుంది. 30 డయాగ్నస్టిక్ పరీక్షలు, మందుల సరఫరా, టెలీకన్సల్టెన్సీ ద్వారా స్పెషలిస్టుల సేవలతోపాటు అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ సేవలు 365 రోజులూ అందిస్తారు. రోగులకు ఇప్పటివరకు బయోకెమిస్ట్రీ, క్లినికల్ పాథాలజీ, హెమటాలజీ వంటి టెస్టులు దాదాపు 15 లక్షలు చేశారు. ఇవే కాకుండా ఎన్టీఆర్ వైద్య సేవ, గిరిజన ఆరోగ్యం వంటి పలు కార్యక్రమాల ద్వారా పేదలకు వైద్యసేవలు అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన తరువాత బాలింతలను 'తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్' వాహనంలో వారి ఇంటికి చేరుస్తారు. 2016 జనవరి 1 నుంచి రాష్ట్రంలో ఈ సేవలను ప్రారంభించారు. రాష్ట్రంలో ఈ వాహనాలు మొత్తం 279 ఉన్నాయి. ఇవి వారంలో ఏడు రోజులు, 24 గంటలూ పని చేస్తాయి. ఏ ల్యాండ్ లైన్ నుంచైనా, మొబైల్ నుంచైనా 102కు కాల్ చేస్తే అది ఏ ప్రాంతం నుంచి వచ్చిందో ఆ ప్రాంతంలోని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి కాల్ చేసి ఆ గర్భిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో 30 నిమిషాల్లో వాహనాన్ని ఏర్పాటు చేస్తారు. ఓ బేబి టవల్, బేబి బెడ్ జిప్ బ్యాగ్, చేతులు సోప్ వాటర్, దోమ తెర, కిట్ బ్యాగ్ మొత్తం 5 వస్తువుల ఉన్న ఎన్టీఆర్ బేబీ కిట్ అందచేస్తారు. దీర్ఘ కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడేవారికి రాష్ట్రంలోని 32 ప్రభుత్వ ఆస్పత్రులలో పేదలకు ఉచిత డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా 2016లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఒక్క చిత్తూరులో తప్ప మిగిలిన అన్ని జిల్లా ఆస్పత్రులు, జిల్లా ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇప్పటివరకు 2,600 మంది రోగులు ఈ సేవలు పొందారు. డయాలసిస్ రోగులకు నెలకు రూ. 2,500 పెన్షన్ కూడా అందజేస్తారు. రోగి వేతనాన్ని కోల్పోయినందున మందులు, ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఈ పింఛన్‌ను ఇస్తారు. 2017 అక్టోబర్ నెల వరకు డయాలసిస్ చేయించుకుంటున్న 2,338 మంది సీకేడీ రోగులకు పెన్షన్ అందజేశారు. రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, వంటి ఇతర వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు, చికిత్స సంబంధిత ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా చేస్తారు. రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాల్లో చంద్రన్న సంచార చికిత్స వాహనాల ద్వారా ప్రాథమిక చికిత్స అందిస్తారు. రాష్ట్రంలో 5 కిలోమీటర్ల పరిధిలో ఆరోగ్య కేంద్రం లేని 12 వేల ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాలకు ప్రతి నెలా నిర్ధారించిన రోజున సంచార వైద్య బృందాలు వైద్య సేవలు అందిస్తాయి. ప్రారంభం నుంచి 2017 అక్టోబర్ వరకు 2,44,843 వైద్య శిబిరాలు నిర్వహించారు. అంటు వ్యాధులు, నోటి, గర్భాశయ, రొమ్ము కేన్సర్లు, మధుమేహం, హైపర్ టెన్షన్, విజన్, హార్మోన్ అస్తవ్యస్తం వంటి 7 ప్రధాన వ్యాధుల నిర్ధారణ కోసం 30 ఏళ్ల పైబడిన మహిళలకు మహిళా మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఎన్ సీడీల పరీక్షల కోసం 12 వేల మంది ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. అనుమానిత కేసులను రోగ నిర్ధారణ కోసం రాష్ట్రంలోని సంబంధిత 57 ఆస్పత్రులకు పంపుతారు. 2016 జనవరి నుంచి అమలవుతున్న ఈ కార్యక్రమంలో రోగికి ఆరోగ్య రక్షణతోపాటు వ్యయభారం తగ్గుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 7 మథర్ ల్యాబ్ లతోపాటు 98 ప్రాసెసింగ్ ల్యాబ్‌లు పేద రోగులకు అందుబాటులో ఉన్నాయి.

అగ్రకుల పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలి: ఆంధ్ర మాల్యాద్రి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దళిత మహిళను అవమానపరచి మాదిగపల్లెపై దాడి చేసిన అగ్రకుల పెత్తందార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి డిమాండు చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ప్రకటన చేశారు. చిత్తూరుజిల్లా కలికిరి మండలం పోరాకులపల్లె గ్రామ దళిత మహిళ అపర్ణపై శివరాత్రి జాతర సందర్భంగా అవమానపర్చి ప్రతిఘటించిన మాదిగపల్లెపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. డీజీపీ, సీఎస్ తక్షణమే జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ప్రకటనలో మాల్యాద్రి హెచ్చరించారు.

ఎంబీబీఎస్, పీజీ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్లపై

ప్రభుత్వం తర్జనభర్జన..!

- ఏపీ అసెంబ్లీలో సవరణకు 'జూడాల' పట్టు
- నేడు ప్రభుత్వంతో చర్చలు
- ఇతర రాష్ట్రాలకు దీటుగా ఉపకార వేతనాలకు డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జూనియర్ దాక్టర్ల(జూడా) డిమాండ్లలో ఒకటైన ఎంబీబీఎస్, పీజీ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ల అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.ఎంబీబీఎస్, పీజీ పూర్తిచేసిన అభ్యర్థుల డిగ్రీలను సకాలంలో రిజిస్ట్రేషన్ చేయనందున వారికి వృత్తిపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి.దీంతో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు జూడాలు సిద్ధమయ్యారు.ఈ సమస్యపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సవరణ తీసుకొచ్చే దిశగా ప్రభుత్వంపై జూడాలు ఒత్తిడి పెంచారు. నాలుగు డిమాండ్లతో ఏపీ జూనియర్ దాక్టర్ల అసోసియేషన్ సమ్మెకు నోటీసు ఇచ్చిన విషయం విదితమే.2016, 2017 ఏడాదికిగాను పెండింగ్‌లో వున్న 15శాతం హైక్ స్టైఫండ్ పెంపుదలకు ప్రభుత్వం అంగీకరిస్తూ..జీవో నంబరు 9ను ఇటీవల జారీ చేసిన విషయం విదితమే.రెండో డిమాండుగా వున్న 2018 స్టైఫండ్ రివ్యూపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ఏపీ జూడా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ, పలువురు జూడా నేతలతో చర్చలకు సోమవారం ప్రభుత్వం ఆహ్వానించింది. జూనియర్ డాక్టర్లకు ప్రతినెలా క్రమం తప్పకుండా స్టైఫండ్ ఇవ్వాలని(మూడో డిమాండు), ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల సర్టిఫికెట్లను రెగ్యులరైజేషన్ చేయాలని(నాలుగో డిమాండు) సమ్మె నోటీసులో పొందుపరిచారు. ఎంబీబీఎస్, పీజీ అభ్యర్థుల సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ అంశంపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని జూడాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది.దీనిపై జూడాలు, ప్రభుత్వాధికారులతో కొనసాగే చర్చల్లో స్పష్టత రానుంది.ఏపీలో 2018 నుంచి ఉపకార వేతనాల పెంపును పున:సమీక్షించాలని జూడాలు కోరుతున్నారు.జీవో నంబరు107 ప్రకారం సీనియర్ రెసిడెంట్లకు 2017 నుంచి రావాల్సిన బకాయిలను ఈ నెల 28లోగా చెల్లించాలని డిమాండు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో జూడాల ఉపకార వేతనాలివీ..

ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న జూనియర్ దాక్టర్లకు మెరుగైన ఉపకార వేతనాల్ని అమలు చేస్తున్నారు కేరళ రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నంబరు262/2015 ద్వారా జూనియర్ రెసిడెంట్స్ (పీజీ స్టూడెంట్స్)కు ఫస్ట ఇయర్ రూ.43వేలు, సెకండ్ ఇయర్ రూ.44వేలు, థర్డు ఇయర్ రూ.45వేల చొప్పున ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. సీనియర్ రెసిడెంట్లకు ఫస్టు ఇయర్ రూ.47వేలు, సెకండ్ ఇయర్ రూ.48వేలు, థర్డు ఇయర్ రూ.49వేల ఉపకార వేతనమిస్తున్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు-230 ఆధారంగా పీజీ ఫస్టు ఇయర్ రూ.25వేలు, సెకండ్ ఇయర్ రూ.26వేలు, థర్డు ఇయర్ రూ.27వేలు, డిప్లొమో ఫస్టు ఇయర్ రూ.25వేలు, సెకండ్ ఇయర్ రూ.26వేలు, థర్డు ఇయర్ రూ.27వేలు, డిప్లొమో ఫస్టు ఇయర్-రూ.25వేలు, సెకండ్ ఇయర్ రూ.25వేల ఉపకార వేతనాన్ని ఇస్తున్నారు.హయర్ స్పెషాల్టీ కోర్సుల మూడేళ్ల అభ్యర్థులకు రూ.30వేల చొప్పున కేటాయిస్తున్నారు.కర్నాటక ప్రభుత్వం ఎండీ,ఎంఎస్ ఫస్టు ఇయర్ రూ.39వేలు, సెకండ్ ఇయర్ రూ.35వేలు, థర్డు ఇయర్ రూ.40వేలు ఇస్తున్నారు.ఇదే పద్ధతిలో ఒక్క ఆంధ్రప్రదేశ్ మినహా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఉపకార వేతనాల్ని అందజేస్తున్నాయి.

మిగతా రాష్ట్రాలకు సమానంగా ఉపకార వేతనాలివ్వాలి : ఏపీ జూడా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ

మిగతా రాష్ట్రాలకు సమానంగా ఏపీలోనూ ఉపకార వేతనాలివ్వాలని ఏపీ జూనియర్ దాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై వైద్య విద్యార్థులు సేవలందిస్తున్నారని వివరించారు.విద్యార్థుల శ్రమను దృష్టిలో వుంచుకుని ఉపకార వేతనాల పెంపు అంశాన్ని సమీక్షించాలని కోరారు.



మృతదేహాల మిస్టరీ

విశాలాంధ్ర-కడప క్రైం/ఒంటిమిట్ట : కడప-తిరుపతి జాతీయ రహదారిలోని ఒంటిమిట్ట చెరువులో దారుణం చోటు చేసుకుంది. చెరువులో మృతదేహాలు తేలుతుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చెరువులో విస్తృతంగా గాలించి 5 మృతదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యల్లో సహకారం అందించారు. చెరువులో మృతదేహాల ఘటనపై అనుమానాస్పద మృతుల క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెంబడించడంతో తమిళనాడు కూలీలు చెరువులో పడి ఉంటారని గ్రామస్తులు పేర్కొంటుండగా, విచారణలో తేలుతాయని పోలీసులు అంటున్నారు. మిస్టరీగా మారిన ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట పరిసర గ్రామాలతోపాటు చెర్లపల్లె గ్రామంలో గత కొన్ని రోజులుగా తమిళనాడుకు చెందిన కూలీలు సంచరిస్తున్నారని, ఇళ్ళపై రాళ్లు వేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనిపై పోలీసులకు కూడా సమాచారం అందించామన్నారు. కాగా శుక్రవారం రాత్రి చెర్లోపల్లె గ్రామంలో పోలీసులు సంచరించారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అదే సమయంలో ఎర్రచందనం కూలీలు పోలీసులకు తారసపడినట్లు తెలిసింది. పోలీసుల రాకను గమనించిన కూలీలు తప్పించుకునేందుకు చెరువులో దూకి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం తాము గాలింపు చర్యలు చేపట్టినప్పుడు ఎర్రచందనం కూలీల జాడ కనబడలేదని పేర్కొంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12-12.30 గంటల సమయంలో చెరువులో నుండి మృతదేహాలు తేలుతుండడాన్ని గమనించిన గ్రామస్తులు ఒంటిమిట్ట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాజంపేట డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, రాజంపేట ఆర్‌డీఓ వీరబ్రహ్మం, సీఐ రవికుమార్, ఎస్.ఐలు ధనుంజయ, అరుణ్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. కడప ఫైర్ ఆఫీసర్ ఎస్.నాగరాజు నాయక్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ డి.యేసురత్నం, రాజంపేట, కడప నుండి మూడు అగ్నిమాపక యంత్రాలు, 13 మంది అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు గాలించగా కిట్ బ్యాగ్‌లు ధరించి ఉన్న 5 మృతదేహాలను బయటకు తీశారు. వీరి వద్ద నుండి టార్చ్ లైట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలు బాగా ఉబ్బి ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని కడప అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్) అద్నాన్ నయీం అస్మి పరిశీలించారు. మృతదేహాలను రిమ్స్‌కు తరలించి బాడీ ఫ్రీజర్స్‌లో ఉంచారు. మృతదేహాలను పరిశీలించిన అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మధ్యాహ్నం 12-12.30 గంటల మధ్యలో గ్రామస్తులు ఒంటిమిట్ట చెరువులో మృతదేహాలు తేలుతున్న విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి ఫైర్, రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టామన్నారు. విస్తృత గాలింపు చర్యల్లో 5 మృతదేహాలు లభించాయన్నారు. ఇంకా విస్తృతంగా గాలిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతులుగా 174 క్రింద కేసు నమోదు చేశామన్నారు. లభించిన మృతదేహాల ఫొటో, వీడియో తీయించామన్నారు. జిల్లా సరిహద్దు, రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎవరైనా మిస్సింగ్ అయ్యారనే సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. ఫొటో, వీడియోల ద్వారా గుర్తించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. మృతులకు సంబంధించిన వివరాలు అందిన వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తామన్నారు. కాగా పోలీసులు ఎర్రచందనం కూలీలను తరుముకు రావడం వల్ల వారు భయపడి చెరువులో దూకి మృతి చెందారని తెలుస్తోంది. దీనిపై ఏఎస్పీని వివరణ కోరగా పోలీసులు రెగ్యులర్‌గా ఎర్రచందనం కూలీల కోసం గాలింపు చర్యలు చేపడుతూనే ఉంటారని అన్నారు. ఈ సంఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రాజంపేట ఎమ్మెల్యే : సంఘటనా స్థలాన్ని ప్రభుత్వ విప్, స్థానిక రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డిలు పరిశీలించారు. ఇలాంటి సంఘటన ఎప్పుడూ ఈ ప్రాంతంలో జరగలేదన్నారు. ఈ ఘటనలో ఎవరి ప్రమేయం ఉన్నా వెంటనే విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో లుప్తమవుతున్న మానవ సంబంధాలు

-బి.లలితానంద్, ✆ : 92474 99715

ప్రపంచ ఏకీకరణ ప్రపంచీకరణ, దేశాలన్నీ పరస్పరం ఆర్థికంగా తద్వారా సాంస్కృతికంగా పరస్పర అనుసంధించుకోవడం, మమేకమవ్వడం. దీనితో ప్రపంచం యావత్తూ విశ్వగ్రామంగా రూపాంతరం చెందడం. మనిషి అన్నింటికీ అతీతంగా జాషువా సంభావించినట్లు, సంజీవదేవ్ పలుచోట్ల ప్రస్తావించినట్లు విశ్వనరుడుగా, విశ్వమానవుడుగా ఆవిష్కరింపబడటం. మానవాళికి ఫ్రెంచివిప్లవం ప్రసాదించిన ప్రజాస్వామ్య మానవీయ విలువ లైన స్వేచ్ఛా, సమానత్వం, సుహృద్భావం పుడమి అంతటా పరిఢవిల్లేట్లు చేయడం. దీనినే కవికుల గురువు 'తిలక్' తన 'వసుధైక గీతం' లో

భూమధ్యరేఖ నా గుండెలోంచిపోతోంది/భ్రుకుటిలోపల నక్షత్రగోళం తిరుగుతోంది
ఈవేళ నన్నానవాలు పట్టలేవు నువ్వు/సూర్యుడిని చూడు నా తలమీద పువ్వు

అట్లాంటిక్ కల్లోల తరంగాల మేనువాల్చింది నేను
పసిఫిక్ లోతులలో రత్నాల్ని వెదకి తీసింది నేను
ఉత్తర ధ్రువాన ఒక పాదం దక్షిణ ధ్రువాన మరో పాదం
సర్వం సహా చక్రవర్తి పదవి సంపాదించుకున్నాను నేను.

అని అత్యద్భుతంగా మన మనఃఫలకంపై ముద్రించాడు. అసలు విదేశీ యానం, వలసరాజ్యాలు ఏర్పాటు ప్రారంభమైనప్పుడే ప్రపంచీకరణకు బీజం ఏర్పడింది. ఇవి, ఇలాంటివి ఒక పార్శ్వం.

పశ్చిమ దేశాల్లో పారిశ్రామికీకరణ అనంతరం అందివచ్చిన బహుముఖ సాంకేతికపరిజ్ఞానంతో పలు దేశాలకు విస్తరించిన బహుళ జాతి సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాలను గణనీయంగా పెంచివేశాయి. ప్రతి ఉత్పత్తి అంతిమ లక్ష్యం వినిమయమే. అందువలనే మహాత్ముని రచనలలోను అన్ని ఆర్థిక అంశాలలోను వినిమయదారునిదే మౌలికపాత్ర, కీలకస్థానం. బహుళజాతిసంస్థలుగల సంపన్నదేశాలజనాభా, జనసాంద్రతతో పోల్చి నప్పుడు తక్కువ. ఈ రీత్యా ఆయాదేశాలకు, సంస్థలకు అన్యదేశాలలో మార్కెట్లకై అన్వేషణ తప్పనిసరైంది. వీరిఅధీనంలోని అంతర్జాతీయ సంస్థలైన ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ద్రవ్యనిధి లాంటి వాటి సంపూర్ణమద్దతు వీరికి ఎలాగు ఉంటూనే ఉంది. అంతకంతకు అందుబాటులోకి వచ్చిన రవాణాసదుపాయాలు, ప్రచార, ప్రసార సాధనాలు వారి చర్యలకు అదనపు పరికరాలను ఇచ్చాయి. స్వదేశాల్లోనే కాక పరదేశాల్లోనూ వారి చర్యలకు సైద్ధాంతిక ప్రాతిపదిక కల్పించే మేధావులకు కొదవలేదు. మనిషిని, మానవీయ లక్షణాలను విస్మరించి ఆయా దేశాల్లో పంతపాడి తోడ్పాటునందించు కుత్సింబరులకు లోటులేదు. ఏకధృవ ప్రపంచంలో నేడు ఇదంతా సర్వసాధారణమైంది. ఇది మరో పార్శ్వం.

మనదేశంపై ప్రపంచీకరణ ప్రభావం, ఫలితాల విషయంలో ద్వంద్వ అభిప్రాయాలు ఉన్నాయి. ఇవి ఆయా సాహిత్య రూపాల్లోను ప్రతిబింబించాయి. వీటిలో అనుకూలాల కంటే ప్రతికూలాలకే అధిక ప్రాధాన్యం ఉండటం గమనార్హం. సృజనకారుల స్పందన సహజంగానే 'కారుణ్యేవ ఏకరస' అన్నట్టు బాధితులపట్లనే గావడం కీలకాంశం. వాటి దుష్ప్రభావాలు, దుష్ఫలితాలు పాటిబండ్ల ఆనందరావు 'పడమటిగాలి', 'నగ్నముని'- 'ఆకాశదేవర'లాంటి నాటకాల్లో వాస్తవాలకు అద్దంపట్టాయి. బహుళ ప్రాచుర్యం పొందాయి. అయినా మిగతా ప్రక్రియల కన్నా కవిత్వంలో ఈ స్పందనలు విరివిగారావడం, భావోద్వేగాలు తక్షణవాహికను ఎంచుకుంటూ యసటానికి నిదర్శనం. అరసం, విరసం, ప్రజా రచయితల సంఘం వారితో పాటు అన్నిస్థాయిల్లో వారు తమదైనశైలిలో ప్రతిస్పందించారు. ఈ అంశా లకు విస్తృతస్థాయిలో ప్రచారానికి ఉధృతంగా ఊతంఇచ్చినవారిలో దివంగత అద్దేపల్లి రామ్మోహనరావుగారు అగ్రస్థానంలో ఉంటారు.

ఈ పత్ర సమర్పకులు తన ఇటీవలి కవితా సంపుటి 'అలౌకికం' లోని 'ప్రవాహం' అధ్యాయంలో ప్రపంచీకరణ నేపథ్యంలోని మానవ సంబంధా లను స్పృశించారు. వాటిలో 'అంకురార్పణ', 'పడమటి సంధ్యారాగం', 'విలువల బేహారి', 'సీసాలో విశ్వం', 'అదృశ్య దృశ్యం' , 'వీడియో మరణం'- (విఖ్యాత కవి అయ్యప్ప ఫణికర్ కవితకు అనుసృజన), 'స్వీయ సంకెల', 'కృషీవలుడు', 'దగ్గరి దూరం', 'దోషి', కాలం సుదుట ప్రశ్న 'వర్తమానం', 'నిశ్శబ్దపుటంచులు', నిరంతరంతరాయం, 'దీపశిఖ', 'నవవనమాలి', 'నాకు తెలియకడుగుతా'- లాంటివి ఉన్నాయి.

వైయక్తికాంశాల్లాగా కాక వీటికి సంబంధించిన సాహిత్యానికి, సృజన కారునికి ఆయారంగాలైన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, చారిత్రిక, సాంకేతిక, మానసికాదిఅంశాలపై సదవగాహన ఉండాలి. విషయ పరిజ్ఞానంతోపాటు పరస్పర ఆధారిత, ప్రేరేపిత, ప్రభావిత, సూక్ష్మాంశాలు తెలియాలి. వాటికి అనుగుణ భాషాపటిమ, పారిభాషక పదజాలం ఉండాలి. అన్నింటి సమ్మిశ్రమానికి అభివ్యక్తిలో కళారూపం ఇవ్వగలగాలి. సృజనాత్మక ప్రక్రియల్లో ఇలాంటి అంశాల ప్రభావితాల ఆవిష్కరణకు సృజనకారునికి చైతన్యపూరిత మేధా, స్పందించే హృదయంతో పాటు నిరంతర గతిశీలాల పట్ల లోతైన అధ్యయనం, అట్టడుగువారి ఉద్ధరణకై తీరని తపన శ్వాసగా ఉండాలి. నిజరుజువర్తన కలవారికి తగిన ప్రోత్సాహకులు ఉండాలి.

ప్రపంచీకరణ అనంతరం విపరిణామాలు గమనిస్తే ఒకవైపు ఒకప్పటి 10లు, వందలకోట్లకు పరిమితమైన అవినీతి, కుంభకోణాలు వటవృక్షంలా పెరిగివేల, లక్షలకోట్లకు ఎగబాకడం జగమెరిగినసత్యం. పైగా అవి 'తప్పవు' అనే తీర్పులు ప్రపంచీకరణ విశ్వవ్యాపిత వైపరీత్యపుణ్యం. మరోవైపు సంస్కరణలపూర్వం ఎప్పుడో సకృతిగా జరిగే ఆత్మహత్యలు, నిశ్శబ్దంగా నిత్య కృత్యమయ్యాయి. ఓ కవి మాటల్లో 'ప్రతి ఆత్మహత్య ఏదోరూపంలో సామూహికహత్యే' ఇంకోవైపు తెహల్కా, వికీలీక్స్, పనామాపత్రాలు, నీరా రాడియా టేపులు లాంటివి స్థానికంనుండి ప్రపంచస్థాయిలో జరిగిన, జరుగు తున్న అనైతికతకు అద్దంపడుతున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో, పెరిగే సాంకేతిక పరిజ్ఞానంతో, వనరుల విధ్వంసంతో



పర్యావరణం వినాశనం చేస్తూ, నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. పన్నులు ఎగ్గొట్టి విలాస వినిమయవస్తువులు సృష్టిస్తున్నారు. బహురూపాల్లో మహిళలను అణగదొక్కు తున్నారు. వైద్యంభారంచేస్తూ విద్యనువ్యాపారంచేస్తూ అందరికీ అందుబాటు లో లేకుండా చేశారు. అందరికి నివాసం కల. కొద్దిమంది విలాసవంతమైన జీవనం సాక్షిగా ఎందరెందరికో అగచాట్లు.

విపరీతంగా పెరిగిన ఆర్థిక అంతరాల్లో, అంకెల్లో సంపద దామాషా ఒకశాతం సంపన్నుల దగ్గర 40శాతం, తదుపరి 9శాతం దగ్గర 20శాతం, అనంతర 15శాతం వద్ద 20శాతం, మిగిలిన 75శాతం ప్రజల వద్ద కేవలం 20శాతంతో సరిపెట్టుకోవలసి వస్తుంది. ఇలాగే ప్రపంచంలో సగం జనాభా (360కోట్లు) ఆదాయం కేవలం అత్యంత ధనవంతులైన 8మంది చేతుల్లో ఉంది. 1988నుండి 2011వరకు మధ్య, పేదవారిసంపద కేవలం 65 డాలర్లు పెరుగగా, 1శాతం పైస్థాయి జనాభా ఆదాయం 11,800 డాలర్లు పెరిగింది. ఇది 182రెట్లు అధికం. ఇవి చాలవన్నట్లు కార్పొరేట్లు పేద దేశాల్లో పన్ను ఎగవేత ద్వారా 100 బిలియన్ల డాలర్లని ఆ దేశాలు కోల్పో తున్నాయి. అదనపు కాసులు సంపన్న దేశాలకు, అదనపు కాలుష్యం బడుగు దేశాలకు ప్రపంచీకరణ ప్రసాదితం. ప్రపంచీకరణలోని సమనియమాలు, న్యాయసూత్రాలకు పలురూపాల్లోని ఏకపక్ష నిర్ణయాలు, విధానాలు, వివక్షతలు, విఘాతం కలిగిస్తున్నాయి.

మనదేశంలో దీనికి సంబంధించి గత శతాబ్దం చివరి దశకం ఆరంభం నుండి ఆర్థిక సంస్కరణలతో స్వేచ్ఛా వాణిజ్యానికి తలుపులు బార్లా తెరిచారు. దాదాపు 1500 సరుకులపై ఆంక్షలు ఎత్తివేసి స్వేచ్ఛా ప్రవేశం కల్పించారు. అట్లాగే ప్రయివేటీకరణ- సరళీకరణ. ప్రపంచీకరణకు ఈ రెండూ సాధనాలు. ఈ మూడింటి ముప్పేట దాడితో మరింత దుర్భరుడ య్యాడు సామాన్యుడు. ఇందుకు, అసలీ ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో యావత్తూ సంభవించిన అనూహ్య గణనీయ పరిణామాలను పరిశీలించాలి.

ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన విశేష మార్పులు వ్యక్తి, కుటుంబం నుండి విశ్వం వరకు అనేక రూపాల్లో, అనేక స్థాయిల్లో అన్ని రంగాల్లో ఉన్నాయి. విజ్ఞానానికి, వివేక,విచక్షణలకు పొంతనలేకుండటం, మేధావులు- వెన్నెముక, స్వరపేటిక కోల్పోయి స్వసుఖాల మత్తులో జోగిల్లడం, భిన్నాభి ప్రాయం సహించలేని ముష్కరత్వం ప్రబలడం వీటన్నింటికి పరాకాష్టా మానవ సంబంధాల్లో వచ్చిన విపరీత మార్పులు, 'కర్రె వున్నవాడిదే గొర్రె అన్నట్లు', 'బలమున్నవాడిదేరాజ్యం'అనే అటవికన్యాయం నేడు చలామణిలో ఉంది.

ప్రపంచీకరణనేపథ్యంలో సమస్త మానవసంబంధాలు మారక సంబంధా లైనాయి. వ్యాపార, ఆర్థిక సంబంధాలైనాయి. వ్యక్తి వినిమయ వస్తువైనాడు. 'ధనం మూలం మిదం జగత్' అన్నట్లు మనిషి - ప్రపంచం యావత్తు ధనం చుట్టూ తిరుగుతుంది. ఇక్కడ కవి తిలక్ మాటల్లో 'భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ధనవంతునిచుట్టూ తిరుగుతుంది' నిజానికి పరిణామ క్రమంలో మానవుడు తన జీవన విధానాన్ని, ఇతరులతో అనుబంధాన్ని మెరుగుపరుచుకునే క్రమంలో 'ధనం' అనే పరికరం వస్తువినిమయ స్థానం లోకి తెచ్చుకున్నాడు. నేడు తానే దానికి బానిసయ్యాడు. బంధాలను, అను బంధాలను కోల్పోయాడు. మన స్థానంలో 'నా' చోటు చేసుకుంటుంది. ఒకవైపు అరచేతిలో ఇముడుతున్న ప్రపంచం. మరోవైపు పొరుగువాడు ఏమైపోతున్నా పట్టించుకోని ప్రపంచీకరణ ప్రపంచపు వైరుధ్యం, వైపరీత్యం. మానవ సంబంధాల్లో ఈ సందర్భంలో విపరీతమైన మార్పులు అన్నిస్థాయిల్లో వచ్చాయి. ఆ ప్రభావం వ్యక్తుల, సమూహాల, దైనందిన



జీవనంపై,అనుసంధిత కార్యకలాపాలపై ప్రసరించక మానదు. తద్వారావచ్చే ఫలితాలు తదను గుణంగానే ఉంటుంటాయి. ఆ ఫలితాల ప్రభావం మరలా వ్యక్తుల, వ్యవస్థలపై పడి ఏవీ చేయవల్సిన రీతిలో చేయనందున, జరుగవల్సిన రీతిన జరుగవు. అంతిమ ఫలితాలను ఆయా వ్యక్తులేకాక, వ్యవస్థ మొత్తం సామూహికంగా భరించాల్సి వస్తుంది.

వ్యక్తి స్వీయ లక్షణాలు, మానవ సంబంధాలను, తన చుట్టూ ఉన్న పరిస్థితులతోపాటు అధికంగా ప్రభావితం చేస్తాయి. ఈ నిరంతర గమ్యం లేని ఉరుకుల పరుగులు తానెక్కడ వెనుకబడతానోనని క్షణం, క్షణం ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. ముగింపులేని ఈ అస్తిత్వ పోరాటంలో కనీసం తనను అనునయించే ఓ చల్లని హృదయంలేక తల్లడిల్లిపోతున్నాడు. మనసు విప్పి మాట్లాడితే వినటానికి ఓ మనిషంటూ లేకుండా పోతున్నాడు. అన్నీ వున్నా ఏమీ లేనివానిగా మిగిలిపోతున్నాడు.

వ్యక్తిత్వ వికాస ఆవిష్కరణలో స్వీయ లక్షణాలైన పుట్టుక, పెరిగిన వాతా వరణం, చదువు, పరిసరాలు, ప్రేరణ, స్వయం కృషి, క్రమశిక్షణ, తాను స్ఫూర్తిగా తీసుకునేవారులాంటివి అనేకం ఉంటాయి. వాటి సమిష్టి సారంగా ఏర్పడే బంధాలు అతని అనుబంధాన్ని నిర్దేశిస్తాయి. వీటితోపాటు తాను నివసించే కాలం, ప్రాంతాల్లో వ్యవస్థలు, పాటించు విలువలు, నైతికత, ప్రమాణాలు, నిజాయితీ, విశ్వసనీయత, బాధ్యత, జవాబుదారీ తనం లాంటి అత్యుత్తమ లక్షణాలు ఆ సమాజపు మానవ సంబంధాలకు అద్దంపడతాయి.

వ్యక్తిత్వ వికాసం తాలూకు ఔన్నత్యం, ఔదార్యాలే స్వీయ సంబంధపు పరస్పర బంధుత్వాలను, అనుబంధాలను బలిష్టం కావిస్తాయి. అప్పుడే సర్వత్రా శాంతి, కాంతులతో కూడిన సుహృద్భావ ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును' అన్న గురజాడ మాటలు ఆకళింపు చేసుకొని ఆచరణలో పెట్టాలి. 'ప్రార్థించే పెదవులు కన్నా, సాయం చేసే చేతులు మిన్న'.

కానీ 'నానాటికి తీసికట్టునాగంబొట్టు' అన్నట్లు ప్రపంచీకరణ నేపథ్యంలో పైన పేర్కొన్నట్లు అంతకంతకు మానవ సంబంధాలు లుప్త మౌతున్నాయి. సర్వవసానంగా మనిషి సమూహంలోను ఒంటరిగా మిగులు తున్నాడు. తానెవ్వరికి చెందకపోవడమేకాక తనకు తానే చెందని దుస్థితికి దిగజారాడు. ఒకేచోట అందరిలోఉంటున్న ఎవ్వరికిఎవ్వరు పట్టనివారిగా, పట్టించుకోక పోవడం సర్వసాధారణమైంది. ఆఖరుకు బహిరంగప్రదేశాల్లో అందరి సమక్షంలో ఎవరోఅమాయకులు కొందరు దుర్మార్గులకు బలవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. కనీస కనికరం లేకపోగా వాటిని ఫోనులలో వీడియోతీసి లైవ్‌ప్రసారాలుచేసే దుష్ట, దుర్మార్గ, కిరాతకులు మన మధ్య నాగరికులుగా చెల్లుబాటవుతున్నారు. మనం ఏర్పరుచుకున్న వ్యవస్థలు వారిని కాపాడుతున్నాయి. మద్దతుని స్తున్నాయి పలు రూపాల్లో, ఇది ఏరకపు ఆధునికతా రూపం!?

మానవసంబంధాలు లుప్తమైనసమాజంలో నెలకొనే ప్రమాదకర పరి ణామాలు దావానలంలావ్యాపిస్తాయి. మనిషిఅస్తిత్వానికి, మానవ మనుగడకే సవాలుగా మారతాయి. 'కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కాననిభంగి' అన్నట్లు మనం అగమ్య స్థితికి లోనవుతున్నాం. సంస్కారపూరిత సహనం బదులు అసహనం చోటుచేసుకుంటుంది. అసహనం విద్వేషాలకు దారితీస్తుంది. విద్వేషం విషాన్ని విరజిమ్మి, వివేకాన్ని, విచక్షణను, సంయ మనాన్ని కాలరాస్తుంది. సంయమన, వివేక, విచక్షణా రాహిత్యం సమన్వయ రాహిత్యానికి సంఘర్షణకు పురికొల్పుతాయి. ఈ నెలకొన్న పలురూపాల అశాంతి, అభద్రతతోకూడిన ఆరాటాలు మనిషి తనకు ఎన్నిభౌతిక సౌఖ్యాలు ఉన్నా అంతరంగంలో క్షోభిల్లుతున్నాడు, అల్లకల్లోలం అవుతున్నాడు. అంతరాత్మ అనేది కోల్పోయి మనిషి అంటే ఆర్థికం, మార్కెట్, వస్తువు, వినిమయదారుడు, ఓటరు, పరికరం అయ్యాడు.

ఈ కారణాలవలన శాంతి సామరస్యాలకు విపరీతమైనవిఘాతం కలుగు తుంది.ఆవేశకావేశాలు అసంగతంగా పెరుగుతున్నాయి. ఉద్వేగ నియంత్రణ అంతరిస్తుంది. అరాచకం ప్రబలుతుంది. వీటి పర్యవసానపు దుష్ఫలితాలే దుష్ఫలితాలే 'దబోల్కర్, పన్సారే, కల్‌బుర్గీ, గౌరిలంకేష్' లాంటి మాన వీయులు ముష్కరుల చేతుల్లో మరణించడం. పెరుమాళ్ మురుగన్ ఉదంతాలు వగైరా. ఇప్పుడు వీరు, రేపు మనలో ఎవ్వరైనాకావచ్చు. మనము కావచ్చు. ఈ విపరిణామాలతో సమాజంయావత్తు ఏమవుతుందో, ఎటు పోతుందో తెలియదు. కావున సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనా లంటే చక్కని మానవ సంబంధాలు తప్పనిసరి. అవి మాటల్లో గాక చేతల్లోకి తర్జుమా కావాలి.

అందుబాటులోకి వచ్చిన ఎన్నో ప్రాపంచిక సదుపాయాలు ఉన్నా ఏదో తెలియని వెలితి, కొరతలతో మనిషి అనుక్షణం కొట్టుమిట్టాడుతున్నాడు. తట్టుకోలేక ఆత్మార్పణానికి ప్రేరితుడవుతున్నాడు. ఒక్క మనిషి తప్ప మరే ప్రాణిఇందుకు పాల్పడదు. ఇవినివారించాలంటే మనిషి భౌతిక అవసరాలతో పాటు అతని మానసిక అవసరాలు తీరాలి, తీర్చాలి. అందుకు లలితకళలు దోహదపడాలి. అందునా సాహిత్యంలాంటివి మరింతగా. సృజనకారులు ఉపరితలాలకు పరిమితంకాక అంతరాంతరాల్లోని సూక్ష్మాలను, వాటి ప్రభా వాలను వెలికితీసి జనజీవితాలను జాగృతంచేయాలి. సమస్థ సంకుచిత రహిత మానవీయలక్షణాలను కోణాలను శాశ్వతప్రాతిపదికన రాబోవు తరాలుదృష్టిలో ఉంచుకొని ఆవిష్కరించాలి. తద్వారా లుప్తమవుతున్న మానవసంబంధాల పునర్జీవనానికి, పునర్వికాసానికి, పునఃనిర్మాణానికి ప్రతి ఒక్కరు కంకణంకట్టుకొని క్రియాశీలురుకావాలి. మనిషి మనుగడ ప్రశ్నా ర్థకంకాకుండాపరిరక్షించుకోవాలి. సినారేమాటల్లో 'ఎక్కడకన్నీరు ఉబుకునో/ ఎక్కడప్రాణం చిపుకునో/ అక్కడనేనవతరింతు ఆవిరిలా/ ఆదుకుందు ఆయువులా' అన్నట్లుండాలి ప్రతి సృజనకారుడు.

కొసమెరుపు...

ఇంత చెప్పుకున్నా (చదువుకున్నా), వర్తమానం గమనిస్తే ఓ 'ఆవృత్తం' ముగిసింది. మరో దానికి బీజాంకురం జరుగుతుంది. ప్రపంచీకరణ నుండి ఇప్పుడు 'విప్రపంచీకరణ' దిశగా పయనం ప్రారంభమైంది. దీనికి తిరుగులేని తార్కాణాలే 'బ్రెక్సిట్, ట్రంప్ విధానాలు, ఆస్ట్రేలియాలో విదేశీయుల తిరస్కరణ, చివరకు మన 'బెంగుళూరులోనే ఆంధ్రావారిని పోటీ పరీక్షలకు హాజరవ్వనీయకుండా అడ్డుకోవడం' లాంటివి తాజా ఉదాహరణలు. అలాగే ఇజ్రాయిల్, రొహింగియాల పట్ల పలు దేశాల వైఖరి కూడా. బహుశ ఈ దిశగానే మరిన్ని ప్రాంతాలు, దేశాలు పయనించే అవకాశం లేకపోలేదు. మరోసారి బయలుదేరిన చోటుకే చేరుతున్నాం. భూమి గుండ్రమని నిరూపితమవుతుంది.

ఆమె ఒక ఉద్యమకారిణి...అతడొక సాహితీ సృజనశీలి

"ఏ కళ అయినా, సాహిత్యమైనా సమాజంలో తాదాత్మ్యం చెందనిదే సంపూర్ణం కాదు" అన్న సుప్రసిద్ధ అభ్యుదయ రచయిత డా॥వుప్పల లక్ష్మణరావు. వారి వర్ధంతి సందర్భంగా 22ఫిబ్రవరి- 2018న స్మారక జీవన సాఫల్య సాహితీ పురస్కార సభ జరుపుటకు, వారి సంస్మరణకు గుర్తుగా "వుప్పల లక్ష్మణరావు సాహితీ స్ఫూర్తిమంతం" వ్యాస సంకలనం ఆవిష్కరణ జరుగుతోంది.

తెలుగుభాష సంస్కృతి, సాహిత్యాలకు అపూర్వ సేవ చేసిన మహా రచయిత జీవితంలో రచనకు, ఆచరణకు మధ్య వైరుధ్యాలు లేని వ్యక్తి వుప్పల లక్ష్మణరావు. అందుకు నిదర్శనం, సాక్షీభూతంగా నిలిచే అత్యుత్తమ నవల 'అతడు-ఆమె'. అతడు అంటే వుప్పల లక్ష్మణరావుగా, ఆమె అంటే స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మరుపురాని వనితగా మెల్లీ షోలింగర్‌ను జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారొకమారు ఇలా అంటారు. "నాకు జీవితంలో కొన్ని దృఢమైన విశ్వాసాలున్నాయి. స్త్రీ పురుష సంబంధాలు, వైవాహిక సంబంధాలు, మనిషికి ఉండేటటువంటి ఉత్పత్తి సంబంధాలు మొదలైన భావాలున్నాయి. అవి ప్రజలకు ఎలా తెలియజెప్పడం. అందుచేత ఒక నవలా రూపంగా కొన్ని వాస్తవాలు అందులోని నా భావాలు పొందుపరిచే ప్రయత్నం చేశాను. అతడు- ఆమెలోని సారాంశం అంతా తన జీవితానికి ఒక విధంగా అన్వయించుకున్నారనిపిస్తుంది.

వారు కమ్యూనిస్టుగా ఎందుకు అయ్యారో కూడా తెలియజేశారు. ఈ సమాజంలో ఉండే పరిస్థితుల్ని మార్చాలి. ఎటువంటి ప్రయత్నం చేయాలి. ఈ ప్రశ్నలకు సమాధానంగా అన్ని దేశాల్లోనూ మార్క్సిస్ట్ పార్టీలు పుట్టాయి. అప్పుడు మార్క్స్, ఏంగిల్స్ జీవించే ఉన్నారు. కాని వాళ్ళు బతికున్నప్పుడు సోషలిస్టు దేశం ఏదీ లేదట. ఆ పరిస్థితులు వేరు. ఒక ప్రపంచమే కమ్యూనిస్టు ప్రపంచం అయ్యిందంటారు. అందుచేత మార్క్సిజం తీసుకురావడం చాలా సులువయ్యిందని, మాస్కోలోని ప్రచురణాలయంలో మార్క్స్, ఏంగిల్స్ రచనలు ఏ మాత్రం వక్ర భాష్యం చెప్పకుండా అనువదించి పై దేశాలకు పంపేవారు. అది కూడా నూతన సమాజ నిర్మాణానికి మెట్టు లాంటిదే అనే భావంతో అక్కడ పని చేశామని ఒక ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది.

1944-46 ప్రాంతంలో భారత్-సోవియట్ మైత్రీ సంఘం స్థాపించడానికి ఏలూరు కూడా వచ్చారు. 1945లో బెజవాడలో అభ్యుదయ రచయితల సభలో వుప్పల లక్ష్మణరావుతోపాటు మెల్లీ షోలింగర్ కూడా పాల్గొన్నారు. హనుమంతరాయ గ్రంథాలయంలో కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారు. కమ్యూనిస్టు మహిళలు వీధుల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్ళేవారు. అట్టి పరిస్థితుల్లో మెల్లీ షోలింగర్ ఏలూరు వీధుల్లో కార్యకర్తలతో కలిసి దళప్రచారం చేస్తూ రౌడీల దౌర్జన్యకాండను బలంగా ఎదుర్కొన్నారు.


విదేశీ మహిళ అయినా దృఢమైన శరీరంతో ఖాదీ నిక్కరు, చొక్కా ధరించి, యురోపియన్ అయినా భారతదేశం పట్ల ఎంతో ప్రేమాభిమానాలను కనబరిచేవారు. స్వాతంత్ర్యోద్యమంలో క్విట్ ఇండియాలో పాల్గొని ఉరకలేస్తున్న ఈమె ఉద్రేకాన్ని చూసి బ్రిటీష్ ప్రభుత్వ అధికారులు చేష్టలుడిగి విధిలేక అరెస్టు చేసి రెండు నెలలు తాలూకాఫీసులో రిమాండ్‌లో ఉంచారు. అయితే అక్కడ కూడా న్యాయం కోసం, పౌరహక్కుల కోసం ఎదిరించడం మానుకోలేదు. ఖైదీలకు కనీస అవసరాల కోసం నిరసన తెలిపారు. వారం రోజులు దీక్ష చేశారు. ఆరోగ్యం క్షీణించినా క్విట్‌ఇండియా అని ఎలుగెత్తి అరిచింది. వెంటనే బ్రిటీష్ ప్రభుత్వం ఆ జైల్లో అందరికీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది. అటువంటి ఉద్యమ చరిత్రలో పోరాటపటిమ చూపిన వారిలో అనిబిసెంట్‌ను, మెల్లీషోలింగర్‌ను చెప్పుకుంటారు.

దక్షిణ జర్మనీలో ట్యూబెన్‌గన్ నగరానికి అప్పుడప్పుడు వెళ్తూ అక్కడే డాక్టరేట్ చేస్తున్న వుప్పల లక్ష్మణరావును కలిశారు. భారతీయునిపై ఆమెకు ఎంతో మక్కువ కలిగింది. స్నేహం పెంచుకుంది. భారతదేశంలోకి అడుగుపెట్టింది. బరంపురంలో వరాహగిరి వెంకటగిరి కుటుంబంతో పరిచయం జరిగింది. 1929లో లాహోర్ కాంగ్రెస్ సభకు



హాజరైంది. గాంధీజీ లేవదీసిన దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంది. ఖాదీబట్టలు ధరించింది. సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళింది. ఖద్దరు నేత నేయడం నేర్చుకుంది. ఆంధ్రోద్యమానికి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును కలిసింది. ఆంధ్రదేశంలో పర్యటించింది. ఎన్నో విద్యాలయాల స్థాపనకు తనవంతు కృషి చేసింది. 1937 ఆగస్టు-30న మాస్కోలో డా॥వుప్పల లక్ష్మణరావుగారిని వివాహం చేసుకుంది.

1943లో భారతదేశంలో సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొని జైలుశిక్ష అనుభవించింది. 1959లో ఇద్దరూ మాస్కో వెళ్ళారు. 1965 జూలై 27న ఒక రోడ్డు



ప్రమాదంలో ఆమె దివంగతులయ్యారు. ఆమె సేవానిరతికి భారతీయులకు ఆదర్శ వ్యక్తులుగా గుర్తించబడ్డారు. వుప్పల లక్ష్మణరావుకు ప్రియమైన సద్గుణం- మిత భాషణం, నిరాడంబరత. తన గురించి గొప్పలు చెప్పుకోవడం ఒక దుర్గుణంగా భావిస్తారు. మాస్కోలో ప్రగతి ప్రచురణాలయం తెలుగు శాఖలో అనువాదకునిగా 1958 నుండి 1970 వరకు పనిచేసి 40గ్రంథాలు సరళమైన తెలుగులోకి అనువదించారు. తెలుగు- రష్యన్ నిఘంటువు తయారుచేశారు. 1970 నుండి బరంపురంలో నివాసం ఏర్పరుచుకుని వికాసం సంస్థలో సభ్యునిగా చేరి, సాహితీ కృషి చేయడం, యువ రచయితలను ప్రోత్సహించడం చేశారు. పులుపుల వెంకటశివయ్య స్మారక అవార్డు పొందారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షవర్గ సభ్యులుగా ఉంటూ తుది శ్వాస వరకు రచనలు చేస్తూ జయపురం, భారతి, రాయగడలో ప్రగతి, ఖుర్దారోడ్‌లో కవిత, విజయనగరంలో వెలుగు సంస్థల స్థాపనకు తనవంతు కృషి చేశారు. దూర దూర తీరాలకు కనిపించే ప్రవాసాంధ్రునిగాఎగరేసిన సాహిత్యపతాకం, సంస్కరణవాది, సంఘసేవా ప్రమోది వుప్పల లక్ష్మణరావు వర్ధంతి రోజున విశాఖ రచయితల సంఘం ప్రతి ఏటా స్మారక జీవన సాహితీ పురస్కారం ఒక ప్రముఖ సాహితీవేత్తకు అందజేయడం ఆయన పట్ల మరింత గౌరవం పెరిగినట్లయింది.

(డా॥ వుప్పల లక్ష్మణరావు వర్ధంతి (22 ఫిబ్రవరి 2018) సందర్భంగా)

అడపా రామకృష్ణ, ✆ : 95052 69091

దేశదేశాల కవితా రహస్యం



బల్గేరియా కవిత్వం: ఓల్యా స్టోయనోవా

సమయం

ప్రతి ఉదయం
హడావుడిగా
నేను ఆఫీసుకు వెళ్ళే వేళ
ఒక వందు ముసలి,
చెరువు గట్టు-ముందు చెట్టుమీద కూర్చుని
చేతులు ముందుకు సాచి అడుగుతాడు
'బాబూ! టైమెంతయ్యిందీ-' అని!
ప్రతిసారి, ప్రతిరోజు, అదే సమయం...
నేనేం చెప్పేదీ?
'ఆలస్యమై పోయింది!
బాగా ఆలస్యమై పోయింది!!'
అని వడివడిగా అడుగులేస్తాను-



బల్గేరియా కవయిత్రి ఓల్యా స్టోయనోవా 1977లో సోఫియా, బల్గేరియాలో పుట్టారు. సోఫియావిశ్వవిద్యాలయం నుండి జర్నలిజంలో పట్ట భద్రురాలయి, పిహెచ్.డి. కోసం పరిశోధనలో నిమగ్న మయ్యారు. ఫోటోగ్రాఫ్ (2000) ప్రోజ్ (2002) రోడ్ మ్యాప్ (2003) హాప్పినెస్ స్ట్రీట్ (2013)అనే శీర్షికలతో నాలుగు కవితా సంపుటాలు ప్రకటించారు. 'హాప్పినెస్ స్ట్రీట్'-కు నికలోవ్ జాతీయ బహుమతి లభించింది. ఈమె కవయిత్రి మాత్రమేకాకుండా, కథ, నవల, నాటకం వంటి ఇతరసాహితీప్రక్రియల్లో సైతం పుస్తకాలు ప్రకటిం చారు. 'పర్సనల్ బయోగ్రఫీస్' (2005) అనే శీర్షికతో తన తొలి నవల ప్రకటించిన స్టోయనోవా 'వాట్ డు వుల్ఫ్స్ డ్రీమ్' (తోడేళ్ళు ఏమేమి కలలు కంటాయి?) అనే కథాసంపుటి, 'ఇన్విటేషన్ టు డిన్నర్' (రాత్రి భోజనానికి ఆహ్వానం) అనే నాటకం, రెండూ 2011లో ప్రచురించారు. నాటకానికి 2014లో జాతీయ బహుమతి లభించింది. 'ఎ గైడ్ టు వైల్డ్ ప్లేసెస్' పేరుతో ఒక యాత్రా రచన చేశారు. పై కవితలో 'ఆలస్యమైపోయింది' అనే మాటలో సర్మగర్భంగా ఎంతో విషయముంది.

అనువాదం, పరిచయం: డాక్టర్ దేవరాజు మహారాజు

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
19 ఫిబ్రవరి 2018

పార్టీ వేర్... వెస్ట్రన్ వేర్!

వచ్చేది పెళ్ళిళ్ళ సీజన్. బంధువులు, స్నేహితుల ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు, పేరంటాలకు వెళ్ళాల్సి వస్తుంది. మరి అస్తమానూ ఒకే రకమైన దుస్తులు ధరించాలంటే బోరే. ఒకసారి చీర కడితే మరో చుడీదార్ లేదంటే ఈ రెండింటికీ ప్రత్యామ్నాయం వెస్టర్న్ వేర్. కాలేజీ అమ్మాయిల సంగతైతే సరేసరి! వేడుక ఏదైనా ఫ్యాంట్లు, టాప్స్ అంటున్నారు. ఈసారి వెస్టర్న్ వేర్ వేసి చూడండి. కొంచెం వెరైటీగానూ ఉంటుంది. మీకు మీరు కొత్తగానూ కనిపిస్తారు. వెస్టర్న్‌వేర్‌లోనూ నిండుగా, హుందాగా కనిపించేవీ ఉన్నాయి. అలాంటిదే ఈ వస్త్రశ్రేణి. మరి మీరూ ఓ లుక్కేయండి!













సాధారణంగా మహిళలు చాలామంది సొంతంగా డబ్బు సంపాదించి తమ కాళ్లమీద తాము నిలబడాలని ఆకాంక్షిస్తుంటారు. కాలేజీకి వెళ్లే అమ్మాయిలు, వివాహితలు, పిల్లల కోసం తమ కెరీర్‌ను మధ్యలోనే ఆపేసిన ఈతరం అమ్మాయిల కోసం, యువతుల కోసం ఇంటివద్దే ఉండి డబ్బు సంపాదించే కొన్ని ఆన్‌లైన్ బిజినెస్ ఐడియాలను తెలుసుకుందాం.

సంపాదనకు మరో మార్గం..

ఆన్‌లైన్ బిజినెస్‌లు



1.ఫ్యాషన్ కన్సల్టింగ్ : ప్రస్తుత రోజుల్లో అమ్మాయిలకు మేకప్ కేవలం అలంకరణే కాదు అవసరం కూడా. మేకప్ లేనిదే చాల మంది అసలు బయటకు కూడా రాలేని రోజులివి. ప్రతిఒక్కరు తాము ధరించే దుస్తులు వారికీ తగ్గట్టు డిజైన్ కోరుకుంటారు, ఇంకొంతమంది ఏ హెయిర్ స్టైల్ బాగుంటుంది అని వెతుకుతూ ఉంటారు. ఈ మేకప్ రంగంలో కాస్త అనుభవం ఉన్నవారు మంచి బిజినెస్ ప్రారంభించవచ్చు. మేకప్ కోరుకునే వారికోసం మీరు సలహాలు, సూచనలు ఇస్తూ చిన్న మొత్తంలో ఛార్జ్ చేసి డబ్బు సంపాదించవచ్చు. ఇవి మీరు సొంతంగా యూట్యూబ్‌లో అకౌంట్ తెరచి ఆన్‌లైన్‌లో కూడా క్లాసులు చెప్పి కూడా డబ్బు సంపాదించవచ్చు.

ఈ రంగంలో మీకు ప్రవేశం ఉండి కాస్త అనుభవం ఉంటే చాలు సొంతంగా మొదలు పెట్టొచ్చు. మేకప్, డ్రెస్ డిజైన్ల గురించి వివరిస్తూ మీరు మీ సొంత వెబ్‌సైట్ తెరచి ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పి కూడా డబ్బు సంపాదించవచ్చు.

2. మేకప్ వీడియోస్ : బ్యూటీ క్లినిక్‌లు ప్రస్తుతం అన్ని చోట్లా సర్వ సాధారణం అయిపోయాయి. కానీ ప్రస్తుతం అమ్మాయిలు ఆన్‌లైన్‌లో వీడియోలు చూసి మేకప్ ఎలా చేసుకోవాలో తెలుసుకుంటున్నారు.

మీదగ్గర ఉన్న కెమెరాను తీసి వీడియో చిత్రీకరించి వాటిని మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయండి. అందులో వచ్చే యాడ్స్ ద్వారా డబ్బు పొందవచ్చు. మీ బ్లాగ్ ఒకటి క్రియేట్ చేసుకొని దాని ద్వారా కొన్ని బ్యూటీ టిప్స్ చెప్పి యాడ్స్ ద్వారా కొంత డబ్బు సంపాదించచ్చు.

3. ఆన్‌లైన్ కేక్ బిజినెస్ : ఇది చాల సులభమైనది, తక్కువ ఖర్చుతో కూడుకున్న బిజినెస్. బయట బేకరీల్లో దొరికే కేక్స్ కన్నా ఇంట్లో తాయారు చేసే కేకులకు చాల ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే ఇంట్లో ఐతే నాణ్యమైన, శుభ్రంగా తయారు చేసి చక్కటి రుచి కలిగి ఉంటాయని భావిస్తారు. మొదట మీకు తెలిసిన బంధువులకు లేదా మిత్రులకు తయారుచేయడం మొదలుపెట్టండి. తరువాత మెల్లగా మీ వ్యాపారాన్ని విస్తరించవచ్చు.

ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో మీరు తయారు చేసిన వివిధ రకాల కేక్ ఫొటోలు పెట్టి తెలియచేయొచ్చు. మీకు పరిచయం ఉన్న చిన్న దుకాణాలకు సప్లై చేసి వ్యాపారాన్ని విస్తరించుకోవచ్చు.

4. ఆన్‌లైన్ కుకింగ్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలామందికి ఇంట్లో వండుకునే సమయం లేక హోటల్ ఆహారం తింటున్నారు. కానీ ఎన్ని హోటళ్లు ఉన్నా ఇంట్లో వండిన ఆహారం రుచే వేరు అని చాలమంది అభిప్రాయ పడుతుంటారు. అటువంటి వారి కోసం మీరు సొంతంగా ఒక వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసి అందులో వారికి కావాల్సిన ఆహార పదార్థాల ఆర్డర్లు తీసుకొని డెలివరీ బాయ్ ద్వారా పంపి డబ్బు సంపాదించవచ్చు. నగరాల్లో ఎపుడు ఈ బిజినెస్‌కి చాల డిమాండ్ వుంది. ఉదాహరణకు బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం తదితర నగరాల్లో కొందరు ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని వంటకాలు సరఫరా చేస్తూ మంచి లాభాలను ఆర్జిస్తున్నారు.

ఈ వ్యాపారం కోసం మీరు సొంతంగా ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించండి. మీరు తయారుచేసినవాటిని ఇంటి నుండే డెలివరీ బాయ్ ద్వారా పంపవచ్చు. లేదా ఫుడ్ డెలివరీ బిజినెస్ సైట్‌లో మీ వివరాలు ఉంచడం ద్వారా మీ ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు.

5. ఆన్‌లైన్ క్లాసులు : పెద్ద చదువులు చదివి కొన్ని కారణాల వల్ల ఉద్యోగం చేయని యువతులు, ఇంతకు ముందు ఉద్యోగం చేసి పెళ్లి చేసుకున్న వారు తమ సబ్జెక్టు మర్చిపోకుండా ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్తూ డబ్బు ఆర్జించవచ్చు. ఇంకా ఉద్యోగం చేస్తూ కూడా ఆన్‌లైన్ క్లాసులు చెప్తూ డబ్బు సంపాదించవచ్చు.

మీకు తెలిసిన సబ్జెక్టును మీ బ్లాగ్ ద్వారా సంబంధిత విద్యార్థులకు చెప్పవచ్చు. మీకు అనుభవం ఉన్న టెక్నాలజీ గురించి ఆన్‌లైన్‌లో కొంతమంది విద్యార్థులకు ట్రైనింగ్ క్లాసులు చెప్పి డబ్బు సంపాదించచ్చు.

బైక్‌పై ఒంటరి ప్రయాణం

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దిగ్విజయంగా..

నీ మీద నీకు నమ్మకం ఉంటే తీరని కలలంటూ ఏవీ లేవు. ప్రయత్నిస్తే సాధ్యం కానివేవీ ఉండవు. మహిళలకు తమకేం కావాలో అది నెరవేర్చుకునే శక్తి సామర్థ్యాలున్నాయి. అందుకోసం పోరాడే చాకచక్యముంది. ఈ విషయం పదే పదే నిరూపితమవుతూనే ఉంది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ ఒంటరిగా బైక్ మీద వెళ్లి వచ్చిన రోషిణి శర్మ కథ వింటే అదే తెలుస్తుంది



రోషిణీ శర్మ ఉత్తరప్రదేశ్‌లోని నరోరా అనే చిన్న పట్టణంలో జన్మించింది. ఆమెకు ట్రెక్కింగ్ అన్నా ప్రయాణాలు అన్నా ఎంతో ఇష్టం. ఒంటరిగా ప్రయాణించాలంటే ఇంకా ఎంతో ఇష్టం. లేడీ చేగువేరాలా చరిత్ర పేజీల్లో చెరగని మోటార్ సైకిల్ డైరీస్ రాయాలన్న కోరిక. ఎన్నాళ్లిలా నాలుగ్గోడల మధ్య గొంగళి పురుగులా బతకడం. సీతాకోకచిలుకలా మారి అలా ఈ ప్రపంచం చుట్టేయాలి. కళ్లకు గంతలు విప్పేయాలి. హాయిగా ఆనందంగా ప్రపంచంతో కబుర్లాడేయాలన్న ఆశలామెవి. అవి నెరవేర్చుకునేందుకు రోషిణీ అనుక్షణం ప్రయత్నిస్తూనే వచ్చింది. అందులో భాగంగా మొదట బెంగళూరు పూణే, బెంగళూరు చెన్నై ఒంటరిగా బైక్‌పై ప్రయాణాలు చేసింది. ఇలాగే దేశమంతా చుట్టేయాలన్న గట్టి తలంపుకొచ్చింది.

11 రాష్ట్రాలు 14 రోజులు. కన్యాకుమారి నుంచి లెహ్ వరకూ. మొత్తం 5453 కిలోమీటర్లు. ఇంజనీరింగ్ చదివిన శర్మ రూట్ మ్యాప్ రెడీ చేసింది. ఇది పైకి లాంగ్ ట్రిప్పే కానీ రోషిణీ విషయంలో మాత్రం అంతకన్నా ఎక్కువ. తన యాత్రలో సామాజిక, ఎమోషనల్ ఫీలింగ్స్ కలగలసి ఉంటాయి. తన ధ్యేయమల్లా ఒక్కటే.. ఒంటరిగా ఆడది రోడ్డు మీద తిరగడానికే కష్టం. అలాంటిది దేశమంతా చుట్టి రావడమా? అనే కామెంట్లకి చెక్ పెట్టాలి. ఇతర ఆడపిల్లలకు తానొక రోల్ మోడల్ కావాలి.

ఇలా తన లక్ష్యమేంటో చెప్పిందో లేదో బంధు మిత్రుల నుంచి తాను ఏవైతే వినకూడదనుకుందో ఆ మాటలన్నీ వినాల్సి వచ్చింది. అయినా ఇవేవీ లెక్క చేయకూడదని ముందుగానే నిర్ణయించుకోవడం వల్ల అసలవి ఇబ్బందిగానే అనిపించలేదు. అయినా ప్రతి ప్రయత్నం కాదూ.. కూడదూ.. అనే మాటల నుంచే మొదలవుతుంది. తన చుట్టూ ఉన్న వారి మాటలెలా ఉన్నా.. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒంటరి ప్రయాణం అందునా ఓ ఆడపిల్ల.. అది కూడా బైక్ మీద వెళ్లడం.. ఇబ్బందికరమన్న వాస్తవం తన స్పీడ్‌కి బ్రేకులు వేసింది. ఈ ప్రాంతాల్లో ఆడవారి మీద అత్యాచారాలు ఎక్కువ. హత్య చేయడానికి సైతం వెనకాడని మృగాళ్లు తిరుగుతుంటారని చెబుతున్నాయి లెక్కలు. అసలు తాను నిరూపించదలుచుకుంది ఇదే కదా? అందుకే ఎక్కడ కష్టాలుంటాయో.. ఆ మార్గాల్లోనే ప్రయాణించాలని నిర్ణయించుకుంది శర్మ.

ఆడవారి పాలిట వజ్రాయుధం పెప్పర్ స్ప్రే వెంట పెట్టుకుంది. అలాగని పెద్ద ఏర్పాట్లేవీ చేయలేదు. వాటర్ బాటిల్ వగైరా చిన్నా చితకా ఏర్పాట్లంతే. రాత్రి బస ఎక్కడ మంచిదో ఫ్రెండ్ నుంచి చిన్న సమాచారం తీసుకోడం.. అక్కడ ఆగడం.. తిరిగి కిక్ కొట్టి బండిని రయ్ మనిపించడం. మధ్యలో అడవులూ ఇతర నిర్మానుష్య ప్రదేశాలొచ్చేసేవి. అక్కడి వాతావరణం చూసి ఒక్కోసారి భయం వేసేది. వెనక్కు వెళ్దామన్నా వెళ్లలేని పరిస్థితి. కొన్నిసార్లంతే ముందుకెళ్లడం మినహా మరో మార్గం ఉండదు.. అని దారి వెతుక్కుంటూ వెళ్లేది.

దారి వెంబడి ఎదురైన ప్రతి సవాలూ ఓ పాఠంలాంటిదే. ఇదీ జీవితమని గుణపాఠం నేర్పేదే. ఇంట్లో కూర్చుని టీవీల్లో గమనించడం వేరు. కొండా కోనలను ప్రత్యక్షంగా చూడ్డం వేరు. ఎవరి సాయం లేకుండా.. ఎంత దూరమైనా.. అన్న మాటే మంత్రంగా ప్రతి అడ్డంకీ ఇష్టంగా అధిగమిస్తూ ముందుకెళ్తూ ఉంటే.. ఆ అనభూతులు ఇచ్చే ఆనందమే వేరు అనుకుంటూ ప్రయాణం సాగించింది శర్మ.

బంధు మిత్రులొక పక్క ఆతృతపడుతుంటే తాను మాత్రం ఉల్లాసంగా ఉత్సాహంగా యాత్ర చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపింది. అక్కడక్కడా కొన్ని స్థానిక పత్రికల్లో తన సాహసయాత్ర గురించి వార్తలు చూసి.. సంబర పడింది రోషిణీ. మరి తనది ఒంటరి ప్రయాణం కదా? ఆ టైంలో మనకు మనం మెచ్చుకుంటూ ఎంకరేజ్ చేసుకుంటూ సాగాలి. తప్పదు.. రోషిణీ శర్మ ఈ టూర్ ప్లాన్ చేయడానికి ఎనిమిది నెలల సమయం తీసుకుందట. లక్ష రూపాయలు మాత్రమే ఖర్చయ్యాయట. ఓ బైక్, కెమెరా, సెల్‌ఫోన్.. ప్రయాణంలో ఆమె సాధనాలు. బండి మీద దూరతీరాలకు చేరడం.. అక్కడి ప్రకృతిని కెమెరాల్లో బంధించడం. ఏదైనా సమాచారం కోసం సెల్‌ఫోన్‌లో సంప్రదించడం.. ఇలా సాగింది రోషిణీ సాహస యాత్ర.

ఎండా, వానా, చలీ, బురదా, రాయి, రప్పా ఇలా ప్రతిదీ ఆమె ప్రయాణంలో ఆటంకాలు సృష్టించడానికి ప్రయత్నించినవే. ఆమె సామర్థ్యానికి పరీక్ష పెట్టినవే. వాటన్నిటినీ ఏ మాత్రం లెక్క చేయక ఎంతో ఓపిగ్గా అన్నింటినీ దాటుకుని గమ్యం చేరింది రోషిణీ.

వెనుదిరిగి చూసుకుంటే 5 వేల కిలోమీటర్లు. వినేవాళ్లకెలా ఉంటుందో తెలీదుగానీ, తనకు మాత్రం చాలా ప్రశాంతంగా, సాధారణంగా అనిపించింది. అసాధ్యం సుసాధ్యమైందన్న ఉద్వేగాల్లాంటివేం లేవ్. అయితే ఫేస్‌బుక్ లో స్టేటస్ అప్‌డేట్ చేశాక మొదలైంది అభినందనల పరంపర. వాళ్లందరూ అలా మెచ్చుకుంటే, అప్పుడర్థమైంది. తనది ఎంత పెద్ద యాత్రో. ఈ యాత్ర మధ్యలో పెప్పర్ స్ప్రే అవసరమే రాలేదు. మనస్సులో సంకల్పమనే ప్రేరణ ముందు ఈ స్ప్రే ఏపాటి..? ఇప్పుడు రోషిణీ శర్మ తదుపరి ప్రయాణం ఎక్కడికో తెలుసా? యూరోప్. ఈ పర్యటన కూడా విజయవంతం కావాలని ఆశిద్దాం.



అతడు-ఆమె

78

జరిగిన కథ

అబ్బాయికోసం కచేరీకి పంపించడానికి వెండి టిఫిన్ క్యారేజీ నేను సర్దుతానులే. ముక్కల్లో యేమాత్రం గంజి వుంచేసినట్టయితే - అబ్బాయి వేలువేసి ముట్టుకోడు సుమా!" అని వెంకయ్యగారికి వంట ఫిర్మాయించి - పెనిమిటి స్నానానికి నీళ్ళు తొలిపేందుకని - మొక్కలపీట చేతబుచ్చుకొని - నీళ్ళపాకలో కెళ్ళిందావిడ.

మాలతీ, నేను లోపలి వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇద్దరం ఒక్కతోటివాళ్ళం. తిరుక్కోయిలూర్ రాజమాణిక్యం పిళ్ళే దగ్గిర నేను భరత నాట్యం నేర్చుకున్న రెండేళ్ళూ - మాలతికూడా నాతో నేర్చుకుంది. ఆ రోజుల్లో పార్వతీశంగారు రెవెన్యూబోర్డు అసిస్టెంటు డిప్టీకమిషనరు చేస్తూండేవాడు. చెన్నపట్నంలో ప్రభాశంకరు - నజిమోవా నాట్య ప్రదర్శనం చూశాక, మరి నాకు భరతనాట్యం మీద మోజుపోయి నేర్చుకోవడం మానేశాను.

(నిన్నటి సంచిక తరువాయి)

మాలతి స్కూలు ఫైనలు పరీక్షల్లోపడి భరత నాట్యం మానేసింది. మాలతి స్కూలు ప్యాసై క్వీను మేరీస్ ఇంటరులో ప్రవేశించింది. నేను కాశీ మెట్రిక్కు తప్పి, నాన్న బలవంతంమీద కాన్వెంటులో కేంబ్రిడ్జీ సీనియర్‌లో ప్రవేశించాను. వాళ్లూ తేనాంపేటలోనే వుండడంచేత - వాళ్ళ కార్లోనో, మా కార్లోనో ఇద్దరం కలిసే బడికెళ్ళే వాళ్ళం. కాలేజీ నుంచి ఇంటికెళ్ళేటప్పుడు మాలతి మా యింట్లో కాస్సేపు కూర్చునిమరీ వాళ్ళింటికెళ్ళేది. పాపాయికూడా మాలతి చెల్లెలితో నేస్తం కట్టి వాళ్ళింట్లో ఆడుకునేది. మేం యూరపులో వుండగా - మాలతి ఇంటరు పూర్తిచెయ్యడం, సెటిల్మెంట్ కలక్టరు సింగరాజు పాపారావు గారి అబ్బాయి కృష్ణ మోహను కిచ్చి ప్రధానం జరిగింది. మేము యూరపు నుంచి వచ్చిన మరుసటేడు మాలతి బియ్యే చదువు మానివేయడం, ఆ అబ్బాయి మెడికలు చదువు అయి హౌస్‌సర్జన్ పూర్తిచెయ్యడం, తిరుపతిలో పెళ్ళి, కృష్ణ మోహనునికి కన్ననూరులో ఉద్యోగం అయింది. ఇద్దరూ వెళ్ళిపోయారు. మాలతి వెళ్ళిపోయేముందు మా యింట్లో నాల్గురోజులుంది. ఆ రోజుల్లోనే పాపారావుగారు డిప్టీకలక్టరుగా రిటైరు అవడం, మదనం ఐ.సి.యస్. ప్యాసై రావడం,వీళ్ళు విశాఖపట్నం, వాళ్ళు కన్ననూరు వెళ్ళిపోయారు. మరుచటి సంవత్సరం అంతా అమ్మ వ్యక్తిసత్యాగ్రహంలో జైలుకి వెళ్ళడం - నాన్న పెద్ద వ్యాజాల్లో తరచు గ్రామాంతరం వెళుతూండడం - తరువాత ఎందుకేనా మంచిది ఒకమాటు మనంకూడా జైల్లో కూచుని వద్దాం అని గడుసుదనంగా నాన్నకూడా రెండునెలలు జైలుకి వెళ్ళిరావడం - అమ్మనీ నాన్ననీ చూడడానికి నేనూ, పాపాయి తరుచు కారుమీద రాయవేలూరు వెళుతూండడం, దీంతో సరి పోయింది. తరువాత వాళ్ళకీ కన్ననూరునుంచి కడప ఆస్పత్రికి బదిలీ అయిపోయింది. కడపలో రెణ్ణెల్లే వున్నారో మూణ్ణెల్లో వున్నారో - పాపం ఒకనాడు - శవపరీక్ష చేస్తుండగా - కృష్ణమోహనునికి వేలు గంటుపడి - సంధి జ్వరంవచ్చి పూటలో చచ్చి పోయాడు. మాతికి అప్పటికి మూడోనెల కడుపు.

కోడలు కాపురానికి రావడం - కొడుక్కి మారకం అయిందని - మాలతిని అత్తారు, పుట్టింటికి పంపించేశారు. మనవడుపుడితే తాతకు గండం అని పుట్టింది. - ఆస్తి ఎక్కడ ఇవ్వాల్సొస్తుందేమోనని - పాపారావుగారు జానికమ్మగారు ఇంకేమిటి - భూతవైద్యులని పిలిపించి అంజనాలే వేయించడమా - శూన్యహోమాలే చేయించడమా - చిల్లంగి చేతబడే ప్రయోగించడమా - పోలేరమ్మకీ నూకాలమ్మకీ జాతర్లే చేయించడమా - మరిడమ్మకి యెనుబోతును బలి వేయించడమా - ఒకటేమిటి నానారభస ఆరంభించారు. వీళ్ళు మాత్రం ఏమి తక్కువవాళ్ళా? సింగరాజు ఆయన సెటిల్మెంటు కలక్టరు అవుతే - పెదప్రోలు ఆయన ల్యాండ్ అక్విజిషను కమిషరాయె! అతగాడు సర్వేరాళ్ళే తల్లకిందులుచేస్తే - ఇతగాడు అసలు భూమినే ప్లానులో లేకుండా మాయం చేస్తాడు! గుళ్ళో లింగాన్ని మింగేవాడొకడైతే - గుడినే మింగేవాడు మరొకడు! పేచీమీద పేచీ - వ్యూహం మీద వ్యూహం - తంత్రం మీద తంత్రం!



చర్చిల్ - హిట్లరు! ఇలాగు వారికీ వీరికీ పూర్తిగా చెడిపోయింది.

"నెలలు నిండేయి. చిన్ననాటి నేస్తానివి. నిన్ను చూడాలని వుంది. వెంటనే బయలుదేరిరా!"అని మాలతి నాకు ఉత్తరం వ్రాసింది. ఉత్తరం అమ్మకీ నాన్నకీ చూపించాను.... మేడమీద వసారాలో నాన్నా తాంబూలం వేసుకుంటూ అమ్మతో అంటూండటం నాకు వినిపించింది. "సుభ గడుసుముండ! ఐ.సి.ఎస్. వాటిని ఇట్టే బుట్టలో వేసేస్తుంది. దొండపండు లాంటి పెదిమెలు- గులాబీల్లాంటి చెక్కిళ్ళు చూసి టక్కు టక్కుమని దాని నోటంట వచ్చే ఇంగ్లీషు ముక్కలు ఫ్రెంచి ముక్కలు విన్నాడంటే - ఆ బాణాలకి మదనం లొంగిపోతాడు.



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

క్రిప్సు ధర్మమా అంటూ ఆంధ్రరాష్ట్రం వచ్చిందంటే - యుద్ధం అయ్యేసరికి వాడు రెవెన్యూ బోర్డు మెంబరై రాజ్యం యేలుతూంటాడు. అన్నివిధాల భేషైన సంబంధం. చూడూ! అది వెళుతూన్నది కలక్టరింటికాయె - ఆ బండ ఖద్దరు మాన్పించి - చక్కని వాయిల్సు, జార్జెట్, షిఫాను కొని ఇయ్యి. లేకపోతే - ఇది కాంగ్రెసు మనిషి అని చెప్పి వాడి ఉద్యోగం ఊడిందంటే - ఆ లంపటం మనకే తగులుకుంటుంది సుమా! అప్పుడు వీళ్ళందరినీ పోషించలేక మనం చస్తాం! నేనుపూరికే ఛలోక్తికి అన్నానులే - మరేమీ అనుకోకు! కీడెంచి మెలెంచమన్నారు! అదిగో చూడు - నువ్వు మాత్రం ఆ భడవని హుషారెక్కించి పంపించు..." నాన్న మాటలని విని నేను నవ్వుకున్నాను...

...రైలు దగ్గర అమ్మ అంది : అమ్మాయి! మాలతికి సాయంగా వుండేం! నువ్వు విశాఖపట్నం వెళుతూన్నది ఆమెకోసం సుమా! ఏ విషయంలోనూ తొందరపడకేం! ఎప్పుడు కూడా నీ మనస్సాక్షి యెలా చెబుతూందో అలా ప్రవర్తించు. టిక్కెట్టూ రెండు వందలూ భద్రం! సొమ్ము కావలిస్తే అనుమానించక నాకు టెలిఫోను చెయ్యి! జాగ్రత్తగా వెళ్ళిరా- సుభా!" అని ముద్దు పెట్టుకుంది. నేనెంత అదృష్ట వంతురాలిని !

...మదనం క్లబ్బు నుంచి వస్తూనే సంతోషం పట్టలేక గుమ్మంలోనుంచే అన్నాడు : నాన్నగారూ! అమ్మా! ఇప్పుడే అతి రహస్యమైన ఖబురు అందింది. జపానువాడు కొంతమంది సైనికులని పూరీ జగన్నాథం రేవులో సబ్ మెరైన్లమీద దింపాడట. ఇక మనం రాత్రి కోటలో పాగా వేశామే."

రాత్రి నిదరోయేముందు మాలతి అంది : "సుభా! యేంటి ఆలోచిస్తున్నావు?" "మీ తమ్ముడి గోరోజనానికి యేమిటా మందూ అని" అన్నా.

"నువ్వే పడేయాలి, యేదేనా మాత్ర ఒకటి నవ్వుతూనూ, మాలతి.

2 అతడు

కొత్తగా కట్టిన మందుగుండు ఫ్యాక్టరీ నుంచి - గుమ్మడి పూండి పక్కగా - ఉప్పు కొఠారుల్లో స్థాపించిన నేవల్ డిపో వరకూ - ఆరుమైళ్ళ పొడుగునా - వెంటనే రైలు మార్గం వేయవలసిందనీ - ఎంత ఖర్చు అయినా సరే - మార్షలింగు యార్డులు - లూప్ లైనులు - రిపేరింగు షాపులు - ఆటోమేటిక్ బ్లాకింగుతో సహా - పని అంతా రెండు నెలల్లో పూర్తిచేసి అమెరికన్ సైన్యాధిపతికి అప్పజెప్పవలసిందని - నిన్ననే ఢిల్లీనుండి తాఖీదులు వచ్చాయోలేదో - అప్పుడే పసిపట్టేసి - రేచుకుక్కల్లా కాంట్రాక్టర్లు నా బంగళా చుట్టూ తిరగడం మొదలెట్టారు! కలకత్తా డైరెక్టరు ఒకడు - బొంబాయి నుంచి దొర ఒకడూ - ఢిల్లీ నుంచి సిక్కు కాంట్రాక్టరు ఒకడు - కన్నిమెరాల 'లంచి'కని - బసోటోలో 'డిన్నరు'కనీ - 'వుడ్ లాండ్సు'లో వనభోజనానికనీ ఆహ్వానాలు! నా ఒంట్లో సుస్తీ అనీ - అన్ని సంగతులూ కచేరీలోనే మాట్లాడవచ్చుననీ టెలిఫోనులో మర్యాదగా చెప్పేశాను. అయినా - వీళ్ళు నా ప్రాణం తీయడం మానకుండా వున్నారు. స్నానానికి వెళదామా అనుకుంటూ - తెలుగు పత్రిక చదువుతున్నాను. బంట్రోతు వుత్తరం ఒకటి తీసుకొచ్చిచ్చాడు. వుత్తరం విప్పిచూదును - చీటీ వకదానిమీద ఒక కచ్చీ కాంట్రాక్టరు పేరు - ఒక గొప్ప బొంబాయి కాంగ్రెసు నాయకుడి పేరు - చీటికి గుచ్చి ఐదు వెయ్యి రూపాయల నోట్లు బంట్రోతునీ - ఆ చీటీ తెచ్చిన మనిషిని పిలిపించి మొఖం వాచేటట్లు చివాట్లు పెట్టి - చీటీని - నోట్లనీ వాపసు చేసేశాను.

అసలే రైల్వేకంపెనీ - అందులో మిలిటరీ కంట్రాక్టు - ఇక చెప్పేదేమిటి - అరాచకానికి! అన్నిటికీ మించిన వింత విశేషం యేమిటంటే - బ్రిటిషువాళ్ళపై సత్యాగ్రహం చేసి నిన్నటివరకూ జైలులో కూర్చున్న కాంగ్రెస్ హేమాహేమీలే - యీ వ్యాపారంలోకి దిగడం!... యీ లంచం గురించి తల్చుకున్నకొద్దీ నాకేం పాలుపోవడం లేదు. ఏ నిమిషంలో వచ్చి జపానువాడు దేశం మీద పడతాడో అని మహాప్రమాదం ఒకవేపునుంచి ముంచుకొస్తూంది. ఒకవేపునుంచి కరవు మండిపోతూంది. ధరలు పెరిగిపోతున్నాయి. లక్షలాది జనం తిండిలేక చచ్చిపోతున్నారు. దేశం అంతా శ్మశాన వాటికలా వుంది. ఇంటిముందున్న శవాన్ని చూసి బేరం చేస్తున్న వాహకుల్లాగు ప్రజల ఆకలిబాధ చూసి, దొంగ బజార్లో నిర్దాక్షిణ్యంగా లక్షలూ కోట్లూ ఆర్జించేస్తున్నారు - వర్తకులు వ్యాపారస్తులు. కాంగ్రెస్ వ్యక్తి సత్యాగ్రహం మొదటుపెట్టడం- విరమించడం కూడా అయింది. ఈ క్షణంలో గాంధీగారిని కాంగ్రెస్ గద్దెమీద కెక్కించడం - ఉత్తరక్షణంలో - "దిగుదిగు నాగన్న!" అన్నట్టు గద్దెమీదనుంచి కిందికి దించడం అవుతూంది. జైళ్ళ తలుపులు తెరవడం అయింది. బార్డోలీ అయింది. "ఈ జైళ్ళు తెరిచే ఘనకార్యం చూస్తే - నాకేమీ చీమ కుట్టినట్టన్నా లేదు" అంటున్నారు గాంధీగారు. "మాకు స్వరాజ్యం ఇవ్వండి - మా చేతనైనంత సాయం మేం చేస్తాం యుద్ధంలో" అంటున్నాడు జవహర్‌లాల్. సత్యాగ్రహం - సహాయ నిరాకరణం - అహింసాతత్వం - వీటికి స్వస్తిచెప్పి జిన్నాతో రాజీపడి బ్రిటిషువారితో కలిసి యీ ముంచుకొస్తున్న జపాను ప్రమాదాన్ని యెదుర్కొంటేనేగానీ మనకి పుట్టగతులు వుండవు అని రాజగోపాలాచారి అంటున్నాడు. సరిగ్గా సమయం చూసి పంపించాడు చర్చిలు క్రిప్సుని. ఈ సంజయ రాయబారం పొసిగేటట్టు లేదు. గాంధిగారు, కాంగ్రెసువాళ్ళు, జిన్నా, సావర్కారు, సప్రూ ఎవ్వరూ క్రిప్సు వైపు మొగ్గడంలేదు.

- ఇంకా వుంది.

ప్రపంచంలో అతిపెద్ద ఉష్ణమండల ఎడారి ఏది?



1. బంగారు నిక్షేపాలకు ప్రసిద్ధి చెందిన 'విట్ వాటర్స్‌రాండ్' ప్రాంతం ఏ దేశంలో ఉంది?
1. అమెరికా 2. ఇంగ్లాండ్
3. దక్షిణాఫ్రికా 4. ఆస్ట్రేలియా

2. ఏ దేశంలో సవన్నా భూములను కాంపాలు అని పిలుస్తారు ?
1. బ్రెజిల్ 2. సెనెగల్
3. ఈక్వెడార్ 4. వెనిజులా

3. లిబియా దేశంలోని 'అజీజియా' ప్రాంతం ప్రత్యేకత ఏమిటి ?
1. అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం
2. అత్యధిక ఉష్ణ తుపానులు సంభవిస్తాయి
3. అధిక ఉష్ణోగ్రత నమోదైంది
4. శీతోష్ణస్థితిలో అధికంగా మార్పులు సంభవించే ప్రాంతం

4. భూమధ్యరేఖా ప్రకృతిసిద్ధ మండలం ఎన్ని ఖండాల్లో విస్తరించి ఉంది ?
1. 3 2. 4 3. 5 4. 6

5. ఫ్రాన్స్‌లోని 'గ్రాసే' ప్రాంతం దేనికి ప్రసిద్ధి చెందింది ?
1. సార్డైన్, ట్యూనా చేపల ఎగుమతి పరిశ్రమలు ఉన్నాయి
2. 'కాసినో'ల ద్వారా విదేశీ యాత్రీకులను ఆకర్షిస్తుంది
3. సినిమా పరిశ్రమ ఉంది 4. పుష్పాల నుంచి తీసే సుగంధ నూనె తయారీ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి

6. కిందివాటిలో మధ్యధరా సముద్ర తీరప్రాంతంలో లేని ద్వీపం ఏది ?
1. క్రీట్స్ 2. సైప్రస్
3. కోర్సికా 4. బీరూట్

7. నైజీరియా ఏ ప్రకృతి సిద్ధ మండలానికి చెందిన దేశం ?
1. భూమధ్య రేఖా ప్రాంతం 2. సవన్నా భూములు
3. టైగా ప్రాంతం 4. స్టెప్పీ ప్రాంతం

8. 'వాడీలు' అంటే ఏమిటి ?
1. ఇసుక ఎడారులు 2. లోయలు
3. సరస్సులు 4. రాతి ఎడారులు

9. ప్రపంచంలో గంధకాన్ని అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం ఏది ?
1. మలేషియా 2. ఇండియా
3. మెక్సికో 4. అమెరికా

10. ఉత్తరార్ధ గోళంలో మాత్రమే ఉన్న ప్రకృతిసిద్ధ మండలం ఏది ?
1. టైగా మండలం 2. రుతుపవన మండలం
3. స్టెప్పీ ప్రాంతం 4. సవన్నా ప్రాంతం

11. అనటోలియా పీఠభూమి ఏ దేశంలో ఉంది ?
1. ఆస్ట్రేలియా 2. ఉత్తర కొరియా
3. ఫ్రాన్స్ 4. టర్కీ

12. 'క్యూబా హవానాలు' అంటే?
1. పంచదార గిన్నెలు 2. శ్రేష్టమైన పాలను ఇచ్చే గేదెలు
3. అందమైన పక్షులు 4. నాణ్యమైన చుట్టలు

13. సోనారస్ ఎడారి ఏ దేశంలో ఉంది ?
1. మెక్సికో 2. కెనడా
3. ఆస్ట్రేలియా 4. పెరూ

14. 'సెల్వాలు' అంటే ఏమిటి ?
1. ఆదిమజాతి తెగ 2. గడ్డి భూములు
3. అత్యంత దట్టమైన అడవులు 4. తీగజాతి మొక్కలు

15. ప్రపంచంలో అత్యధిక సంవత్సరిక ఉష్ణోగ్రత తారతమ్యాలు నమోదయ్యే ప్రాంతం ఏది ?
1. న్యూ ఫౌడ్‌లాండ్ 2. సైబీరియా
3. వెర్ఖొయానస్క్ 4. ఇర్‌కుట్‌స్క్

16. ఆస్ట్రేలియాలోని 'బ్రోకెన్‌హిల్' వేటికి ప్రసిద్ధి చెందింది ?
1. పెట్రోలియం క్షేత్రాలు 2. సీసం- యశదం గనులు
3. రాగి - నైట్రేట్ గనులు 4. ఇనుము పరిశ్రమలు

17. అంగోరా జాతి గొర్రెలను అధికంగా ఎక్కడ పెంచుతున్నారు ?
1. దక్షిణాఫ్రికా 2. రష్యా
3 మెక్సికో 4. అమెరికా సంయుక్త రాష్ట్రాలు

18. 'ది గ్రాండ్ కానియన్ ఆఫ్ కొలరాడో' ఏ ప్రకృతి సిద్ధ మండలంలో ఉంది ?
1. భూమధ్య రేఖామండలం 2. సమశీతోష్ణ మండలం
3. టండ్రా మండలం 4. ఉష్ణ మండలం

19. 'గుయానో' అనే పక్షి రెట్టల సహజ ఎరువును ఏ దేశంలో ఉపయోగిస్తారు ?
1. పెరూ 2. ఈజిప్ట్
3. చిలీ 4. జోర్డాన్

20. ప్రపంచంలో అతిపెద్ద ఉష్ణమండల ఎడారి ఏది ?
1. కలహారి ఎడాది 2. థార్ ఎడాది
3. సహారా ఎడారి 4. అటకామా ఎడారి

21. 'ఐరోపా ఖండపు క్రీడా ప్రాంగణాలు'గా పిలిచే ప్రాంతాల్లో కింది వాటిలో లేనిది ?
1. డాల్మేషియా తీరం (యుగొస్లావియా) 2. క్రిమియా
3. ఇటలీ తీరంలోని సన్నని తీర మైదానం 4. నల్ల సముద్ర తీర ప్రాంతం

22. ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ పరిశ్రమ అమెరికాలోని ఏ రాష్ట్రంలో ఉంది ?
1. కాలిఫోర్నియా 2. ఫ్లోరిడా
3. మిస్సిసిపి 4. వాషింగ్టన్

23. ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత ఉన్న దేశం ఏది ?
1. మొనాకో 2. బంగ్లాదేశ్
3. సింగపూర్ 4. చైనా

ఏపీ టెట్ సోషల్ స్టడీస్

24. కిందివాటిలో ఉష్ణ ఎడారిలో నివసించే ఆటవిక తెగ ఏది ?
1. సెమాంగులు 2. బుష్‌మెన్‌లు
3. పిగ్మీలు 4. సకాయిలు

25. కిందివాటిలో ఒక ప్రదేశం శీతోష్ణస్థితిని ప్రభావితం చేయని అంశం ఏది ?
1. ఉపరితల నిమ్నోన్నతాలు 2. సౌర వికిరణం
3. ఆ ప్రదేశ ఎత్తు 4. గాలి వీచే దశ

26. ప్రపంచంలో అతి లోతైన మంచినీటి సరస్సు 'బైకాల్' ఏ దేశంలో ఉంది ?
1. ఈజిప్ట్ 2. అమెరికా
3. రష్యా 4. కాంగో

27. ప్రపంచంలో పాదరసాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఏది ?
1. ఫ్రాన్స్ 2. ఇటలీ
3. అమెరికా 4. జర్మనీ

28. 'కార్ప్, హెరింగ్, స్టర్జియాన్'లు అనేవి ?
1. చేపల రకాలు 2. వృక్ష జాతులు
3. గడ్డి భూముల్లో పెరిగే మొక్కలు 4. ధ్రువ ప్రాంతపు మృగాలు

29. భూ ఉపరితలంపై ఇప్పటివరకు నమోదైన అత్యధిక పగటి ఉష్ణోగ్రత ఎంత ?
1. 64 డిగ్రీల సెంటీగ్రేడ్ 2. 58 డిగ్రీల సెంటీగ్రేడ్
3. 52 డిగ్రీల సెంటీగ్రేడ్ 4. 50 డిగ్రీల సెంటీగ్రేడ్

30. ఏ ప్రాంతంలో రాబోయే సంవత్సరంలో అత్యధిక రోజులు (322 రోజులు) ఉరుముల శబ్దం వినిపిస్తుంది ?
1. మాసిన్‌రామ్ 2. కామెరూన్
3. బోగోర్ 4. వయలీలీ

31. 'టెల్-అవీవ్' ఏ దేశంలోని ప్రముఖ నగరం ?
1. స్విట్జర్లాండ్ 2. ఫ్రాన్స్
3. ఇజ్రాయెల్ 4. టర్కీ

32. ఉత్తర ధ్రువానికి దగ్గరగా ఉన్న పెద్ద నగరం ఏది ?
1. ఇర్‌కుట్‌స్క్ 2. ఆర్ఖేంజెల్
3. ముర్మాన్‌స్క్ 4. ఫెయిర్‌బాంక్

33. రెడ్ ఇండియన్‌ల పురాతన ఆవాసాల శిథిలాలు ఏ దేశంలో ఎక్కువగా ఉన్నాయి ?
1. వెస్టిండీస్ 2. జమైకా
3. వెనిజులా 4. మెక్సికో

34. ప్రపంచంలో అత్యధిక వర్షపాతం సంభవించే ప్రాంతం ఏది ?
1. వయలీలీ శిఖరం 2. మాసిన్‌రామ్
3. చిరపుంజి 4. హవానా ద్వీపం

35. కిందివాటిలో సరైన జత ఏది ?
1. అమెజాన్ - రెడ్ ఇండియన్లు 2. కాంగో - సెమాంగులు
3. సుమత్రా - పిగ్మీలు 4. బోర్నియో - కాబూలు

36. 'హంసియెండాలు' అనే వ్యవసాయ క్షేత్రాలు ఏ ఖండంలో ఉన్నాయి ?
1. ఆసియా 2. ఆస్ట్రేలియా
3. దక్షిణ అమెరికా 4. ఉత్తర అమెరికా

37. మృతలోయ ఏ ఎడారిలో ఉంది ?
1. సహారా 2. అరేబియా
3. కలహారి 4. సోనారస్

38. 'సిరోకో, శాంటా అన్నా' అనేవి ఏమిటి ?
1. చలిగాలులు 2. వేడిగాలులు
3. శీతల ప్రవాహాలు 4. ఉష్ణ ప్రవాహాలు

39. 'అన్నం' తీరం ఏ దేశంలో ఉంది ?
1. తైవాన్
2. మలేషియా
3. వియత్నాం
4. థాయ్‌లాండ్



40. కిందివాటిలో 'ఎక్సోటిక్' నది కానిది ఏది ?
1. నైలు
2. గంగా
3. ఆరెంజ్
4. డార్లింగ్

41. జతపరచండి.

ప్రాంతం	గడ్డిభూములు
a. దక్షిణ అమెరికా	i. వెల్డులు
b. ఉత్తర అమెరికా	ii. ప్రయరీలు
c. ఆస్ట్రేలియా	iii. పంపాలు
d. దక్షిణాఫ్రికా	iv. డౌన్‌లు

1. a-i, b-ii, c-iii, d-iv
2. a-ii, b-iii, c-iv, d-i
3. a-iii, b-ii, c-iv, d-i
4. a-iv, b-iii, c-i, d-ii

42, టైగాలకు దక్షిణంగా ఉండే గడ్డి భూములను ఏమని పిలుస్తారు ?
1. సవన్నాలు 2. వెల్డులు
3. స్టెప్పీలు 4. పంపాలు

43. 'స్ఫినిక్స్' అంటే ?
1. భద్రపరిచిన శవం
2. మనిషి తల, సింహం శరీరంతో ఉన్న బొమ్మ



3. సంచార జాతి 4. ఐరోపా క్రీడా ప్రాంగణం

44. 'వేయి సరస్సుల దేశం'గా దేన్ని పిలుస్తారు ?
1. స్విట్జర్లాండ్ 2. వెనీస్
3. ఫిన్లాండ్ 4. నార్వే

45. కిందివాటిలో 'ప్లాయలు' అని వేటిని పిలుస్తారు ?
1. లోయలు 2.నదులు
3. ఎడారులు 4. సరస్సులు

46. 'బోర్నియో ద్వీపం'లో నివసించే ఆదిమ జాతుల పేరేమిటి ?
1. పిగ్మీలు 2. హెడ్ హంటర్స్
3. సెమాంగులు 4. కాబులు

47. విక్టోరియా జలపాతం ఏ నదిపై ఉంది ?
1. కొలంబియా 2. జాంబెజీ
3. ఒరినాకో 4. అమెజాన్

48. ప్రయరీలు అనే పచ్చికబయళ్లు ఏ ప్రాంతంలో ఉంటాయి ?
1. ఉత్తర అమెరికా 2. యురేషియా
3. దక్షిణాఫ్రికా 4. ఆస్ట్రేలియా

49. కిందివాటిలో 'రూకరీలు' అనే వేటిని పిలుస్తారు ?
1. పక్షుల సమూహాలు 2, శిలాజాలు
3. నాచు జాతి మొక్కలు 4. పూల మొక్కలు

50. ప్రపంచంలో అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం ఎక్కడ ఉంది ?
1. అబదాన్ నగరం 2. లీమా నగరం
3. కైరో నగరం 4. ఫీనిక్స్ నగరం

51. 'బుష్‌మెన్' ఆటవిక జాతుల నివాస ప్రాంతం ఏది ?
1. కలహారీ ఎడారి 2. తూర్పు ఎడారి
2. కాంగో నది హరివాణం 4. సహారా ఎడారి

52. కలహారి ఎడారి ప్రజల ముఖ్య వృత్తి ఏది ?
1. వేటాడటం 2. వరిపంటను సాగుచేయడం
3. అడవులను నరికి వంటచెరకు అమ్మడం
4. కాఫీ పంటను సాగుచేయడం

53. 'కాబు' తెగ ఆదిమవాసులు ఏ ప్రాంతానికి చెందినవారు ?
1. కాంగో హరివాణం 2. మలేషియా అడవి
3. బోర్నియో 4. సుమత్రా

54. 'కంగారుల' ఉనికితో ఆస్ట్రేలియాకు ఏ బిరుదు వచ్చింది ?
1. ద్వీప ఖండం 2. సజీవ శిలాజ భూమి
3. గొప్ప ఆర్టీసియన్ హరివాణం 4. లాగూన్ల భూమి

55. "మెజిస్టో' మిశ్రమ జాతి రక్తం ఏ జాతుల మిశ్రమం ?
1. అమెరికన్ ఇండియన్లు, యూరోపియన్లు
2. యూరోపియన్లు, ఆఫ్రికన్లు
3. ఇండియన్లు, ఆఫ్రికన్లు
4. యూరోపియన్లు, రష్యన్లు

56. దక్షిణాఫ్రికాలోని సమశీతోష్ణ మండల గడ్డి భూములను ఏమని పిలుస్తారు ?
1. వెల్డులు 2. ప్రయరీలు
3. స్టెప్పీలు 4. పంపాలు

57. కరారా అనే విగ్రహాల తయారీలో ఉపయోగపడే పాలరాయికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన దేశం ఏది ?
1. ఫ్రాన్స్ 2. జపాన్
3. ఇటలీ 4. జర్మనీ

58. ప్రపంచ సార్డైన్ రాజధానిగా పేరొందిన నగరం ఏది ?
1. గ్రాసే 2. లాస్ ఏంజెల్స్
3. మాంటిరె 4. సిగ్నల్ హిల్

59. టండ్రా మండలంలోని యురేషియాలో నివసించే స్థానిక ప్రజలను ఏమని పిలుస్తారు ?
1. ఎస్కిమోలు 2. బుష్‌మెన్‌లు
3. లాపులు 4. పిగ్మీలు

60. యురేషియాలోని సమశీతోష్ణ మండల పచ్చిక బయళ్లను ఏమని పిలుస్తారు ?
1. ప్రయరీలు 2. స్టెప్పీలు
3. డౌనులు 4. పంపాలు

61. ఉత్తర అలాస్కా నుంచి గ్రీన్‌లాండ్ వరకు ఉండే ఎస్కిమోలు మాట్లాడే ప్రధాన భాష ఏది ?
1. యుపిక్ 2. అల్యూయిట్
3. ఆజోరాన్ 4. ఇన్యుపిక్

62. కిందివాటిలో ఉష్ణ ఎడారి కానిది ఏది ?
1. సహారా 2. అటకామా
3. కలహారి 4. గోబీ

63. మధ్య, దక్షిణ ఆఫ్రికాలోని నిగ్రోలను ఏమని పిలుస్తారు ?
1. బెడోయిన్లు 2. పిగ్మీలు
3. బుష్‌మెన్లు 4. బంటూలు

సమాధానాలు

1. 3	2. 1	3. 3	4. 1	5. 4	6. 4
7. 2	8. 2	9. 3	10. 1	11. 4	12. 4
13. 1	14. 3	15. 3	16. 2	17. 4	18. 2
19. 1	20. 3	21. 4	22. 1	23. 1	24. 2
25. 2	26. 3	27. 2	28. 1	29. 2	30. 3
31. 3	32. 3	33. 4	34. 1	35. 1	36. 3
37. 4	38. 2	39. 3	40. 2	41. 3	42. 3
43. 2	44. 3	45. 4	46. 2	47. 2	48. 1
49. 1	50. 1	51. 1	52. 1	53. 4	54. 2
55. 1	56. 1	57. 3	58. 3	59. 3	60. 2
61. 4	62. 4	63. 4			

పుంజుకుంటున్న 'రియల్'



న్యూఢిల్లీ :రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా), వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వంటి నిర్మాణాత్మక సంస్కరణలను రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా ఆకళింపు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రియల్టీలో సెంటిమెంట్ సానుకూలంగా మారుతోంది. ఫిక్కీ-నరెడ్కో-నైట్‌ఫ్రాంక్ ఇండియాలు నిర్వహించిన తాజా సర్వేలో 2017 నాలుగో త్రైమా సికం (అక్టోబరు-డిసెంబరు) లో రియల్ ఎస్టేట్ సెంటి మెంట్ సూచీ ఆధారంగా ఈ విషయం స్పష్టమవు తోంది. గత ఏడాది రెండు, మూడు త్రైమాసికాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో సెంటిమెంట్ ప్రతికూలంగా ముగిసింది.

కానీ చివరి త్రైమాసికంలో పరిస్థితి సానుకూలంగా మారి పోయింది. భవిష్యత్‌కు సంబంధించిన సెంటిమెంట్ కూడా పుంజుకుందని, పెద్ద నోట్ల రద్దుకు ముందు ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఈ సూచీ ద్వారా తెలుస్తోంది. డెవలపర్లు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ల సెంటిమెంట్ కూడా సానుకూలంగా మారింది. అందుబాటు ధరల్లో గృహాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే తగిన విధానాలు రూపొం దిస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యతరహా, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తి చూపు తున్నాయి. అమ్మకాల్లోనూ ఆశావాదం పెరిగిపోతోంది. రానున్న ఆరు నెలల కాలంలో ఆఫీస్ మార్కెట్ మరింతగా మెరుగుపడే అవకాశం ఉందని నైట్‌ఫ్రాంక్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్, నేషనల్ డైరెక్టర్ (రీసెర్చ్) సమంతక్ దాస్ చెబుతున్నారు.

అంత ఇవ్వలేం

- చేతులెత్తేసిన పీఎన్‌బీ
- రూ.6వేల కోట్లు మాత్రమే చెల్లిస్తాం



న్యూఢిల్లీ: రూ.6వేల కోట్ల బకాయిలను మాత్రమే తాము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) స్పష్టం చేసింది. బకాయిలు పడ్డ బ్యాంకులకు మొత్తం నగదును చెల్లించలేమని పీఎన్‌బీ చేతులెత్తేసింది. దీంతో బ్యాంకర్లు ఈ విషయాన్ని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. పీఎన్‌బీ అంశం గురించి చర్చించేందుకు శనివారం పలు బ్యాంకర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పీఎన్‌బీ కూడా హాజరైంది. సమావేశంలోనే పీఎన్‌బీ ఈ విషయాన్ని వెల్లడించింది. పీఎన్‌బీలో రూ.11 వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగుచూసిన విషయం తెలిసిందే. పీఎన్‌బీ అధికారులు కొందరు మధ్యవర్తిగా ఉండి కొంతమంది ఖాతాదారులకు లబ్ధి చేకూరేందుకు తప్పుడు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ)ల ద్వారా కుట్ర పన్ని భారీగా మోసానికి పాల్పడింది. అయితే.. ఈ బకాయిలను పీఎన్‌బీనే స్వయంగా బ్యాంకుర్లకు చెల్లించాల్సిందిగా అధికారులు నిన్న ఆదేశించారు. మార్చి చివరి వారంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా అధికారులు తెలిపారు. అంత మొత్తాన్ని చెల్లించేందుకు పీఎన్‌బీ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే బ్యాంకర్లు ఆర్‌బీఐని ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. పీఎన్‌బీ మధ్యవర్తిగా ఉండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ తదితర 30 బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు సాయపడినట్టు తేలింది. ఇందులో భాగంగా యూనియన్ బ్యాక్ ఆఫ్ ఇండియాకు పీఎన్‌బీ రూ. రూ.1,915కోట్లు బకాయిలు పడగా.. ఎస్‌బీఐకి రూ.1,360కోట్లు బకాయిలు పడింది. ఈ భారీ కుంభకోణానికి సంబంధించి కీలక సూత్రధారి అయిన పీఎన్‌బీ మాజీ డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టితో పాటు మరో ఇద్దరిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు.

ఐబీఏ సమీక్ష : పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణంపై బ్యాంకర్ల సంఘం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) కూలంకశంగా చర్చించింది. ఈ సమావేశానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన ఉన్నతాధికారులు హాజరైనట్లు విభిన్న వర్గాల ద్వారా తెలిసింది. తొలుత ఈ సమావేశంలో దక్షిణ ముంబైలోని ఐబీఏ ప్రధాన కార్యాలయంలో జరుగాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఈ భేటిని ఎస్‌బీఐ హెడ్‌క్వార్టర్‌కు మారింది. కుంభకోణంపై జరుగుతున్న సమావేశం కావడంతో మీడియాను అనుమతించలేదు. అలహాబాద్ బ్యాంక్ ఎండీ, సీఈవో, ఐబీఏ చైర్‌పర్సన్ ఉషా అనంత సుబ్రమణియన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో దీనబంధు మోహపాత్రా, ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి ఎన్ఎస్ కన్నన్, ఐబీఏ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూట్ బీ రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ కుంభకోణానికి పాల్పడిన వారి నుంచి ఎలా రుణాలు వసూలు చేసేదానిపై ప్రధానంగా చర్చించినట్లు ఓ ప్రముఖ బ్యాంకర్ వెల్లడించారు.

విచారణకు సహకరిస్తాం- జీజేఈపీసీ : పీఎన్‌బీలో జరిగిన ఈ భారీ కుంభకోణాన్ని ఖండిస్తున్నట్లు జెమ్ జువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. ఈ స్కాం ఇండస్ట్రీ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపదని అనుకుంటున్నానని జీజేఈపీసీ చైర్మన్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ఈ కుంభకోణంపై విచారణ జరుపుతున్న పలు ఏజెన్సీలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ స్కాంలో ప్రధాన నిందితులైన నీరవ్ మోదీ, చోక్సీలు సభ్యులుగా ఉండటం విశేషం. ఈ కేసుకు సంబంధించి విచారణను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు, వీరిద్దరిపై సరైన సమయంలో తగు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పీటీఐకి తెలిపారు.

మూడు కంపెనీల అడ్రస్ గోల్‌మాల్

నీరవ్ మోడీకి చెందిన మూడు డైమండ్ కంపెనీల అడ్రస్‌లోనూ గోల్‌మాల్ జరిగినట్లు పీఎన్‌బీ అధికారులు గుర్తించారు. రుణం తీసుకున్నప్పుడు ఇచ్చిన అడ్రస్, ప్రస్తుతం ఉన్న అడ్రస్‌కు పొంతన లేదని సీబీఐ విచారణలో వెల్లడైంది. కంపెనీల చిరునామా మారినప్పటికీ ఈ విషయాన్ని పీఎన్‌బీకి సమాచారం ఇవ్వలేదు. బ్యాంకు వద్ద ఉన్న అడ్రస్ ప్రకారం సీబీఐ అధికారులు వెళ్లితే అక్కడ వేరే కార్యాలయం ప్రత్యక్షమైంది. ముంబైలోని ఒపెరా హౌజ్‌లో ఉన్న సోలార్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ స్టెల్లర్ డైమండ్స్ కార్యాలయం లోయర్ ప్యారెల్‌కు గతంలోనే మార్చారట. అలాగే డైమండ్ ఆర్ యూఎస్ ఆఫీస్ కూడా ప్రసాద్ చాంబర్స్ వద్ద ఉండగా, దీనిని కూడా వేరేచోటికి మార్చివేశారు.



పీఎన్‌బీ కుంభకోణం కేసులో

రూ.5,674 కోట్ల ఆస్తులు స్వాధీనం

న్యూఢిల్లీ : వ్యాపారవేత్త నీరవ్ మోడీ పాత్ర ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణం కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం దేశ వ్యాప్తంగా 21 ప్రాంతాల్లో దాడులు జరిపింది. ఇప్పటి వరకు రూ.5,674 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకుంది. వీటిలో రూ.25 కోట్ల విలువైన వజ్రాలు, విలువైన రత్నాలు, బంగారం ఉన్నాయి. అంకుముందు భోపాల్‌లోని గీతాంజలి గ్రూప్ నక్షత్ర జ్యూయలరీ షోరూమ్ నుంచి రూ.2.30 కోట్ల విలువైన వజ్రాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. గుజరాత్, ఢిల్లీ, ముంబైల్లో నీరవ్ మోడీకి సంబంధించిన అనేక ప్రాంతాలలో ఈడీ సోదాలు జరిపి రూ.5,649 కోట్ల విలువైన వజ్రాలు, బంగారం, ఆభరణాలు సీజ్ చేసింది. పీఎన్‌బీ నుంచి ఫిర్యాదు నేపథ్యంలో ఫిబ్రవరి 14న నీరవ్ మోడీ, ఆయన భార్య అమి, సోదరుడు నిషాల్, బంధువు మెహుల్ చోక్సిలపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన తర్వాత ఈ దాడులు జరిగాయి. ఈ నెల మొదట్లో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఇతర భారత రుణదాతల నుంచి విదేశీ రుణం కోసం పీఎన్‌బీ శాఖల్లో ఒక దాని నుంచి మోసపూరితంగా అండర్ టేకింగ్ లేఖలను నీరవ్ మోడీ పొందినట్లు పీఎన్‌బీ గుర్తించడంతో కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

ప్రతి నాలుగు గంటలకో అధికారి

ముంబై : బ్యాంకులలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. బ్యాంకులకు సంబంధించి ప్రతి నాలుగు గంటలకు ఒక అధికారి పట్టుబడి, శిక్షకు గురవుతున్నారట. 2015, జనవరి 1వ తేదీ నుంచి 2017, మార్చి 31 వరకు ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన 5,200 మంది అధికారులు అక్రమాలకు పాల్పడి పట్టుబడ్డారట, వీరికి శిక్షలు సైతం పడ్డాయని రిజర్వ్ బ్యాంక్ సేకరించిన సమాచారం తెలియజే స్తున్నది. ప్రస్తుతం అతి పెద్ద కుంభకోణానికి నిలయంగామారి వార్తలలోకి ఎక్కిన పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన 180 మంది అధికారులు కూడా ఇందులో ఉన్నారు. రూ.11,400 కోట్ల కుంభకోణంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులను అరెస్టుచేసి ప్రశ్నించినప్పుడు సీబీఐకి ఈ సమాచారం తెలిసింది. అక్రమాల్లో దేశంలోకెల్లా పెద్దదైన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాదే అగ్రస్థానమట. 1,538 మంది అధికారులు ఈ బ్యాంకు అక్రమార్కుల జాబి తాలో మొదటిస్థానంలో ఉండగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 449 మంది, 406 మందిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వితీయ, తృతీయ స్థానాలలో ఉన్నాయి. అక్రమాలకు పాల్పడి పట్టుబడిన ఈ ఉద్యోగులకు శిక్షలు, జరిమా నాలు పడ్డాయట. కొంత మందినైతే ఉద్యోగాల నుంచి తీసివేసినట్లు రిజర్వ్ బ్యాంకు సేకరించిన ఆ సమాచారంలో తెలిసింది. అయితే ఈ ఉద్యోగుల అక్రమాల వల్ల బ్యాంకులకు ఎంత మేరకు నష్టం జరిగింది మాత్రం రిజర్వ్ బ్యాంకు వెల్లడించలేదు. కానీ 2013, ఏప్రిల్ ఒకటి, 2017, డిసెంబరు 31వ తేదీ మధ్య కాలంలో బ్యాంకు అధికారుల అక్రమాలవల్ల బ్యాంకులకు ఎంతమేరకు నష్టం కలిగింది ఆ నివేదిక వెల్లడించలేదుగానీ, ప్రయివేట్‌తో సహా అన్ని వాణిజ్య బ్యాంకులను కలిపి రూ.66,066 నుంచి 75 వేల్ల కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన కొందరు అవినీతి ఉద్యోగుల నీరవ్‌మోడీకి చెందిన సంస్థలకు నకిలీ లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లెటర్స్ ఇచ్చారు. వీటిని చూపించి ఆయా సంస్థలు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందాయి. జనవరి 16వ తేదీన జారీ చేసిన లెటర్‌వల్ల రూ.280 కోట్లు నష్టం జరిగిందని ఆ బ్యాంకు సీబీఐకి ఫిర్యాదు చేసింది.

900 మంది ఉపాధి ఉఫ్

మహేశ్వరం యూనిట్‌పై నీరవ్ మోడీ ఎఫెక్ట్



హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంకును భారీగా ముంచేసిన నీరవ్ మోడీకి సంబంధం ఉన్నట్టుగా భావిస్తున్న వజ్రాల కంపెనీలపై దాడులు జరుపుతున్న విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల పరిధిలో ఉన్న హార్డ్‌వేర్ పార్క్‌లో నీరవ్ మోడీ మామ మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ అండ్ జువెల్లరీ కంపెనీలను ఈ కుంభకోణం ప్రభావితం చేస్తున్నది. ఇది మూతబడితే ఇక్కడ పనిచేస్తున్న దాదాపు 900 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. వీరిలో 110 మంది వికలాంగ కార్మికులే ఉండడం మరింత బాధాకరం. మెహుల్ చోక్సీ.. హైదరాబాద్ జెమ్స్ లిమిటెడ్ పేరిట మొత్తం ఐదు కంపెనీలను ఈ సెజ్‌లో నిర్వహిస్తున్నాడు. విదేశాల నుంచి రత్నాలు, వజ్రాలను దిగుమతి చేసుకుని ఈ సెజ్‌లో ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఇక్కడ నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన కార్మికులు పని చేస్తుండగా, వీరిలో కొందరు సమీపంలోని తుక్కుగూడలో ఇండ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మరికొందరు సెజ్‌లోనే కంపెనీకి చెందిన వసతి గృహాల్లో ఉండి పని చేస్తున్నారు. నెలకు రూ.7 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నట్టు సమాచారం. అయితే పీఎన్‌బీ రూ.11,400 కోట్ల కుంభకోణంలో నీరవ్ మోదీ వ్యాపార సంస్థలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడుల్లో భాగంగా ఈడీ అధికారులు మహేశ్వరం యూనిట్‌లోనూ తనిఖీలు నిర్వహించారు. దీంతో ఈ కంపెనీలను మూసివేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా ఇందులో పనిచేస్తున్న 900 మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకమైంది. వారంతా కలిసి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే ఎవరిపై వారు ఆందోళన చేయాలో తెలియని అయోమయంలోకార్మికులు ఉన్నారు.

బాధితులకు చేరువ కాని గ్రీవెన్స్

- ప్రకటనలకే పరిమితం
- అధికార, అనధికార కార్యకలాపాలకు నెలవు
- ఆడియాశలవుతున్న ఆశలు



విశాలాంధ్ర- అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబుకి తమ బాధలు చెప్పుకుందామని వచ్చిన వారికి నిరాశ ఎదు రవుతుంది. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన బాధితుల ఆశలు అడియాసలుగా మిగులుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇటీవల ఉండ వల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం పక్కన గ్రీవెన్స్ భవనం నిర్మాణం చేసి గృహ ప్రవేశం కూడా చేశారు. ఇంకే ముంది తమ కష్టాలు చెప్పుకునేందుకు సచివాలయం చుట్టూ తిరగనవసరం లేదని రాష్ట్ర ప్రజలు ఆనందపడ్డారు. ముఖ్యమంత్రిని ఇంటి దగ్గరే కలిసి తమ ఇబ్బందులు చెప్పు కోవచ్చని ఆశపడ్డారు. క్రమంగా సీఎం నివాసానికి బాధి తుల తాకిడి పెరిగింది. అన్నదాతల నుంచి అనారోగ్యంతో బాధపడే వారి వరకు అదుకోమంటూ సీఎం నివాసానికి తరలిరావటం మొదలైంది. కాగా వచ్చిన వారిని సర్ది చెప్పి తిప్పి పంపించడం భద్రతా సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఒక్కొక్కరు ఒక్కొక్క సమస్యతో వస్తు ఉండటంతో ఎవరిని ఏ విధంగా నొప్పించకుండా పంపించడం అనేది అతి పెద్ద ఇబ్బందిగా మారింది. ఇదంతా ఒక ఎత్తైతే బాధలు చెప్పుకునేందుకు వస్తూనే పురుగు మందుల డబ్బా, కిరోసిన్ డబ్బాలు ,ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు రావటం వారిని నిరోధించటం కష్టతరంగా మారింది. ఇటీవల ఇబ్రహీంపట్నం నుంచి పలువురు బాధితులు నివాసాల విషయంలో అన్యాయం చేశారంటూ మూకుమ్మడి ఆత్మహత్యలకు ప్రయత్నించారు. దీంతో ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనాత్మకంగా మారింది. అయితే భారీగా తరలివస్తున్న బాధితులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి ఇంటి దగ్గరే గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ప్రతి సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

ప్రకటనకే పరిమితం...

బాధితుల కోసం గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తున్నామని చేసిన ప్రకటన అక్కడికే పరిమితమయ్యింది. గ్రీవెన్స్ హాల్ దాటి ముందుకు రాలేదు. అయితే సీఎం ఇంట గ్రీవెన్స్ భవనం ఏర్పాటు చేశారనే వార్త దావనంలా వ్యాపించడంతో విజయనగరం , శ్రీకాకుళంల నుంచి సైతం బాధితులు తమ ఇబ్బందులు తెలియ చేసుకునేందుకు ఉండవల్లిలో ముఖ్యమంత్రి ఇంటికి భారీగా రావటం మొదలుపెట్టారు. వచ్చిన ప్రతి ఒక్కరికి వెలగపూడి సచివాలయంకి వెళ్లండని చెప్పి వారిని ఏదో ఒక వాహనం ఎక్కించి సచివాలయం వైపు సాగనంపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సెలవు రోజుల్లో వచ్చిన బాధితులకు నచ్చజెప్పి పంపించడం భద్రతా సిబ్బందికి తలనొప్పిగా మారింది.గ్రీవెన్స్ ఉందని వచ్చాం మేము ముఖ్యమంత్రిని కలవాల్సిందేనని పట్టుబట్టి కదలని వారు ఎక్కువగా ఉంటున్నారు.బాధితుల కోసం గ్రీవెన్స్ ఏర్పాటు చేసారు కదా అని ప్రశ్నించే వారు అధికంగా ఉంటున్నారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎటు వెళ్ళాలో పాలుపోక నానా అవస్థలు పడుతున్నారు.

సమావేశాలకే పరిమితం...

గ్రీవెన్స్ పేరిట ఏర్పాటు చేసిన భవనం పూర్తిగా అధికారిక అనధికారిక కార్యక్రమాలకు వేదికగా మారింది. ప్రభుత్వ కార్యకలాపాలతో పాటుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కేరాఫ్ గా గ్రీవెన్స్ బిల్డింగ్‌ను ఉపయోగించుకుంటున్నారు. కలెక్టర్ల సదస్సు మొదలుకొని కుప్పంలో చంద్రబాబు పై పోటీ చేసిన వ్యక్తిని పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమం వరకు అన్ని ఈ గ్రీవెన్స్ భవనంలోనే జరుగుతున్నాయి. చివరకు ముఖ్యమంత్రి ముఖ్య సమావేశాలు సైతం ఇక్కడనుంచే నిర్వహించటం చేస్తున్నారు. ఇంట్లో ఏ విధమైన సమావేశాలు నిర్వహించకుండా దాదాపు అన్ని గ్రీవెన్స్‌కి పరిమితం చేశారు.అయితే బాధితుల సమస్యలు వినేందుకు ఏర్పాటు చేసిన భవనంలో సమావేశాలు నిర్వహించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా బాధితుల కోసం కొంత సమయం కేటాయించి గ్రీవెన్స్ భవనంలో బాధితుల గోడు వినాలని పలువురు బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. మరి సీఎం చంద్రబాబు ఏ విధంగా స్పందిస్తారో అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

శిరోజాల పెరుగుదలకు

'సూపర్ మిలియన్ హెయిర్'



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ : జుట్టు రాలడం వంటి సమస్యలకు పరి ష్కారం చూపేందుకు జపాన్‌కు చెందిన కంపెనీ రువాన్ అనే సంస్థ ఓ మార్గం కనుగొంది. 30 సెకన్లలో మిమ్మల్ని యువకులుగా తీర్చిదిద్దడానికి రువాన్ సంస్థ తయారు చేసిన 'సూపర్ మిలియన్ హెయిర్'ను అందు బాటులోకి తీసుకువచ్చింది. ఇది పీచు మాదిరిగా శిరస్సుకు అతుక్కు పోతుంది. గంటల తరబడి వర్షం కురుస్తున్నా, ఈదురుగాలి వీస్తున్నా, చమట పట్టినా గట్టిగా అతుక్కుపోయి ఉంటుంది. 30 సంవత్సరాలుగా 'రువాన్' సంస్థ తమ వినియోగదారులకు నిరంతరం సేవలు అందిస్తున్నట్లు కంపెనీ వారు తెలిపారు. అద్భుతమైన కాస్మోటిక్ పరిష్కార మార్గం కానుందని, సూపర్ మిలియన్ హెయిర్‌తో మీ తలను బట్టతల కాకుండా నివారించవచ్చన్నారు. దీన్ని సాధారణంగా సురక్షితంగా తేలిగ్గా వాడొచ్చు. యాంటీ బ్యాక్టీరియా శక్తి కలిగి ఉంటూ శిరోజాల పెరుగుదలకు సుపీరియర్ టెక్నాలజీ ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. స్త్రీ, పురుషుల్లో అన్ని వయస్సుల వారికి 'సూపర్ మిలియన్ హెయిర్' ఉపయుక్తంగా, ఎటువంటి దుష్ప్రభావం లేకుండా చేస్తుంది.

భారత్‌లో కాలుమోపిన డైసన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ సంస్థ డైసన్ భారత్‌లో తన వస్తు ఉత్పత్తులతో కాలుమోపింది. రాబోయే ఐదేళ్లలో భారత్‌లో వ్యాపార విస్తరణకు నడుం బిగించింది. దీనిలో భాగంగా డీఎల్ఎఫ్ ప్రొమెనాడ్ మాల్‌లో తమ డెమోస్టోర్‌ను ప్రారంభించింది. రాబోయే ఐదేళ్లలో భారత్‌లో రూ.1200 కోట్లను పెట్టుబడిగా పెట్టి వ్యాపార విస్తరణ చేయనుంది. డైసన్ సంస్థను బ్రిటిష్ పారిశ్రామికవేత్త జేమ్స్ డైసన్ ఓం ప్రారంభించారు. సంస్థ భారత్‌లో ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నాలజీని ప్రవేశపెట్టడంతో పాటు కోర్డ్ ఫ్రీ వాక్యూమ్ క్లీనర్స్, రివల్యూషనరీ హెయిర్ డ్రయర్, ఎయిర్ ప్యూరిఫయర్ మొదలైన వాటిని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. అత్యంత ఆధునిక సాంకేతికతను ప్రవేశ పెడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని డైసన్ బోర్డు చీఫ్ ఇంజినీర్, బోర్డు మెంబర్ జాక్ డైసన్ తెలిపారు.

పాత్రినెక్స్ 'ప్రోటీన్ కాలిక్యులేటర్'

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రతిరోజూ ప్రోటీన్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రముఖ పాత్రినెక్స్ తాజాగా ప్రోటీన్ కాలిక్యులేటర్‌ను ఆవిష్కరించింది. అండర్ 19 వరల్డ్ కప్ విన్నింగ్ ఇండియన్ క్రికెట్ కెప్టెన్ పృథ్వీషా ఈ కాలిక్యులేటర్‌ను ఆవిష్కరించారు. కాలిక్యులేటర్ ఆధారంగా ప్రతిరోజూ తీసుకునే ప్రోటీన్ శాతాన్ని తెలుసుకోవచ్చు. ప్రతిరోజూ డైట్‌లో ప్రోటీన్ ఎంత మోతాదులో తీసుకోవాలో దీని ద్వారా గ్రహించవచ్చు. ఈ సందర్భంగా ప్రముఖ న్యూట్రీషియన్ రుబీ సౌండ్ మాట్లాడుతూ చాలామందికి ప్రొటీన్స్ తీసుకోవడంపై సరైన అవగాహన లేదన్నారు. ఈ ప్రోటీన్ కాలిక్యులేటర్ ద్వారా మరింత అవగాహన పెంచుకోవచ్చన్నారు. పృథ్వీ షా ఈ కాలిక్యులేటర్‌ను ముంబైలో ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు.

అలరించే '2బిమి' చేనేత వస్త్రాలు



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్ '2బిమి' పేరిట చేనేత వస్త్రాలకు ఆధునికతను జోడించి అందమైన ఫ్యాషన్ రేంజ్‌గా మలిచి ప్రవేశపెట్టింది. గతేడాది ఫిబ్రవరిలో సృష్టించిన ఈ డిజైన్లకు ఫ్యాషన్ రంగం నుంచి, వినియోగదారుల నుంచి సానుకూలమైన స్పందన రావడంతో ఈ సంవత్సరం అదే దారిలో నడుస్తుంది. సరసమైన ధరలకే, ట్రెండీగా ఉండే నాణ్యమైన, డిజైనర్ ఉత్పత్తులు లభించడం పట్ల వారు గౌరవ పూర్వకంగా స్పందించారు. టుబిమి స్పెన్సర్స్ రిటైల్ అవుట్‌లెట్‌లకే పరిమితమైన అందమైన వస్త్రశేణి. హైదరాబాద్ నగరంలోని ముషీరాబాద్, అత్తాపూర్, మల్కాజ్‌గిరి, ఎల్‌బీ నగర్, బోయిన్‌పల్లి స్టోర్‌లతోపాటు కడప, కాకినాడ, కర్నూలు, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్టణాలలోనూ అందు బాటులో ఉంటుంది. ట్రెండీ బ్రాండ్‌లను అనుసరించి తమ ప్రత్యేకతను చాటుకోవాలనుకునే యువత మదిలో ఉత్సాహవంతమైన స్థానాన్ని సంపాదించుకుంది 2బిమి. అనువైన ఫ్యాషన్స్ అందించడమే లక్ష్యంగా పెట్టు కున్న 2బిమిలో మహి ళలకు, పురుషులకు, అబ్బాయిలకు, అమ్మాయిలకు, నవజాత శిశువులకు వారి వారి కొనుగోలు శక్తికి అనుగుణమైన ధరలతో అందుబాటులోకి తీసుకొచ్చారు. 2బిమిలో 22వేల స్టైల్స్‌తో కూడిన భిన్నమైన దుస్తులు లభిస్తాయి. ఎథ్నిక్ వేర్, క్యాజువల్ వేర్, ఫార్మల్ వేర్, యాక్టివ్ వేర్, స్లీప్ వేర్, ఇన్నర్ వేర్‌లతోపాటు ఫ్యాషన్ యాక్సెసరీస్ అయిన షూస్, బెల్ట్స్, బ్యాగ్స్, వాలెట్స్ కూడా లభిస్తాయి. వీటి ధరలు రూ.199/- నుంచి రూ.1499/- వరకు నిర్ణయించారు. వీటిలో 90శాతం దుస్తులు రూ.999/-లోపే లభిస్తుండటం విశేషం. భారత్‌లో ఫాస్ట్ మూవింగ్ ఫ్యాషన్ గూడ్స్ (ఎఫ్ఎంఎఫ్‌జి) విధానానికి 2బి మి కచ్చితంగా మార్గదర్శకం కాబోతుంది. తొలిసారిగా తమ అలమారాల్లో ప్రతి నాలుగు వారాలకు ఒకసారి కొత్త శ్రేణి వస్త్రాలతో స్టోర్‌ను సంప్రదించిన ప్రతిసారీ నిండిపో తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చేనేత వస్త్రాలు ఎఫ్ఎంఎఫ్‌జి కాన్సెప్ట్‌లో సానుకూల స్పందనను పొందడం, దానికి 2బిమి ఒక బెంచ్ మార్క్ అయిందని వినియో గదారులు వెల్లడించారు. స్పెన్సర్స్ రిటైల్స్ చేనేత వస్త్రాల విభాగపు ఉపాధ్యక్షుడు బి.జగదీశ్ మాట్లాడుతూ '2బిమి ఒక బ్రాండ్‌గా అద్భుతమైన స్టైల్‌కు దర్పణంగా నిలుస్తుంద న్నారు. కొత్తగా రూపుదిద్దుకున్న వస్త్రశేణి స్పెన్సర్స్ రిటైల్ స్టోర్‌లోనూ, 2బిమి బ్రాండ్ స్టోర్‌లోనూ దేశ వ్యాప్తంగా 20 నగరాలలో ఉన్న 42 స్టోర్‌లలో లభిస్తాయి.

నేడు ఎస్సీ కమీషన్ చైర్మన్ రాక

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : జాతీయ ఎస్సీ హక్కుల కమీషన్ చైర్మన్ ప్రో.డా.రాంశంకర్‌కత్రియా తెలంగాణకు రానున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేది సోమ వారం ఆయన హైదరాబాద్‌కు వస్తారని 21వ తేది కూడా ఇక్కడే వుంటా రని వివరించారు. రెండు రోజుల పాటు ఆయనతో పాటు జాతీయ కమీషన్ సభ్యులు కూడా ఇక్కడే వుంటారని తెలిపారు. ఈ రెండురోజులలో ఆయన వివిధ సాంఘిక సంక్షేమ సంఘాలతో సమావేశం కానున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 4గంటలకు ఆయన నగరంలోని బంజారా హిల్స్‌లోని తాజ్‌డెక్కన్ హెటల్‌లో సంఘాల సభ్యులకు అందుబాటులో వుంటారని కావున వారు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షమాబిక్ష గడువు పొడగించాలని వినతి

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లన గల్ఫ్‌దేశాలలో అనేక మంది వలస వెళ్ళిన వారు ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ గల్ఫ్ విభాగం అభిప్రాయపడింది. చాలా మంది స్వంత రాష్ట్రాలకు తిరిగి రావాలని చూస్తున్న వారు రాలేని పరిస్థితుల్లో వున్నారని విభాగం పేర్కొంది. అదివారం నాడు ఎమ్మెల్సీ అధికారిని నారాయణను కలిసిన టీపీసీసీ గల్ఫ్ విభాగం చైర్మన్ డాక్టర్.బి.ఎం.వినోద్ కుమార్, టీపీసీసీ గల్ఫ్‌క స్పీనర్ నంగి దేవేందర్ రెడ్డి, సెక్రటరీ జె.ఎన్.వెంకట్‌లు అభిప్రాయ పడ్డారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో కువైట్ ప్రభుత్వం గత నెల 29న ప్రవేశపెట్టిన క్షమాబిక్ష పథకం ఈ నెల 22న ముగుస్తుందన్నారు. దీంతో గల్ఫ్‌లో వీసాలు లేకుండా పని చేస్తున్న 30 వేల మంది కార్మికులు వున్నట్లు గుర్తించామన్నారు. వీరు నిత్యం అనేక సమస్యలతో జీవనం పోరాటం సాగిస్తున్నారని పేర్కొన్నారు. క్షమాబిక్ష ద్వార 14వేల మంది కార్మికుల అవకాశం వుంటుందని, క్షమాబిక్ష గడువు ముగింపు దగ్గర పడేకొద్దీ కార్మికులలో ఆందోళన మొదలైందన్నారు. అదే విధంగా టిక్కెట్స్ రేటు కూడ చాలా ఎక్కువగా వుండటంతో ఇబ్బందీగా మారింది కువైట్ ప్రభుత్వంను క్షమాబిక్ష గడువును పెంచాలని ఎమ్మెల్సీ నారాయణను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

దగ్గు వస్తున్నా.. పెరుగు తినవచ్చు!

జలుబూ, దగ్గు సర్వసాధారణంగా వస్తుంటాయి. వీటి బారిన పడినప్పుడల్లా వైద్యుడి దగ్గరకు పరిగెత్తలేం కదా. అందుకే ఇంట్లో లభించే పదార్థాలతోనే ఎలా తగ్గించుకోవాలో చూద్దాం.

- జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు చాలామంది పెరుగు మానేస్తారు. కానీ దానిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందులోని మేలు చేసే బ్యాక్టీరియా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- గొంతులో ఇబ్బందిగా ఉన్నప్పుడు గోరువెచ్చటి నీటిలో చెంచా తేనె, కాస్తంత నిమ్మరసం కలిపి తాగాలి. వెంటనే ఉపశమనం లభిస్తుంది. తేనెను నేరుగా తీసుకున్న సాంత్వన లభిస్తుంది.
- పైనాపిల్ పండును తినడంవల్ల కూడా దగ్గు తగ్గుతుంది. ఈ పండులో ఉండే బ్రొమిలిన్ అనే ఎంజైము దగ్గు నుంచి ఉపశమనాన్ని కలిగించి గొంతు గరగరను తగ్గిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో పావు చెంచా ఉప్పు వేసి బాగా కలపి ఆ నీటితో పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా చేసిన వెంటనే ఎంతో మార్పు కనిపిస్తుంది. దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు ఎక్కువ నీటిని తాగాలి. అల్లం టీని తరచు తీసుకోవడం వల్ల కూడా గొంతుకు సాంత్వన లభిస్తుంది.
- పుదీనా ఆకుల మాదిరిగా ఉండే పిప్పర్‌మెంట్ ఆకులు కూడా దగ్గుని తగ్గిస్తాయి. వేడి నీటిలో కొన్ని చుక్కల పిప్పరమెంట్ నూనె వేసి ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల కూడా దగ్గు తగ్గుతుంది.



చెడు గాలి సమస్యకు కొన్ని రకాల ఆహారాలతో చెక్

తినే తిండి, తాగే నీరు మాత్రమే కాదు.. పీల్చే గాలీ పరిశుభ్రంగా ఉండాలి. తిండి తినకుండా కొద్దిరోజులు, నీళ్లు తాగకుండా కొన్ని గంటలు ఉండొచ్చేమోగానీ గాలి పీల్చకుండా నిమిషమైనా నిలబడలేం. ఇంతటి కీలకమైన గాలి స్వచ్ఛంగా లేకపోతే? నైట్రోజెన్ డయాక్సైడ్, నుసి పదార్థం వంటి కాలుష్య కారకాలు వూపిరితిత్తుల్లోకి చేరిపోతే? పలు శ్వాస సమస్యలు ముంచుకొస్తాయి. మన ఊపిరితిత్తులు, దానిలోని గాలి గొట్టాల పొర చాలా సున్నితంగా ఉంటుంది. దీన్ని యాంటీ ఆక్సిడెంట్లు నిరంతరం కాపాడుతుంటాయి. సాధారణంగా మనం కలుషితమైన గాలిని పీల్చుకుంటే వెంటనే ఈ యాంటీ ఆక్సిడెంట్లు రంగంలోకి దిగి కాలుష్య కారకాలతో పోరాడటం మొదలెడతాయి. ఇవి బలహీన పడగానే కాలుష్య కారకాలు విజృంభించి ఊపిరితిత్తులు, గాలిగొట్టాల లోపలి పొరపై దాడిచేస్తాయి. ఫలితంగా పొర ఉబ్బుతుంది. ఇది దీర్ఘకాల బ్రాంకైటిస్, ఎంఫెసీమా, ఆస్థమా, పిల్లికూతలు, దగ్గు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది వంటి సమస్యలకు దారి తీస్తుంది. గుండెజబ్బు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కూ దారితీయొచ్చు. ప్రస్తుతం మన నగరాల్లో, పట్టణాల్లో గాలి కాలుష్యం ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయికి ఎగబాకింది. ఇలాంటి సమయంలో మనం ఆహారపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. విశృంఖల కణాల (ఫ్రీ రాడికల్స్) పనిబట్టే సహజ యాంటీఆక్సిడెంట్లతో కూడిన పదార్థాలను తీసుకుంటే కొంత వరకైనా కాలుష్య కారకాల అనర్థాల నుంచి తప్పించుకోవచ్చు.

- **విటమిన్-సి :** మన శరీరాన్ని కాపాడే సమర్థవంతమైన యాంటీఆక్సిడెంటు. నీటిలో కరిగే రకానికి చెందిన ఇది శరీరమంతటా ఉంటుంది. విశృంఖల కణాలను ఎప్పటి కప్పుడు ఏరి పారేస్తుంటుంది. అందువల్ల ఊపిరితిత్తుల్లో దీని స్థాయిలు పడిపోకుండా ఉండటానికి మనం ఆహారం ద్వారా తగినంత విటమిన్-సి తీసుకోవటం చాలా కీలకం. నిమ్మజాతి పండ్లు, జామ, ఉసిరి, కొత్తిమీర, తోటకూర, మునక్కాడలు, క్యాబేజీ వంటివి తరచుగా తినటం మంచిది.
- **విటమిన్-ఇ :** ఇది కొవ్వులో కరిగే విటమిన్. కణజాలం దెబ్బతినకుండా చూడటంలో ఎంతగానో తోడ్పడుతుంది. పొద్దుతిరుగుడు నూనె, తవుడు నూనెలో విటమిన్-ఇ సమృద్ధిగా ఉంటుంది. అలాగే వేరుశనగ నూనె, ఆలివ్ నూనెలతోనూ ఇది లభిస్తుంది. బాదం పప్పు, సాల్మన్ చేపలు తిన్నా మేలే. కారం, లవంగాల వంటి మసాలా దినుసుల్లోనూ విటమిన్-ఇ ఉంటుంది. అయితే మసాలాలు కొద్దిగానే తీసుకుంటాం కాబట్టి వీటిని రోజూ వంటకాల్లో వాడుకోవటం ఉత్తమం.
- **బీటా కెరొటిన్ :** యాంటీఆక్సిడెంట్ల మూలంగా తలెత్తే వాపు ప్రక్రియను నియంత్రించటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ బీటా కెరొటిన్ మన శరీరంలోకి చేరిన తర్వాత విటమిన్ ఎ రూపంలోకి మారుతుంది. క్యారెట్లతో పాటు తోటకూర, కొత్తిమీర, మెంతికూర, పాలకూర వంటి ఆకుకూరల్లో ఇది పుష్కలంగా ఉంటుంది.
- **ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు :** గుండె, రక్తంలో కొవ్వుల స్థాయిలపై గాలి కాలుష్యం చూపే దుష్ప్రభావాల నుంచి ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు కాపాడతాయి. బాదం, అక్రోట్లు, అవిసెగింజల వంటి గింజపప్పులు (నట్స్), గింజల్లో ఇవి బాగా ఉంటాయి. మెంతులు, ఆవాలు, ఆకుకూరలు, రాజ్మా, శనగలు, సజ్జల వంటి వాటితోనూ ఈ కొవ్వులు లభిస్తాయి.

మధుమేహం ఉన్నవారికి మేలు చేసే ఆహారం

కొన్ని రకాల మాంసకృత్తులను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటు, రక్త ప్రసరణలో ఇబ్బందులను పరిష్కరించుకోవచ్చు. చేపలు, మాంసం, పప్పుదినుసులు, కేబేజీ పువ్వు, బచ్చలికూర, పాల ఉత్పత్తుల్లో లభించే మాంసకృత్తులు, రక్తపోటు, రక్త ప్రసరణ సమస్యలను మాత్రమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులను సైతం నయం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అమైనో ఆమ్లం అధికంగా ఉండే ఆహార పదార్థాలు హృదయానికి రక్షణ కవచంగా వుంటాయి.

మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిసారి భోజనాన్ని తప్పనిసరిగా సలాడ్‌తో ప్రారంభించాలి. భోజనంలో ఎక్కువ కూరగాయలు, పండ్లు ఉండేలా జాగ్రత్త పడాలి. ఎక్కువ కేలరీలను అందించే ధాన్యాలు, నూనెలు, గింజలు తక్కువ మోతాదులో తీసుకోవాలి. వీలైనంత నెమ్మదిగా జీర్ణమయ్యే పదార్థాలనే ఎక్కువగా తీసుకోవాలి. ఫలితంగా రక్తంలో విడుదలయ్యే గ్లూకోజ్ తక్కువ మొత్తంలో ఉంటుంది.

ప్రతిరోజు మెంతులు తీసుకోవడం మధుమేహం ఉన్న వారికి ఎంతో మంచిది. మెంతులు ఆహారం నుంచి గ్లూకోజ్ విడుదలయ్యే ప్రక్రియ వేగాన్ని తగ్గిస్తాయి. కాబట్టి ప్రతిరోజు మెంతులు తీసుకోవడం వల్ల మధుమేహం అదుపులో ఉంటుంది. ప్రతిసారీ ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా ఒకచెంచా మెంతులపొడి నీటితో కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



తోటకూరతో మేలు

మధుమేహానికి తోటకూర ఎంతో మేలు చేస్తుంది. రోజూ తోటకూరను ఆహారంలో భాగం చేసుకున్నా ఫలితం కనిపిస్తుంది. తోటకూర ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. తోటకూర రక్తంలోని చక్కెర నిల్వలను కణాలు చక్కగా అందిపుచ్చుకునేలా చేస్తుంది. గ్లూకోజ్ ఉత్పత్తిని మెరుగుపరిచి కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో దాల్చిన చెక్క చక్కగా పనిచేస్తుంది. దాల్చిన చెక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని తాగితే మధుమేహంతో బాధపడేవారికి ఉపశమనం లభిస్తుంది.

మధుమేహంతో బాధపడేవారు ఫ్యాట్ తక్కువగా ఉండే పాలను రోజూ రెండు కప్పుల వరకు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే ప్రొటీన్లు రక్తంలో షుగర్ నిల్వల నియంత్రణకు తోడ్పడతాయి. పెరుగు, మజ్జిగ తీసుకోవడం కూడా మంచిదే.

ఓట్స్‌లో నీటిలో కరిగిపోయే ఫైబర్ ఉంటుంది. నీటితో కలిపితే పేస్ట్‌గా మారడం జరుగుతుంది. ఈ ఫైబర్ జీర్ణ ఎంజైమ్‌లు, ఆహారంలోని పిండి పదార్థాల మధ్య ఓ లేయర్‌గా పనిచేస్తుంది. దీంతో ఆహారంలోని కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెరగా మారడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. బ్లడ్ షుగర్ ఒక్కసారిగా పెరిగిపోదు. బ్రేక్ ఫాస్ట్, సూప్‌లలో భాగంగా దీన్ని తీసుకోవడం ఫలితాన్నిస్తుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

నెయ్యితో కొలెస్ట్రాల్ తగ్గుదల!

నెయ్యిని పెద్దలైతే ఒక స్పూన్ పిల్లలైతే రెండు స్పూన్ల మేర ఉపయోగించవచ్చునని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. నెయ్యి అధిక శక్తిని ఇస్తుంది కాబట్టి.. తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలి. నెయ్యిలో వుండే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటివి చర్మానికి.. ఎముకలు, కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి జీవక్రియను మెరుగుపరుస్తాయి. శరీర వేడిని నియంత్రించే శక్తి నెయ్యికి వుంది. కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. శరీరంలో వుండే కొవ్వును సమంగా ఉంచుతుంది. నెయ్యిలో వుండే ధాతువులు, కొవ్వు ఆమ్లాలు పెద్ద పేగుకి మేలు చేస్తాయి. జీర్ణకోశానికి నెయ్యి మేలు చేస్తుంది.

నెయ్యి స్మోక్ పాయింట్‌ను కలిగి ఉంటుంది. దీనిని వేడిచేసినా రసాయనాలను విడుదల చేయదు. కానీ ఇతర నూనెలను అతిగా వేడి చేస్తే కొన్ని రసాయనాలు విడుదలయ్యే ఛాన్సుంది. అందుకే నెయ్యితో ఇబ్బంది వుండదంటున్నారు.. ఆరోగ్య నిపుణులు.

నెయ్యిలో విటమిన్ కె2, యాంటీయాక్సిడెంట్లు, యాంటీ-వైరల్ ధాతువులున్నాయి. నెయ్యి క్యాన్సర్ కణాలపై పోరాడుతుంది. కోపాన్ని అదుపులో వుంచి బీపీని నియంత్రిస్తుంది. నెయ్యిని వేపుళ్లలో వుపయోగించుకోవచ్చునని.. తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ శాతం ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.



రోజూ ముడి ధాన్యాలు

రోజుకు నాలుగు సార్లు (సుమారు 70 గ్రాములు) పొట్టుతీయని ధాన్యాలను తినేవారికి ఎలాంటి కారణంతోనైనా మరణించే ముప్పు 22% తగ్గుతోందని హార్వర్డ్ పరిశోధకులు చెబుతున్నారు. అదే గుండెజబ్బుతో తలెత్తే మరణం ముప్పయితే 23%, క్యాన్సర్ సంబంధ మరణం ముప్పు 22% తగ్గుతుండటం గమనార్హం. కాబట్టి బాగా పాలిష్ పట్టిన ధాన్యాల కన్నా ముడి ధాన్యాలు ఎక్కువగా తినటం మంచిది.



ఈ ఏడాది బాలయ్య నుంచి ఒక్కటే ...

భుజానికి ఇటీవల ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న నందమూరి బాలకృష్ణ త్వరలోనే 'ఎన్టీఆర్' సినిమాను ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నాడు. ప్రస్తుతం ఏడాదికి రెండు సినిమాలు విడుదల చేస్తూ అభిమానులను అలరిస్తున్న నందమూరి నటసింహం ఈ ఏడాది మాత్రం ఒకే సినిమాతో సరిపెట్టుకోబోతున్నాడట. ప్రస్తుతం తను నటించనున్న ఎన్టీఆర్ బయోపిక్ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న బాలయ్య ఈ సినిమాను అభిమానులకు ఎప్పటికీ గుర్తుండిపోయే గొప్ప సినిమాగా తీర్చిదిద్దాలని చూస్తున్నాడట. ఈ సినిమాలో తన తండ్రి తారకరామారావుగా కనిపించనున్న బాలయ్య దాదాపు 60 గెటప్స్‌లో కనిపిస్తూ అలరించనున్నాడు. ఇప్పటికే ఈ గెటప్స్‌కి సంబంధించి లుక్స్ కూడా ఫైనల్ అయిపోయాయని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఉగాది సందర్భంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలచేసే ఆలోచనలో ఉన్నాడట బాలయ్య.



విశాలాంధ్ర సినిమా



'మహానటి' విడుదల వాయిదా!

నాగ అశ్విన్ దర్శకత్వంలో కీర్తి సురేష్ సావిత్రి పాత్రలో నటిస్తున్న సినిమా 'మహానటి'. స్వప్న సినిమాస్ బ్యానర్ పై సావిత్రి బయోపిక్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న సంగతి తెలిందే. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయను న్నట్లు ఇటీవలే నిర్మాతలు ప్రకటించారు అయితే ఇప్పుడు ఈ సినిమా ఆ తేదీకి విడుదల కాదని మరో తేదీకి వాయిదాపడే అవకాశం ఉందనే వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి.

ఈ సినిమాలో కొన్ని ఎపిసోడ్స్‌కి సంబంధించి గ్రాఫిక్స్ వర్క్ అవసరమని, ఆ గ్రాఫిక్ వర్క్‌కి ఇంకాస్త సమయం పడుతుందని అందుకే విడుదల తేదీని వాయిదావేసే ఆలోచనలో చిత్ర నిర్మాతలు ఉన్నారని తెలుస్తోంది. మోహన్ బాబు, ప్రకాశ్‌రాజ్, సమంత, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, శాలిని పాండే ముఖ్య పాత్రల్లో ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు స్వప్నదత్ నిర్మాత. మిక్కి జే మేయర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.





రెండు సినిమాలు ఒకే సారి

ప్రస్తుతం ఫిదా.. తొలిప్రేమ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సూపర్ హిట్స్ అందుకున్న వరుణ్ తేజ్ ఓ ఇద్దరు దర్శకులతో సినిమాలు చేయబోతున్న సంగతి తెలిసిందే. ఘాజీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ సినిమా చేయబోతున్న వరుణ్ తేజ్ మరో వైపు అనిల్ రావిపూడి డైరెక్షన్ లో వెంకీతో కలిసి 'ఎఫ్2' సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఈ రెండు సినిమాలను ఒకే సమయంలో పూర్తి చేసి తదుపరి సినిమాపై దృష్టి పెట్టాలని భావిస్తున్నాడట. ఒక్కో సినిమాకు తన ఇమేజ్ పెంచుకుంటూ సూపర్ హిట్స్ అందుకుంటున్న వరుణ్ ఈ రెండు సినిమాలతో ఎలాంటి హిట్స్ సాధిస్తాడో చూడాలి.



తెలుగులో మలయాళ బ్లాక్ బస్టర్ ఆనందం

కాలేజీ నేపథ్యంలో కథలు అల్లుకుని యువత మనసులకు హత్తుకునేటట్టు తెరకెక్కించిన ప్రతిసారి విజయం తథ్యం. మలయాళ చిత్రం ఆనందం ఈ విషయాన్ని మరోసారి నిరూపించింది. రూ.4 కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.20 కోట్లు వసూలు చేసింది. ఆహ్లాదకరమైన కథతో, భారీ విజయంతో యువ హృదయాలను కొల్లగొట్టిన మలయాళ ఆనందం చిత్రం అదే పేరుతో ఇప్పుడు తెలుగులో విడుదల కానుంది. సుఖీభవ మూవీస్ పతాకంపై నిర్మాత ఎత్తరి గురురాజ్ దీనిని తెలుగులోకి అనువదిస్తున్నారు. గణేశ్ రాజ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. కేరళ టాప్ హీరో పేమమ్ ఫేమ్ నివిన్ పాల్ ఇందులో అతిథిపాత్ర పోషించారు. మిగిలిన వాళ్లందరూ కొత్తవారే కావడం గమనార్హం. వీర వెంకటేశ్వర రావు, వీఆర్‌బీ రాజు, రవి వర్మ చిలువూరి ఈ చిత్రానికి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు ఈ చిత్రానికి సమర్పకులు. ప్రేమమ్ ఫేమ్ కేరళ టాప్ హీరో నివిన్ పాల్ తప్ప, మిగిలిన వాళ్లందరూ కొత్తవారే నటించారు. తెరమీద వారిని చూస్తున్నంత సేపు చాలా నేచురల్‌గా ఉంటుంది. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా కనిపించదు. తప్పకుండా యువతకు కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఇందులో ఉన్న ఇండస్ట్రియల్ టూర్.. నాలుగు రోజుల్లో ఏం జరిగింది అనేది ఆసక్తికరం. మూడు లవ్ స్టోరీలు ప్రేక్షకులను ఆకట్టుకుం టాయి. మలయాళంలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్ సచిన్ వారియర్ వినసొంపైన సంగీతాన్ని సమకూ ర్చారు. మార్చి 16న సినిమాను విడుదల చేయబోతున్నారు.



'మెహబూబా' షూటింగ్ పూర్తి

పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న 'మెహబూబా' షూటింగ్ పూర్తి అయింది. డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కుమారుడు ఆకాశ్ పూరీ హీరోగా పరిచయం కాబోతున్న ఈ సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు ప్రసాద్ ల్యాబ్‌లో ప్రారంభం అయ్యాయి. 1971 నాటి భారత్, పాక్ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతోంది. సినిమా చిత్రీకరణ హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లో జరిగింది. సందీప్ చౌతా సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో నేహ శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మధ్య విడుదలైన ఈ సినిమా టీజర్‌కు మంచి స్పందన లభించింది. పూరి జగన్నాథ్ ఈ సినిమాతో తిరిగి ఫాంలోకి వస్తాడని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో మెహబూబా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మార్చిలో 'నీది నాది ఒకే కథ'

తెలుగు తెరపై కొత్త ప్రయోగం నీది నాది ఒకే కథ. శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు వేణు ఉడుగుల దర్శకత్వం వహించారు. షూటింగ్ పార్ట్ పూర్తి అయిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు మంచి స్పందన లభించింది. నారా రోహిత్ ఈ సినిమాలో అతిథి పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాను చూసిన దర్శకుడు దేవకట్టా సినిమా బాగుందని మెచ్చుకున్నారు. తాజా సమాచారం మేరకు ఈ సినిమా మార్చి రెండో వారంలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన శ్రీ విష్ణు మెంటల్ మదిలో మంచి విజయం సాధించడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ సినిమాకు నాగేశ్వర్ రెడ్డి బొంతల ఎడిటర్‌గా పని చేశారు.

రామ్‌చరణ్ అన్నగా ఆర్యన్ రాజేష్

రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా మొదటి షెడ్యూల్ పూర్తి అయింది. త్వరలో రెండో షెడ్యూల్ ప్రారంభం కానున్న ఈ సినిమాలో కైరా అద్వాని హీరోయిన్ గా నటిస్తోంది. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో స్నేహ, తమిళహీరో ప్రశాంత్ ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు. తాజా సమాచారం మేరకు ఈ సినిమాలో చరణ్ అన్న పాత్రలో ఆర్యన్ రాజేష్ నటించబోతున్నారు. అల్లరి నరేష్ అన్న ఆర్యన్ రాజేష్ గతంలో హీరోగా పలు చిత్రాల్లో నటించాడు. కొంత విరామం తరువాత రాజేష్ బోయపాటి సినిమాలో నటిస్తుండడం విశేషం. మాస్ ఎంటర్టైనర్ గా తెరకెక్కబోతున్న ఈ సినిమాలో జర్నీ సినిమా హీరోయిన్ అనన్య చరణ్ వదిన పాత్రలో కనిపించబోతోంది.



23న 'స్కెచ్' విడుదల

విక్రమ్, తమన్నా హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా 'స్కెచ్'. అదే పేరుతో తెలుగులో ఈ నెల 23న విడుదల కానుంది. విజయ్ చందర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తమిళంలో విడుదలై మంచి విజయం సాధించింది.

ఈ సినిమా ప్రొమోషన్‌లో భాగంగా ఇటీవల విక్రమ్ హైదరాబాద్ వచ్చినప్పుడు సినిమా విజయం పట్ల ధీమా వ్యక్తం చేశారు. సురేష్ బాబు సమర్పణలో రానున్న ఈ సినిమాను మొదట జనవరి 26న విడుదల చెయ్యాలని అనుకున్నారు. అనివార్య కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు హిట్ అయ్యాయి. మాస్ ఎలిమెంట్స్ తో పాటు సోషల్ కంటెంట్ ఈ సినిమాలో ఉండబోతోందని తెలుస్తోంది. తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాను ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి.

కోల్‌కతాలో భారీ చందమామ



కోల్‌కతా : చందమామ నేలపైకి దిగొచ్చింది. కోల్‌కతాలోని విక్టోరియా మెమొరియల్ దగ్గర కొలువుదీరింది. చందమామ భారీ 3 డీ ఆకారాన్ని చూడటానికి అక్కడి ప్రజలు క్యూ కడుతున్నారు. నాసా కెమెరా సాయంతో తీసిన చంద్రుడి చిత్రానికి ఇది నకలు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బ్రిటిస్ కౌన్సిల్ ఈ మ్యూజియం ఆఫ్ ద మూన్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. విక్టోరియా మహల్ నార్త్ గేట్ దగ్గర ఈ భారీ చంద్రుడిని ఏర్పాటుచేశారు. ఈ మ్యూజియం ఆఫ్ మూన్ ప్రాజెక్ట్ ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఉదయ్‌పూర్ నగరాలను తిరిగొచ్చింది. బ్రిటిష్ ఆర్టిస్ట్ ల్యూక్ జెరామ్ దీనిని రూపొందించారు. దీని ఎత్తు 23 అడుగులు కావడం విశేషం. అయితే అసలు చంద్రుడి కన్నా ఇది ఐదు లక్షల రెట్లు చిన్నగా ఉంది. యువతలో ఖగోళశాస్త్రంపై ఆసక్తి కలిగించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నారు.

తాజ్ అందాలకు కెనడా ప్రధాని ఫిదా..



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతి సుందర కట్టడమైన తాజ్‌మహల్ అందాలను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడూతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఫిదా అయ్యారు. ఆదివారం ఉదయం తాజ్‌మహల్‌ను సందర్శించిన కెనడా ప్రధాని కుటుంబం.. ఆ పరిసర ప్రాంతాలన్నీ కలియతిరుగుతూ ఆ అందాలను ఆస్వాదించారు. ట్రూడూ కుమారుడు ఎంజాయ్ చేశారు. బ్లూ కలర్, టోపీ ధరించిన ఆ మూడేళ్ల కుర్రాడు.. తాజ్ ముందు పరుగెడుతూ తండ్రి వద్దకు చేరుకోగానే.. ట్రూడూ తన కుమారుడిని చేతుల్లోకి తీసుకొని సంతోషంతో ఎగరేసి పట్టుకున్నారు. తాజ్ సందర్శనకు గుర్తుగా ట్రూడూ విజిటర్స్ బుక్‌లో ఓ సందేశం రాశారు. ప్రపంచంలోని అతి సుందరమైన కట్టడాలలో తాజ్‌మహల్ ముఖ్యమైనదని, అటువంటి అద్భుతమైన తాజ్‌మహల్‌ను సందర్శించడం ఆనందంగా ఉంది. అందరికీ ధన్యవాదాలు అంటూ తాజ్ అందాలకు ఫిదా అయిన ట్రూడూ తన సందేశంలో తెలిపారు.



ఎమ్మెల్యే కుమారుడి

దౌర్జన్యం

బెంగళూరు : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎన్ఏ హరీస్ కుమారుడు, యువజన కాంగ్రెస్ బెంగళూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హరీస్ నలపాడ్ మరో పది మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. నగరంలోని రెస్టారెంట్‌లో ఒక వ్యక్తిని కొట్టారన్న ఆరోపణలపై వీరిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. బాధితుడు విద్వత్‌ను నిందితులు బెదిరించారని, ఆయనపై దాడికి పాల్పడడంతో చికిత్స కోసం మల్లయ ఆస్పత్రిలో చేరారని పోలీసులు తెలిపారు. హరీస్ నలపాడ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి. పరమేశ్వర ప్రకటించారు. ఇదిలావుండగా, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బెంగళూరు పోలీసు కమిషనర్‌ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశించారు. "దోషులు శిక్షించబడాలి. ఇందుకోసం చట్టాలను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇందులో ఎటువంటి వివక్షత ఉండకూడదు. బెంగళూరు పోలీసు కమిషనర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. దోషులను అరెస్టు చేస్తారు" అని ముఖ్యమంత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు తప్పు చేస్తే తప్పక శిక్ష అనుభవించి తీరాలని హరీస్ తండ్రి ఎన్ఏ హరీస్ ఆదివారం అంగీకరించారు. "అతను ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో నాకు తెలియదు. ఎవరు చేసినా తప్పుతప్పే. ఇందుకు నా కుమారుడు ఏమీ అతీతుడు కాదు" అని పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు దినేష్ గుండూరావు హామీ ఇచ్చారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం...

మోడీ సర్కారుపై ముప్పేటదాడి

- బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రం : కాంగ్రెస్ డిమాండు
- నోట్ల రద్దుతోనే ఈ భారీ కుంభకోణం : మమత
- బ్యాంకుల లూటీయేనా సుపరిపాలనంటే..: మాయావతి

న్యూఢిల్లీ/కోల్‌కతా/లక్నో : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంపై ప్రతిపక్ష పార్టీలు మోడీ ప్రభుత్వంపై ముప్పేట దాకిగి దిగాయి. కుంభకోణంపై తీవ్రంగా స్పందించాయి. ఇదంతా నరేంద్రమోడీ ప్రభుత్వ పాపమేనని నిందించాయి. ఎన్‌డీఏ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగానే ఇంతటి భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నాయి. రూ.11 వేలకు పైగా అక్రమాలకు పాల్పడిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీతో ప్రధాని మోడీ ఫొటోలు దిగడంపైనా విమర్శలు చేశాయి. మాల్యా తరహాలోనే ఎన్‌డీఏ సర్కారు నీరవ్‌ను దేశం దాటించిందని నిప్పులు చెరిగాయి. పెద్దనోట్ల రద్దును ప్రభుత్వ అనుకూల శక్తులు, కార్పొరేట్ పెద్దలు, మద్దతుదారులు బాగా ఉపయోగించుకున్నారని ఆరోపించాయి. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండు చేసింది. ఎన్‌డీఏ ప్రభుత్వ పెద్దలకు అక్రమార్కులతో బలమైన సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ వెల్లడించింది. బ్యాంకింగ్ రంగంలో అక్రమాలన్నింటినీ వెల్లడించేందుకుగాను బ్యాంకింగ్ వ్యవస్థపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండు చేసింది. మోడీ హయాంలో మొత్తం రూ.61 వేల కోట్లు బ్యాంకుల ద్వారా లూటీ అయిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారి చెప్పారు. ప్రభుత్వ సహకారం లేకుండానే నీరవ్ మోడీకి పీఎన్‌బీ లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్స్(ఎల్ఓయూ) ఇచ్చిందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అండతోనే నీరవ్, ఆయన మామ మెహుల్ చోక్సీ రూ.11,400 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. గడచిన ఐదేళ్లలో రూ.61 వేల కోట్ల అక్రమా లు జరిగాయని స్వయానా ఆర్‌బీఐ డేటా వెల్లడించిందని ఆయన అన్నారు. ఈ ఐదేళ్లలో నాలుగేళ్లు బీజేపీనే అధికారంలో ఉందని గుర్తుచేశారు. అక్రమార్కులు, బీజేపీ పెద్దలకు మధ్య గల బంధం భారత ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిపై అనేక అనుమానాలను రేకెత్తిస్తోందని తివారీ వ్యాఖ్యానించారు. అందువల్ల మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థపై సత్వరమే శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ డిమాండు చేస్తోందన్నారు. బ్యాంకుల ద్వారా కుంభకోణాలకు పాల్పడిన పెద్దల పేర్లు, నిరర్థక ఆస్తుల వివరాలను వెల్లడించాల్సిందిగా బ్యాంకులన్నింటినీ ఆదేశించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలి : మమత



పంజాబ్ నేషనల్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కుంభకోణం కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండు చేశారు. ఈ కుంభకోణంలో ఇతర బ్యాంకుల ప్రమేయం కూడా ఉంటుందని ఆమె ఆరోపించారు. రూ.11 వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతో సంబంధం ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ భారతీయ బ్యాంకులన్నింటిలో ఇదే తరహా మోసాలకు పాల్పడ్డారని, ఇదంతా నోట్ల రద్దు సమయంలోనే జరిగిందని మమత అన్నారు. నోట్లరద్దు సమయంలో పెద్దఎత్తున మనీలాండరింగ్ జరిగింది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇందులో చాలా బ్యాంకుల పాత్ర ఉంది. పూర్తి వివరాలు బహిర్గతం కావాల్సిన అవసరం ఉందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నల్లడబ్బు చెలామణిని అరికట్టాలన్న పేరుతో 2016 నవంబరు 8న ఎన్‌డీఏ ప్రభుత్వం రూ. 500, రూ.1000 నోట్లను రద్దు చేసింది. నోట్ల రద్దు సమయంలో కొన్ని బ్యాంకులకు సంబంధించిన కీలక అధికారులను మార్చారని మమత ఆరోపించారు. ఆ అధికారులను ఎవరు బదిలీ చేశారో...దీనిపైనా దర్యాప్తు చేయాలని మమత డిమాండు చేశారు. అధికారుల బదిలీలు, తొలగింపులకు కృషి చేసిన వారి బండారం బయట పెట్టాల్సిందేనని ఆమె గట్టిగా కోరారు. నీరవ్ మోడీ కుంభకోణంపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పరస్పర విమర్శలకు దిగాయి. పరస్పరం నిందారోపణలకు పాల్పడుతున్నాయి. యూపీఏ హయాంలోనే పీఎన్‌బీ కుంభకోణం చోటుచేసుకుందని బీజేపీ ఆరోపిస్తుండగా...నోట్లరద్దు తర్వాత ఆర్థిక అక్రమాలు పెద్దఎత్తున జరిగాయని కాంగ్రెస్ అంటోంది.

ఇదే నా సుపరిపాలన : మాయావతి




పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధాని నరేంద్రమోడీని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి నిందించారు. బీజేపీ హామీ ఇచ్చిన సుపరిపా లన ఇదేనా అని సూటిగా ప్రధానిని ప్రశ్నించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యాల కారణంగా బీజేపీ మద్దతుదారులు రూ.20 వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని మాయావతి ఆరోపించారు. ఈ మేరకు మాయావతి లక్నోలో ఓ ప్రకటనలో మోడీపై విమర్శలు గుప్పించారు. బీజేపీ అచ్చాదిన్ నినాదాన్ని దేశ ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని ఆమె తెలిపారు. నోట్ల రద్దును ప్రభుత్వ అనుకూల పారిశ్రామికవేత్తలు భారీగా ఉపయోగించుకున్నారని ఆమె పేర్కొన్నారు.

అత్యాచారం ఆరోపణలపై

హిందీన్యూస్ ఛానల్ ఎడిటర్ అరెస్టు

న్యూఢిల్లీ : మహిళా ఉద్యోగినిపై అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై హిందీ వార్తా ఛానెల్ ఎడిటర్ ఇన్‌ఛీఫ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి బాధితురాలు ఫిబ్రవరి 13వ తేదీన ఢిల్లీ తుగ్లక్ రోడ్డు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు ఉమేష్ కుమార్‌తో తనకు 2016 నుంచి పరిచయం ఉందని, అప్పుడు తాను ఇందిరాపురంలో నివసించేదానినని, జెట్టిక్స్ జిమ్‌లో పనిచేసేదానినని తన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు. గత ఏడాది జూన్‌లో ఉమేష్ కుమార్ తనను తన ఇంట్లో కలిశాడని, తాను అవివాహితుడినని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి అప్పటి నుంచి తనను వేధిస్తున్నాడని తెలిపారు. ఆగస్టులో ఒక హోటల్‌లో తనను కలిసి అక్కడ లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేశారు. ఉమేష్ కుమార్‌కు అప్పటికే పెళ్లి అయిందని ఆ తరువాత తెలిసిందని పేర్కొన్నారు. హోటల్‌లో నిందితుడు రూమ్ బుక్‌చేశాడని హోటల్ అధికారులు కూడా ధృవీకరించారు. ఐపీసీ 376, 506 సెక్షన్లు, సీఆర్‌పీసీ 164 సెక్షన్ క్రింద కేసు నమోదు చేశారు.

మోడీనోట మళ్లీ దేశభక్తి మాట



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ వద్ద బీజేపీ కేంద్ర కార్యాలయ నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, సుష్మాస్వరాజ్, పార్టీ సీనియర్ నాయకులు మురళీ మనోహర్ జోషి, ఎల్.కె.అద్వానీలు కూడా హాజరయ్యారు. మోడీ మాట్లాడుతూ దేశంలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం కష్టం కాదని, కానీ దేశంలోని అనేక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. తమ పార్టీ దేశభక్తికి కట్టుబడి ఉందని తెలిపారు. ఆలోచనలో, అమలులో బీజేపీ నిజమైన ప్రజాస్వామ్యాన్ని కలిగి ఉందన్నారు. స్వాతంత్ర్యం నాటి నుంచి దేశ ప్రయోజనాలకు సంబంధించి జరిగిన అన్ని పోరాటాల్లో జనసంఘ్, బీజేపీలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు. దేశం కోసం బీజేపీ ఎప్పుడూ పోరాటానికి, త్యాగానికి సిద్ధంగా ఉందని ప్రధాని మోడీ తెలిపారు. తన అజెండాను అమలు చేయడంలో ప్రజాస్వామ్యయుత మార్గ నిర్దేశనంతో ఉందన్నారు. టీడీపీతో సహా కొన్ని మిత్రపక్షాలు బీజేపీతో వైరుధ్యాలు గురించి మాట్లాడినపుడు, వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సమర్థవంతంగా పని చేసిందని గుర్తు చేశారు. వాజ్‌పేయి ప్రాంతీయ ఆకాంక్షలను సాకారం చేస్తూ మిత్రపక్షాలను కలుపు కోవడంలో విజయం సాధించారని, దేశంలో ఒక కొత్త ఆశ ఏర్పరిచారని మోడీ పేర్కొన్నారు. 'దీనికి మూలకారణమేమిటంటే, ప్రజాస్వామ్యం మనరక్తంలో ఉంది. వీలైనంత వరకు ప్రతిఒక్కరిని వెంట తీసుకుని ముందుకు సాగుతాం' అని అన్నారు.

10 లక్షలమంది రైతులకు జియోట్యాగ్

తిరువనంతపురం : రాష్ట్రంలోని పశుసంపద, కోళ్లపెంపకదార్లయిన 10 లక్షల మంది రైతులను జియోట్యాగ్ చేయడానికి కేరళ పశుసంవర్థక శాఖ సంకల్పించింది. దీనిలో భాగంగా 8 లక్షలమంది రైతులు, వారి ఇళ్లు గుర్తించి, ఇప్పటివరకు 60 వేల జియోటాగ్‌లు పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఆరేడు నెలల్లో పేపర్‌లెస్ పాలన చేపట్టాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

అరుణాచల్ సీఎంపై అత్యాచార ఆరోపణ

న్యాయం చేయాలని బాధితురాలు వేడుకోలు



న్యూఢిల్లీ : అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమ్ ఖండూ, మరో ఇద్దరు 2008వ సంవత్సరంలో తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆ రాష్ట్రానికి చెందిన మహిళ ఒకరు ఆరోపించారు. అత్యాచారం లేదా లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికలకు సరైన సమయంలో న్యాయం జరగాలి లేదంటే ఏ వ్యక్తినీ, సంస్థను విశ్వసించరన్నారు. జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీ డబ్ల్యూ)కు ఫిర్యాదు అందజేసిన రెండు రోజుల తర్వాత సాయంత్రం దేశ రాజధానిలో బాధితురాలు మీడియాతో మాట్లాడింది. 'అరుణా చల్ సీఎం ఖండూతోసహా ముగ్గురిపై నేను ఫిర్యాదు చేశాను. అయితే ఇప్పటి వరకు పోలీ సులు లేదా న్యాయస్థానం నుంచి సరైన స్పందన లేదు. వారిద్దరూ ఇది తప్పుడు కేసన్నారు. మేము(న్యాయవాది, నేను) జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించాం. ఇక్కడ కూడా న్యాయం జరగనట్లయితే, నాలాంటి బాధితులు ఎవరినీ నమ్మరు' అని ఆమె పేర్కొన్నారు. 'నా చివరి శ్వాస వరకు పోరాడుతా. సామాజిక మాధ్యమాల్లో చాలా మంది నేను డబ్బు లేదా పేరు కోసం ఇదంతా చేస్తున్నానని చెబుతున్నారు. కానీ డబ్బు కోసం నేను ఎవరి జీవితం తోసు ఆడను. ఎవరిపైనో తప్పుడు ఫిర్యాదు ఎందుకు చేస్తాను. ఎన్‌సీడబ్ల్యూ ఆలోచించి చర్య తీసుకోవాలి' అని తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ చట్టం 10 సెక్షన్ క్రింద తన న్యాయవాది రష్మీభాతి ద్వారా గురువారం అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన వెస్ట్ సింగ్ జిల్లాలో ఫిర్యాదు దాఖలు చేసినట్లు బాధితురాలు పేర్కొంది. 2008, జూలైలో తవాంగ్ సర్క్యూట్ హౌస్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నపుడు ఖండూ, తవాంగ్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పుర్పా లామా తుంపీన్ తషి, దోర్జి వాంగ్‌చులు తనపై సామూహిక అత్యా చారానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. కాగా ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు, చైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రేఖా శర్మ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఎన్‌సీ డబ్ల్యూ నుంచి ఒక ఫిర్యాదు అందిందన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఒక కోర్టు బాధితురాలి ఫిర్యాదును తోసిపుచ్చిందని, దీనిపై న్యాయ సలహా కోరతామన్నారు. ఇదిలాఉండగా ముఖ్యమంత్రి ఖండూ అత్యాచారం ఆరోపణలను తోసిపుచ్చారు. తన రాజకీయ ప్రత్యర్థులు కుట్రగా అభివర్ణించారు.

రాజకీయ పర్యటనకు ముందు

రజనీతో కమల్ భేటీ



చెన్నై: తమిళనాట రాజకీయ పార్టీ ఏర్పాటు లక్ష్యంతో రాష్ట్ర పర్యటన చేయనున్న విలక్షణ నటుడు కమల్ హాసన్.. ఆదివారం పోయెస్ గార్డెన్‌లో సూపర్ స్టార్ రజనీకాంత్‌తో సమా వేశమయ్యారు. ఈ భేటీ సాధారణమేనని, రాజకీయాల నేపథ్యంలో కాదని కమల్ అన్నారు. పర్యటన ప్రారంభించడానికి ముందు అందరినీ ఓసారి కలవాలనుకున్నానని, అందులో భాగంగానే రజనీని కలిశానని కమల్ అన్నారు. అనంతరం ఇద్దరూ రాజకీయాల్లో కలిసి పనిచేయడంపై మాట్లాడుతూ..దీనికి కాలమే సమాధానం చెబుతుందని అన్నారు. అనంతరం కమల్‌ని కలవడంపై రజనీకాంత్ కూడా స్పందించారు. 'డబ్బు కోసమో పేరు కోసమో కమల్ రాజకీయాల్లోకి రావడం లేదు. కేవలం తమిళనాడు ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చారు. సినిమాలో కమల్ స్టైల్ వేరు. నా స్టైల్ వేరు. రాజకీయాల్లోనూ అదే వర్తిస్తుంది. ప్రజలకు మంచి చేయాలన్నదే మా ఉద్దేశం.' అని తెలిపారు. ఈ నెల 21న కమల్ పార్టీకి సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నారు. మధురైలో తన రాజకీయ పార్టీ పేరు ప్రకటిస్తారు. బుధవారం సాయంత్రం రామనాథపురం వద్ద ఉన్న ప్రదేశంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి పార్టీ పేరు ప్రకటించనున్నారు. జెండా, ఎజెండా ప్రజలకు వివరిస్తారు.

యజమాని భార్యతో పారిపోయాడని..

కళ్లలో యాసిడ్ పోశారు

బెగుసారాయ్(బీహార్) : యజమాని భార్యతో ఓ వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అతనిపై యాసిడ్ దాడి చేశారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన బాధితుడు కొన్నాళ్లుగా ఓ రైతు ఇంట్లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో యజమాని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈనెల 6న వారిద్దరూ ఇంటినుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న రైతు తన భార్యను డ్రైవర్ కిడ్నాప్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 16న రైతు భార్య వచ్చి స్థానిక కోర్టులో హాజరై తనను తీసుకెళ్లాల్సిందిగా భర్తను కోరింది. తర్వాత ఆమె మరిది డ్రైవర్‌కు ఫోన్ చేసి 'ఆమె నీతోనే ఉండాలనుకుంటోంది. తెఘ్రా పోలీస్ స్టేషన్‌లోనే ఉంది. వచ్చి ఆమెను తీసుకు పోవాలని కోరాడు. అనంతరం డ్రైవర్ పోలీసు స్టేషన్‌కు వస్తుండగా మార్గం మధ్యలో 20మంది దుండగులు అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. అనంతరం అతడి కళ్లలో సిరంజితో యాసిడ్ పోసి అతన్ని తీసుకెళ్లి భగవాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ చౌక్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు. అటువైపుగా వెళ్తున్న కొందరు బాధితుడ్ని చూసి ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడికి చికిత్స చేసిన వైద్యులు యాసిడ్ దాడితో అతని కంటి చూపు పోయిందని తెలిపారు. ఈ దాడికి పాల్పడిన ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ బీకే సింగ్ తెలిపారు.

ఢిల్లీలో అతితక్కువ పవర్‌కట్‌లు

ఢిల్లీ : ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఈ ఏడాది ఢిల్లీలో అతితక్కువ పవర్‌కట్‌లు ఉన్నాయని ఢిల్లీ ప్రభుత్వం సమాచారాన్ని విడుదల చేసింది. విద్యుత్ పంపిణీలో ప్రగతి వల్లే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గాయన్నారు. 2017-18ల్లో కేవలం 0.06 శాతం మాత్రమే కరెంటు ఆటంకాలు ఎదురయ్యాయన్నారు. 2014-15లో 0.4 ఉండగా, 2015-16ల్లో 0.14 తగ్గాయన్నారు. ఢిల్లీలో 6526 మెగావాట్‌ల కరెంటు అవసరం ఉంది. బీఎస్‌ఈఎస్, టీపీడీఎల్‌లు ఢిల్లీకి కావాల్సిన విద్యుత్‌ల్లో మూడొంతులు సరఫరా చేస్తాయి.

న్యాయసలహా తీసుకుంటాం : పళనీస్వామి

సేలం: కావేరీ జలాలపై సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయనిపుణుల సలహాతీసుకుంటామని తమిళనాడు ముఖ్యమంత్రి పళనీస్వామి స్పష్టం చేశారు. కర్ణాటక - తమిళనాడు కావేరీ జలాల వాటా పరిమాణాన్ని తగ్గిస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నదులు దేశ సంపదని, ఏ రాష్ట్రం వాటిపై పెత్తనం చేయడాన్ని సహించబోమని ఎవరి రాష్ట్ర పరిధిలో అది ఎక్కువ ప్రవహిస్తుంటే ఉంటే వారికే అధికారం ఎక్కువ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 270 టీఎంసీ నీటిని కర్ణాటకకు, 14.75 టీఎంసీలు తమిళనాడుకు చెందుతాయని సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

లిటరసీ పరీక్షలో కేరళ ఖైదీలు

తిరువనంతపురం : రాష్ట్రంలోని 300 మంది ఖైదీలు వయోజన విద్య పరీక్షకు హాజరయ్యారు. వారిలో ఇద్దరు బీహారీలు కూడా ఉన్నారు. ఖైదీల కోసం పరీక్ష నిర్వహించడం ఇదే మొదటిసారి. 297 మంది ఈ పరీక్షలో పాల్గొన్నారు. వారికి చదవడం, రాయడంపై పరీక్ష నిర్వహించామని లిటరసీ మిషన్ వర్గాలు వెల్లడించాయి. జైలు జ్యోతి కార్యక్రమంలో ఖైదీలకు చదువు నేర్పుతున్నారు. దీనిలో అందరికంటే పెద్దవాడు 75 ఏళ్ల చంద్రన్ కూడా పాల్గొన్నారు. అబ్కారీ కేసులో ఆయన శిక్ష అనుభవిస్తున్నారు. జీవితకాల శిక్ష అనుభవిస్తున్నవారు పరీక్షల్లో పాల్గొన్నారు.

అక్టోబరు 31న పటేల్ విగ్రహావిష్కరణ

వడోదర : గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం 18 మీటర్ల కట్టడం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని అక్టోబరు 31న ఆవిష్కరించేందుకు సిద్ధం చేశారు. దీనిని భారత ప్రథమ కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అంకితమిస్తారు. విగ్రహాన్ని కెవేడియా నర్మదా నది సర్దార్ సరోవర్ డ్యామ్‌కు 3.32 కిమీ దూరంలోని సాథుబెట్‌లో ఈ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. రానున్న రోజుల్లో ప్రపంచపర్యాటకులను ఆకర్షించేదిగా ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివరించారు.

20 నుంచి ఖజురహో డాన్సు ఫెస్టివల్స్

భోపాల్ : ఖజురహోలో ఈనెల 20 నుంచి 26 వరకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఛతర్‌పూర్ జిల్లాలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మధ్య ప్రదేశ్ సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. కథక్, ఒడిస్సీ, భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, మోహినీఅట్టం వంటి క్లాసికల్ డ్యాన్సులు, ఇతర కళా రూపాలను ఏర్పాటు చేస్తామని కల్చరల్ డిపార్టుమెంటుకు చెందిన మనోజ్ శ్రీవాత్సవ వెల్లడించారు. 45 ఏళ్లగా నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఖజురహోను క్రీపూ 950 -1050 మధ్య చందేలా రాజులు నిర్మించారు.

బీజేపీపై మరోసారి శివసేన ఫైర్

ముంబై : మహారాష్ట్ర ప్రభుత్వంపై శివసేన మరోసారి మండిపడింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో జరుగుతున్న శంకుస్థాపన కార్యక్రమానికి రాయఘడ్ శివసేన ఎమ్మెల్యే, ఎంపీలను ఆహ్వానించకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. నూతన విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడటమేనన్నారు. ఇది ప్రజలను అవమానించడమేనని వారు స్పష్టం చేశారు. ఎన్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వంలోనూ శివసేన భాగస్వామిగా కొనసాగుతోంది.

జలాల పంపిణీకి భరోసా ..!

కోయంబత్తూరు : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమిళనాడుకు రావాల్సిన కావేరీనదీ జలాలకు కేంద్రం భరోసా ఇవ్వాలని సీపీఐ నాయకుడు డి. పాండ్యన్ కోరారు. తమిళనాడు ప్రజలు సుప్రీంకోర్టు తీర్పును శిరసావహి స్తారని ఆయన ఆదివారం ప్రకటించారు. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రానికి చెందిన 177.25 టీఎంసీ జలాల పంపిణీకి కేంద్రం చర్యలు తీసుకోవాలని విలేకరులకు వెల్లడించారు.

గోరఖ్‌పూర్ ఎన్నికలబరిలో ఎస్పీ

లక్నో : గోరఖ్‌పూర్ ఉప ఎన్నికల్లో సమాజ్‌వాద్‌పార్టీ (ఎస్పీ) ఎన్నికల గుర్తుతో ప్రవీణ్‌కుమార్ నిషాద్ పోటీ చేస్తారని ఎస్పీ తేల్చి చెపింది. నిషాద్ పార్టీ అధ్యక్షుడు సంజయ్ నిశాద్ కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఎస్పీ పార్టీ సైకిల్ గుర్తుతో ఎన్నికల బరిలో ఉన్నారని ఆపార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఫుల్‌పుర్ నుంచి కూడా అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో కమలదళానికి ఎదురు గాలి వీస్తుందన్నారు.

గోవా బడ్జెట్ సమావేశాలు 3 రోజులే

పనాజీ : గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ అనారోగ్యం వల్ల బడ్జెట్ సమావేశాలను మూడు రోజులు మాత్రమే కొనసాగిస్తామని స్పీకర్ మైఖేల్ వెల్లడించారు. చికిత్సనిమిత్తం ఆయన ముంబై వెళ్లనున్నందున సోమవారం నుంచి (19 నుంచి 21) బుధవారం వరకు అసెంబ్లీ నిర్వహిస్తామన్నారు. గవర్నర్ మృదుల సిన్హా రేపటి సభలో ప్రసంగిస్తారన్నారు. మార్చి 15 వరకు సభలను కొనసాగించాలని మొదట భావించామని. పారికర్‌ను డాక్టర్లు రెస్టు తీసుకోమన్నందున ఆయన సభలకు హాజరు కారని డిప్యూటీ స్పీకర్ లోబో వెల్లడించారు.

ట్రక్ బోల్తా : నలుగురి మృతి

సికార్ : బోరింగ్ మెషీన్ ట్రక్ బోల్తాకొట్టడంతో నలుగురు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయని పోలీసులు వెల్లడించారు. సీమ్‌కా థానేలో ఈ ఘటన జరిగిందన్నారు. ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ స్టీరింగ్‌పై కంట్రోలు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారి రంజీత్ సింగ్ వెల్లడించారు. మృతి చెందిన వారిలో ముగ్గురు చత్తీస్‌ఘడ్ వాసులు రామ్ , దినేష్, మనరామ్‌లు కూలీలుకాగా, ద్విచక్రవాహనానికి చెందిన సుదేశ్ జాట్ ఉన్నారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

అత్యాచారానికి మద్దతు సిగ్గుచేటు : సీపీఎం

జమ్మూ : బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన వ్యక్తిని విడుదల చేయాలని మితవాద పార్టీలు ర్యాలీ నిర్వహించడం సిగ్గుచేటని సీనియర్ సీపీఎం నాయకుడు, ఎమ్మెల్యే ఎంవై తరిగమి ఆదివారం విమర్శించారు. ఈ ఘటన మానవత్వానికి మచ్చగా నిలుస్తుందని, ఇప్పటికైనా పౌరసమాజం ఈ విషయంపై స్పందించి గొంతువిప్పాలన్నారు. కిడ్నాపైన వారానికి జనవరి 17న పశువులు కాస్తున్న బాలిక మృత దేహం రస్సన్న అడవిలో పడి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆపై ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం నేరపరిశోధనా విభాగానికి బదిలీ చేసింది.

సిలిండర్ పేలుడులో 18కి పెరిగిన మృతులు

జైపూర్ : ఎల్‌పీజీ సిలిండర్ పేలుడు దుర్ఘటనలో మృతుల సంఖ్య 18కి పెరిగింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో పెళ్లి ఇంటిలో జరిగిన ఈ దుర్ఘటనలో 18 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురిని డిశ్చార్జి చేయగా మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో అజ్మీర్ జేఎల్ఎన్ నుంచి జైపూర్ తరలించారు. శిథిలా నుంచి 9 మందిని వెదికి తీయడంతో మృతుల సంఖ్య 18కి పెరిగిందని అజ్మీర్ కలెక్టర్ గౌరవ్ గోయల్ వివరించారు. రాష్ట్ర విపత్తునివారణా దళం, సైన్యం సంయుక్తంగా ఈ సహాయక చర్యలను కొనసాగిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు రాజస్థాన్ ప్రభుత్వం రూ. 2 లక్షలు నష్టపరిహారం ప్రకటించగా, శ్రీచక్రసిమెంట్ మరో లక్షరూపాయలు అందచేయనుంది. గాయపడినవారికి ప్రభుత్వం 50 వేలు ప్రకటించింది.

కోస్తా పరిరక్షణలో కోస్ట్ గార్డ్ సేవలు ప్రశంసనీయం



విశాలాంధ్ర - కాకినాడ : కోస్తా తీరప్రాంత పరిరక్షణలో ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సేవలు అభినందనీయమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కొనియాడారు. కాకినాడ కోస్ట్ గార్డు స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సముద్రతీరంలో కోస్ట్ గార్డ్ కుటుంబాల డే ఎట్ సీ కార్యక్రమాన్ని కలెక్టర్ సతీమణి శ్రేయా దూబే కోస్ట్ గార్డ్ కేక్ కట్ చేసి ప్రారంభించారు. కలెక్టర్ దంపతులతోపాటు పోర్టు డైరెక్టర్ కె.ప్రవీణ్, ఇతర అధికారులు ఐసీజీఎస్ షౌనక్ నౌకలో సముద్రంలో పర్యటిస్తూ కోస్ట్ గార్డుల సేవలను పరిశీలించారు. అత్యాధునికమైన ఐసీజీఎస్ షౌనక్ ఈ నౌక వివరాలను కోస్ట్‌గార్డ్ కాకినాడ కమాండెంట్ పి.శ్యామ్‌కుమార్ వారికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ మెషినరీ కంట్రోల్ సిస్టం, పవర్ మేనేజ్‌మెంట్ సిస్టం, హైపవర్ ఫైర్ ఫైటింగ్ సిస్టం, యాంటీ షిప్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ ఫైరింగ్ సౌకర్యాలు ఈ నౌకలో ఉన్నట్టు తెలిపారు. ఆయుధాలు, సెన్సార్లు, అత్యాధునిక కమ్యూనికేషన్ సౌకర్యాల ద్వారా తూర్పు తీరంలోని కోస్తా ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుందని వివరించారు. కాకినాడ తీరప్రాంతంలో ఇండియన్ కోస్ట్‌గార్డ్స్ నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విశాఖ నుంచి వచ్చిన ఐసీజీఎస్ షౌనక్ నౌక, కోస్ట్‌గార్డు హెలికాప్టర్ల సహకారంతో సముద్రంలో గస్తీ, సమాచార వ్యవస్థ వినియోగం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్‌తో రక్షించడం వంటి వాటిని కోస్ట్‌గార్డు విన్యాసాల చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, కాకినాడ కస్టమ్స్ శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.నర్సింహారెడ్డి, రాజమహేంద్రవరం, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు సాయికాంత్ వర్మ, వినోద్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో అభిషిక్త్ కిషోర్, ఐసీజీఎస్ షౌనక్ నౌక పైలెట్లు టి.శశికుమార్, వివేక్‌శౌర్య పాల్గొన్నారు.



ఉత్కంఠగా జాతీయ ఖోఖో రిఫరీల ఎంపిక

విశాలాంధ్ర - జె.పంగులూరు : ప్రకాశం జిల్లా జె పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం జాతీయ ఖోఖో రిఫరీ అభ్యర్థుల ఎంపిక జరిగింది. జాతీయ ఖోఖో ఫెడరేషన్ (ఢిల్లీ) ఆధ్వర్యంలో ఆంధ్ర ఖోఖో అసోసియేషన్, ప్రకాశం జిల్లా అసోసియేషన్ డీఎస్ఏ సహకారంతో నిర్వహించిన ఎంపికల్లో రాష్ట్రంతోపాటు తెలంగాణ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌కు చెందిన 250 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరికి టెస్టును కళాశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు అభ్యర్థుల అంపైరింగ్ విధానాన్ని పరిశీలించారు. తర్వాత సమావేశంలో అంపైరింగ్‌లో తీసుకో వాల్సిన జాగ్రత్తలపై ప్రశ్నలు, రాతపరీక్ష నిర్వహించారు. తెలంగాణ నుంచి పరిశీలకులుగా శ్రీనివాసనాయుడు, ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఖోఖో రిఫరీ బోర్డు కన్వీనర్ ఎంవీఎస్ ప్రసాద్, డీఎస్‌డీఓ యతిరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బి. కాశీవిశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి రూ.70 లక్షల ఆస్తి నష్టం



విశాలాంధ్ర - గడివేముల : కర్నూలు జిల్లా గడివేములలో ఆదివారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలుడుతో శ్రీనివాసులుశెట్టి ఇల్లు, కిరాణా షాప్ దగ్ధమయ్యాయి. సుమారు రూ.70 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో బాధితుని భార్య వంట తయారుచేసేందుకు గ్యాస్‌స్టౌ వెలిగించడంతో గ్యాస్‌లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. భయాందోళనతో పిల్లలను తీసుకుని ఆమె మిద్దెపైకి చేరుకున్నారు. మంటలు కిరాణా షాప్‌ను అంటుకున్నాయి. ఆ సమయంలో అటువైపు వాకింగ్‌కు వెళ్తున్న జర్నలిస్టులు శ్యాంసుందర్‌రెడ్డి, యల్లా సుబ్బయ్య, మాబాషా ఇంటి వెనుక భాగం నుంచి ఆరుగుర్ని సురక్షితంగా రక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధితుడు శ్రీనివాసులుశెట్టి కుటుంబం నిలువ నీడ లేకుండా రోడ్డున పడటంతో తోటి ఆర్యవైశ్యులు, గ్రామస్తులు విరాళం రూపంలో రూ.10 లక్షలు అందజేశారు.

మా ఇంటి మహాలక్ష్మి కలేనా !



విశాలాంధ్ర - చాగలమర్రిరూరల్ (కర్నూలు) : ఆడపిల్లలు పుట్టగానే ఒకప్పుడు మహాలక్ష్మి పుట్టింది అనుకునేవారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో బతుకే కష్టం కావడంతో ఆడపిల్లలను శాపంగా చూస్తున్నారు. ఇలాంటి వారికి కొంతమేరకైనా ఊరట కల్పించేందుకు గత ప్రభుత్వం బంగారుతల్లి పథకాన్ని ప్రవేశపెట్టగా, నేడు ఆ పథకాన్ని మాఇంటి మహాలక్ష్మి పథకంగా పాలకులు మార్చారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆడపిల్లలు భారం కాకూడదని గత ప్రభుత్వం ప్రారంభించిన పథకానికి ప్రభుత్వం నుంచి భరోసా కరవైంది. ఈ పథకానికి గత మూడేళ్లనుంచి ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదు. మాఇంటి మహాలక్ష్మి పేరు మార్చిన నాటినుంచి ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ పనిచేయకపోవటంతో పథకంలో చేరేందుకు ఎంతోమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరని మహిళలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వడంలేదని వాపోతున్నారు. 2013 మే 1వ తేదీ తరువాత జన్మించిన ఇద్దరు ఆడపిల్లలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకంద్వారా మొదటి ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగితే ప్రసవఖర్చులకు గాను మొదటగా తల్లికి రూ. 2500 అందుతుంది. బాలిక చదువు నిమిత్తం ఒకటినుంచి 5వ తరగతి వరకు ఏడాదికి రూ.1000, 6నుంచి 10వ తరగతి వరకు రూ.1500, ఇంటర్‌మీడియట్ వరకు రూ. 2500, డిగ్రీ, ఆపై చదువులకు ఇదేమొత్తంలో అందేలా అప్పటి ప్రభుత్వం పథకాన్ని రూపొందించింది. 2015 జూన్ నుంచి కొత్త రిజిస్ట్రేషన్లు టీడీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో తల్లిదండ్రులు నిరుత్సాహపడుతున్నారు. మండలంలో 2014-15 ఆర్థిక సంవత్సరంలో 258 మంది దరఖాస్తు చేసుకోగా 202 మంది అర్హులు. వీరిలో 108మందికి మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున రూ 2.70 లక్షలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. 500మంది లబ్ధిదారులు పథకంలో చేరేందుకు ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ పనిచేయకపోవటం, ఐకేపీ అధికారులు దరఖాస్తులు స్వీకరించకపోవటంతో మహిళలు అయోమయంలో ఉన్నారు. ఐసీడీఎస్ అధికారులు తమకు సంబంధంలేదని చెప్పడంతో ఎవరికి దరఖాస్తులు ఇవ్వాలో తెలియక ఆడపిల్లల తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మాఇంటి మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

శాంతిభద్రతల అదుపుతోనే ప్రగతి సాధ్యం

విశాలాంధ్ర ప్రతినిధి - అనంతపురం : సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే శాంతిభద్రతల అదుపు, ప్రశాంత వాతావరణం కీలకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చిన్న రాజప్ప అన్నారు. అనంతపురంలోని నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చిన్నరాజప్ప మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా ప్రశాంత వాతావరణం కల్పిస్తే పెట్టుబడులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు నెలకొల్పేందుకు ముందుకొస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు బాగున్నందునే కియా లాంటి అంతర్జాతీయ సంస్థ జిల్లాకు వచ్చిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మోడల్ పోలీస్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. మహిళలతోపాటు దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా డీఎస్పీల నియామకానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీసుశాఖలో సంస్కరణలు తీసుకువచ్చి సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ ఎం. మాలకొండయ్య, ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, వరదాపురం సూరి, ఉన్నం హనుమంతరాయచౌదరి, జిల్లా పరిషత్ ఛైర్మన్ పూల నాగరాజు, అనంతపురం మేయర్ మదమంచి స్వరూప, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, రాయలసీమ ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్, అనంతపురం రేంజ్ డీఐజీ జె.ప్రభాకర్‌రావు, కలెక్టర్ జి.వీరపాండియన్, ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్, ఓఎస్డీ ఐశ్వర్య రస్తోగి, అదనపు ఎస్పీ మాల్యాద్రి, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సాకే త్రిలోక్‌నాథ్, గోరంట్ల మాధవ్, శేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రబీ సాగు 94 శాతం

- గత ఏడాది కంటే 2.50 లక్షల హెక్టార్లలో అదనం
- శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లో అత్యధిక సాగు
- అత్యధికంగా ఆరుతడి పంటల సాగు



విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల సాగు మెరుగుపడింది. కొన్ని జిల్లాల్లో వర్షాలు కురవడం, నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి నీటి విడుదలతో మరో రెండు జిల్లాల్లో, గోదావరి నీటితో ఉభయగోదావరి జిల్లాల్లోనూ రైతులు ఉత్సాహంగా పంటలు వేశారు. గత ఏడాది రబీ సీజన్‌లో 20 లక్షల హెక్టార్లలో పంటలు సాగుచేస్తే ఈ ఏడాది అదనంగా మరో రెండున్నర లక్షల హెక్టార్లలో వేశారు. వారం రోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. కొన్ని జిల్లాల్లో ఇంకా ఆరుతడి పంటలు సాగు చేస్తుండటంతో అనుకున్న లక్ష్యం చేరుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది రబీ సాగు లక్ష్యం 23.80 లక్షల హెక్టార్లుకాగా ఇప్పటివరకు 22.40 లక్షల హెక్టార్లలో అంటే 94 శాతం పంటలు సాగయ్యాయి. రాయలసీమ జిల్లాల్లో వర్షపాతం సమోదు కావడంతో పంటలు వేశారు. రాష్ట్రంలో అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 137 శాతం సాగులోకి తీసుకొచ్చారు. సీజన్ సాధారణ విస్తీర్ణం కంటే 37 శాతం అధికం. అనంతపురం జిల్లాలో 95 శాతం, కర్నూలుజిల్లాలో 95 శాతం, కడపజిల్లాలో 86 శాతం సాగు చేశారు. నాగార్జున సాగర్ సమీపంలోని గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోనూ సాగు విస్తీర్ణం పెరిగింది. సాగర్ కుడికాలువ నుంచి 65 టీఎంసీలు నీరు విడుదల చేయడంతో గుంటూరు జిల్లాలో 100 శాతం, ప్రకాశం జిల్లాలో 81 శాతం పంటలు సాగు చేశారు. ఎడమకాలువలో నీటి విడుదలతోపాటు కృష్ణానదిలో ఆశించిన మేర నీటినిల్వలు ఉండటంతో కృష్ణాజిల్లాలో 96 శాతం సాగుచేశారు. గోదావరి నదిలో నీటి నిల్వలతో పశ్చిమగోదావరి జిల్లాలో 93 శాతం, తూర్పు గోదావరిజిల్లాలో 84 శాతం సాగు చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 131 శాతం, విజయనగరం జిల్లాలో 97 శాతం, విశాఖపట్నం జిల్లాలో 90 శాతం, నెల్లూరు జిల్లాలో 92 శాతం సాగుచేశారు.

అత్యధికంగా ఆరుతడి పంటలు

ఈ ఏడాది రబీసీజన్‌లో అత్యధికంగా ఆరుతడి పంటలు సాగుచేశారు. శనగలు 5.21 లక్షల హెక్టార్లలో, మినుము 3.27 లక్షల హెక్టార్లలో, మొక్కజొన్న 2.19 లక్షల హెక్టార్లలో, జొన్న 1.06 లక్షల హెక్టార్లతోపాటు గోధుమ, రాగులు, సజ్జలు, అపరాలు, మిర్చి, పొగాకు వంటి పంటలు కూడా వేశారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో 6.95 లక్షల హెక్టార్ల వరకు వరిసాగు చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువ వరి సాగవుతోంది. పంటల సాగులో ముందంజలో ఉండటంతో ఆశించిన దిగుబడులు వస్తాయని రైతులు భావిస్తున్నారు. మిర్చికి తెగుళ్లు సోకడంతో దిగుబడులు పడిపోతున్నాయి. శనగ, మినుము పంటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

నేడు బెజవాడలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ప్రదర్శన

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడాన్ని ఖండిస్తూ ఏపీ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో ప్రదర్శన, ధర్నా చౌక్‌లో నిరసన సభ నిర్వహిస్తున్నట్టు ఐక్యవేదిక ఛైర్మన్ పి.కాశీ మధుబాబు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో పనిచేస్తున్న 24 వేల మంది కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం, పీస్ రేటు రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులు మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా ఫలితం కానరాలేదన్నారు. సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి అలంకార్ ధర్నా చౌక్ వరకు ర్యాలీ, అనంతరం నిరసన సభలో పాల్గొంటారన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నామన్నారు. వేదిక జనరల్ సెక్రటరీ యం.బాలకాశీ, నాయకులు రాజనాల ప్రవీణ్‌కుమార్, యం.శ్రీనివాస్, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

విశాఖలో సీమెన్స్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం

- రూ.300 కోట్లతో ఏయూలో ఏర్పాటు
- టెక్నికల్, ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ
- ఈ నెలాఖరున ప్రారంభోత్సవానికి సన్నాహాలు

ఆంధ్ర విశ్వకళా పరిషత్

విశాలాంధ్ర - విశాఖసిటీ : విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం సీమెన్స్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.300 కోట్లతో ప్రపంచ స్థాయి అత్యుత్తమ ప్రమాణాల పరికరాలతో రూపుదిద్దుకునే ఈ ప్రాజెక్టులో ఇప్పటికే దాదాపు రూ.80 కోట్ల విలువైన పరికరాలను వర్సిటీలో సిద్ధం చేశారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలలో ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏయూ, సీమెన్స్ భాగస్వామ్యంతో నెలకొల్పే ఈ ప్రతిభా కేంద్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ తదితర సాంకేతికరంగ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యాబోధనలో మరింత నైపుణ్యత సాధించేలా శిక్షణ అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఆరు సెంటర్లకు ఏయూలోని ఎక్సలెన్స్ సెంటర్ కేంద్ర బిందువు కానుంది. ఈ సెంటర్‌లో రోబోటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రోటోటైప్, సీఎన్‌సీ తదితర 15 ల్యాబ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు తగినట్లు విద్యార్థులకు విద్యను అందించే ప్రధాన లక్ష్యంతో దీనిని రూపొందిస్తున్నారు. ఈ సెంటర్‌కు అవసరమైన స్థలాన్ని ఏయూ సమకూర్చింది. కొన్ని సంవత్సరాలపాటు సీమెన్స్ ఆధ్వర్యంలో ఈ సెంటర్ కొనసాగినప్పటికీ ఆ తరువాత ఈ ఎక్విప్‌మెంట్ మొత్తం ఏయూకి వదలి వెళ్లేలా ఒప్పందాలు చేసుకున్నారు. అప్పటినుంచి శిక్షణా బాధ్యతలను ఏయూ చూసుకుంటుంది. ఇప్పటికే ఈ సెంటర్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరున నగరానికి రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఈ సెంటర్ ప్రారంభోత్సవానికి అధికారులు సమాయత్తమవుతున్నారు.

టెట్ నమూనా పరీక్ష అభినందనీయం


ఎమ్మెల్సీ ఏఎస్. రామకృష్ణ



విశాలాంధ్ర - గుంటూరు సిటీ : ఎస్టీయూ, ఏఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టెట్ నమూనా పరీక్ష అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని గుంటూరు, కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు డాక్టర్ ఏ.ఎస్.రామకృష్ణ అన్నారు. గుంటూరు పరీక్షాభవన్‌లో ఆదివారం టెట్ నమూనా పరీక్ష పేపర్-1 విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. 150 మార్కులకుగాను 122 మార్కులతో ఏ.మాధవి ప్రథమస్థానం, 110 మార్కులతో ఎస్.కె. సాబియా ద్వితీయస్థానం, 99 మార్కులతో కె.వి.నరసయ్య తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలతో పాటు విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఎస్టీయూ, ఏఐఎస్ఎఫ్‌లు నమూనా పరీక్షలు కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందే ఇలాంటి పరీక్షలు రాయడంద్వారా అభ్యర్థులు ఒత్తిడిని అధిగమించడంతోపాటు లోపాలు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ టెట్ రాసే అభ్యర్థులకు ప్రాక్టీస్‌తోపాటు అవగాహన కోసమే ఎస్టీయూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏకకాలంలో టెట్ నమూనా పరీక్ష పేపర్-1 నిర్వహించిందన్నారు. అన్ని విషయాలపై అభ్యర్థులు సంపూర్ణ అవగాహనతో పాటు సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకుంటారన్నారు. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకుండా, అభ్యర్థులకు అవగాహన కల్పించకుండా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కిరణ్, టి.గోపయ్య, ఎస్టీయూ జిల్లా ఆర్థిక విభాగం కార్యదర్శి బి.సంపత్‌బాబు, ఏఐఎస్ఎఫ్ మహిళావిభాగం కార్యదర్శి జి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం సమరం

- మార్చి 12న అనంత కలెక్టరేట్ ఎదుట ధర్నా
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్



విశాలాంధ్ర - అనంతపురం అర్బన్ : ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయకుండా మోసపూరిత ప్రకటనతో కాలయాపన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుల ఆవుల శేఖర్ అన్నారు. అనంతపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి నేతల సమావేశంలో శేఖర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కేవలం అధికార పార్టీ అనుయాయులకు కట్టబెట్టడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేకపోవడంతో అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నీటి మూటలు అయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 12వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నిత్యం కరవు విలయతాండవం చేస్తున్న జిల్లాలో 10 ఎకరాల సొంత భూములున్న రైతులు కూడా ఉపాధి పనులకు వెళ్తున్నందున ఉపాధిహామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలుచేయాల్సిఉందన్నారు. జిల్లాలో వందరోజులు పనిదినాలు అయిపోయిన వేలాది మంది కూలీలు పనులకోసం కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు వలసవెళ్లి దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వలసల నివారణ కోసం గ్రామాల్లోనే అదనపు పనిదినాలు కల్పించాలన్నారు. నిరుపేదలకు ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంద్వారా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పక్కా గృహాలు నిర్మించాలన్నారు. పేదల సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాకు పెద్దఎత్తున వ్యవసాయ కూలీలు, రైతులు తరలిరావాలని కోరారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రంగయ్య, బి.కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నారాయణస్వామి, జిల్లా నాయకులు రామాంజినేయులు, సూర్యనారాయణ, నారాయణమ్మ, వాసు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఏప్రిల్ 2న మహా తిరుగుబాటు గర్జన

విశాలాంధ్ర - నందిగామ : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఏప్రిల్ రెండవ తేదీన గుంటూరు వేదికగా మహా తిరుగుబాటు గర్జన నిర్వహిస్తున్నట్టు ఎంఆర్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ పేర్కొన్నా రు. ఆదివారం కృష్ణాజిల్లా నందిగామ వచ్చిన ఆయన రైతుపేటలో విలేకరులతో మాట్లాడారు. మహాగర్జన సన్నాహాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు దఫాలుగా రథయాత్రలు ప్రారంభిస్తున్నామన్నారు. మార్చి ఒకటి నుండి 22వ తేదీ వరకు మొదటి విడత రథయాత్ర ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ నిర్వహిస్తా రన్నారు. 22వ తేదీన ముగింపు సభలో తాను పాల్గొని ఏప్రిల్ 2వ తేదీ వరకు యాత్రను కొనసాగిస్తానన్నారు. మహా తిరుగుబాటుకు 10 లక్షల మంది ప్రజలను సమీకరించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగేళ్లు అవుతున్నా పట్టించుకోకపోవడం అవకాశవాదమే అన్నారు. ఎస్సీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు దళితుల గోడును పట్టించుకోవటంలేదన్నారు. కాంగ్రెస్, వైసీపీ నేతలు నోరు మెదపకపోవటం విచారకరమన్నారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు దొండపాటి సుధాకర్ మాదిగ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెసరమల్లి శేఖర్‌బాబు, ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి మందా పిచ్చయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లు విక్రయిస్తున్న గిరిజనులపై ఎక్సైజ్ జులుం

- ముగ్గురు మహిళలను చితకబాదిన పోలీసులు
- గిరిజనులే దాడిచేశారంటున్న పోలీసులు
- విశాఖ జిల్లాలో ఘటన

విశాలాంధ్ర-చీడికాడ : జీలుగు కల్లు విక్రయిస్తున్న ముగ్గురు గిరిజన మహిళలను ఎక్సైజ్ పోలీసులు, ప్రైవేటు రైడ్ బృందం చితకబాదిన ఘటన విశాఖ జిల్లా చీడికాడ మండలంలో చోటుచేసుకుంది. అకారణంగా అమాయక గిరిజనులపై దాడి చేయడమేకాకుండా మహిళలే దాడి చేసినట్టు పోలీసులు చిత్రీకరించే ప్రయత్నం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం...చీడికాడ మండలం కోనాం పంచాయతీ శివారు గుడివాడకు చెందిన కినుడు వరలక్ష్మి, గమ్మెలి పార్వతమ్మ, పాంగి కుసుమప్రియతోపాటు మరికొందరు గిరిజనులు గ్రామంలోని చెట్ల నుంచి సేకరించిన జీలుగు కల్లును పెద్దగెడ్డ వంతెన వద్ద విక్రయిస్తూ జీవిస్తున్నారు. శనివారం సాయంత్రం మహిళలు కల్లు విక్రయించే ప్రాంతానికి ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, మరో ఎనిమిది మంది రైడ్‌పార్టీ బృంద సభ్యులు మూడు బైక్‌లపై వచ్చారు. రావడంతోనే జీలుగు కల్లును కాళ్లతో తన్ని నేలపై పారబోశారు. కల్లు ఎందుకు ఒంపుతున్నారని గిరిజన మహిళలు ప్రశ్నించడంతో ఇష్టం వచ్చినట్లు కొడుతూ చేతులు, కాళ్లు పట్టుకొని ఈడ్చుకెళ్లి ఆటోలో పడేశారని బాధిత మహిళ వరలక్ష్మి వాపోయింది. ఈ ఘటనలో తన చీరకొంగుకు కట్టిన రూ.6,500 నగదు కూడా పోయిందని తెలిపింది. కానిస్టేబుల్స్ తమ యూనిఫారం షర్టులను విప్పి తమపై వేసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీశారని వివరించింది. వీరి బారి నుంచి తప్పించుకున్న తాము తమ గోడు చెప్పుకునేందుకు కోనాం సర్పంచ్ భర్త కలుగు అప్పలనాయుడు వద్దకు వెళ్లామని చెప్పారు. ఈ విషయాన్ని ఫోన్‌లో మాడుగుల ఎస్ఐ, సీఐ నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లడంతో గిరిజనులు కావడంతో గిరిజన కానిస్టేబుళ్లు కె నాగేశ్వరరావు, కె. భవానీలను పంపానని, వారితో రైడ్‌పార్టీ బృందం వెళ్లలేదని, తమ సిబ్బందిపైనే గిరిజనులే తిరగబడ్డారని చెప్పారన్నారు. జీలుగు కల్లు, తాటికల్లుపై నిషేధం లేదని ఆయన ప్రశ్నించడంతో జీలుగుకల్లు రెండు లీటర్లకు మించి ఉండకూడదని, అవి బయట విక్రయించరాదని చెప్పిన పోలీసు అధికారులు గిరిజనులను ఏమీ చేయలేదన్నారు. ఘటన జరిగిన ప్రదేశం సమీపంలోని పొలంలో పనులు చేస్తున్న కోనాం గ్రామ రైతు కె. సత్తిబాబు మాట్లాడుతూ ఎక్సైజ్ సిబ్బంది, రైడ్ పార్టీ బృంద సభ్యుడు రొంగలి వెంకటరమణలు గిరిజనులను చావబాదడం నిజమన్నారు. యూనిఫారాలు గిరిజన మహిళలపై వేసి ఫొటోలు తీశారని, గిరిజనులెవరూ ఎక్సైజ్ సిబ్బందిని కొట్టలేదని ఆయన వివరించారు.



పెళ్లికళ వచ్చేసింది...

- 3,4 తేదీల్లో ముహూర్తాల మోత
- కల్యాణమండపాల దోపిడీ
- పూజారుల కోసం పరుగులు



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: పెళ్లి బాజాలకు వేళైంది. పెళ్లి మండపాలకు గిరాకీ పెరిగింది. మండపాలు దొరక్క పెళ్లింటి వారు నానా అవస్థలు పడుతున్నారు. చాలా వరకు మూడు నెలల క్రితమే అవి బుక్కయ్యాయి. మూఢం పేరుతో మూడు మాసాల పాటు పెళ్లి మండపాలు మూగబోయాయి. ఇప్పుడు పెళ్లి బజాలు మోగించేందుకు నూతన వధూవరులు సిద్ధమవుతున్నారు. మార్చి 3, 4 తేదీలలో మంచి ముహూర్తాలు ఉండటంతో భారీగా జంటలు ఒక్కటవనున్నాయి. ఈ నెలలోనూ అడపాదడపా వివాహాలు ఉన్నా...వచ్చే నెల 3, 4 తేదీలలో మాత్రం అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణ మండపాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని కళ్యాణ మండపాలు ఈ రెండు తేదీలలో బుక్ అయినట్లు తెలుస్తుంది. మూడు మాసాలుగా పెద్దగా వ్యాపారాలు లేక వెలవెలబోయిన బంగారు దుకాణాలతో పాటు బట్టల దుకాణాలు, కిరాణా దుకాణాలు, పూలదుకాణాలు కిటకిటలాడనున్నాయి. పూజారులకు ఉండే డిమాండు గురించి ప్రత్యేకంగా చెప్పనవరం లేదు. ఇప్పటికే వారిని బుక్ చేసుకునేందుకు పెళ్లి పెద్దలు వారి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత రుచులకు అనుగుణంగా క్యాటరింగ్ సంస్థలు కొత్త మెనూలను సిద్ధం చేసుకుంటున్నాయి. వివాహాలు ఒకేసారి రావడంతో కళ్యాణ మండపాల ధరలను అమాంతంగా పెంచేశారు. హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాల్లో ప్రముఖ వస్త్ర వ్యాపారులు ప్రత్యేక డిస్కౌంట్‌ల పేరుతో కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఘరానా దొంగలు

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి : దేశంలో వైట్ కాలర్ నేరాలు పెరిగిపోతున్నాయి. దురదృవశాత్తూ వీటికి జాతీయ బ్యాంకులు వేదికగా మారుతున్నాయి. బడా బాబులు కావడం, ఎక్కడలేని హడావుడి సృష్టిస్తూ, లేని దర్పాన్ని నటిస్తూ అప్పుల కోసం బ్యాంకులకు రావడం, బ్యాంకింగ్ నిబంధనల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని అప్పులు తీసుకోవడం పరిపాటిగా మారింది. సామన్యులు అప్పుకోసం బ్యాంకు గుమ్మం ఎక్కితే సవాలక్ష నిబంధనలు చెప్పే బ్యాంకులు... వీరికి మాత్రం కిమ్మనకుండా కోట్లకు, కోట్లు వారి ఎదుట కుమ్మరిస్తున్నాయి. సామాన్యుడిని బ్యాంకులోని అధికారులు 'మేనేజ్' చేయడం తెలియదు కాబట్టి, అధికారుల నిబంధనలకు తలొగ్గి, తిన్నా, తినకపోయినా అప్పు తీర్చబడం తప్పట్లేదు. అయితే వీరిలా కాదు.. ఏకంగా బ్యాంకు నిబంధనలనే తమకు అనుగుణంగా మలుచుకుని ప్రజల సొమ్ముతోనే జల్సాలు చేస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారు. వెనకటికి సామెత చెప్పినట్లు 'దొరికేంతవరకూ అందరూ దొరలే..' అన్న చందంగా వీరికి ఏకంగా బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల దగ్గర నుంచి పరిచయాలు ఉంటాయి. టాప్ రేంజ్‌లో ఉన్న హీరోలు, హీరోయిన్లు వీరికి సంబంధించిన వ్యాపారాలకు బ్రాండ్ అంబాసిడార్‌లుగా మారిపోతారు. ఎందుకంటే వీరి నుంచే వారు కాస్త 'ఎక్కువ' రాబట్టుకోవచ్చునని. అయితే ఇంత జరుగుతున్న ప్రభుత్వాలు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. ఇలాంటి మోసాలు బయట పడిన తరువాత ప్రభుత్వ రంగ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి ఓ పది రోజులో, పదిహేను రోజులో కాస్త హడావుడి సృష్టిస్తాయి. వారిపై కేసులు నమోదు చేస్తాయి.

ఇంతవరకే... వారు ఎక్కడున్నారో తెలుసు, ఏం చేస్తున్నారో తెలుసు... అయినా ఏం చేయలేని పరిస్థితి. విదేశాల నుంచి వారికి ఇక్కడకు రప్పించడం భారత్‌కు తలకుమించిన భారం. అక్కడ కోర్టు లో ముందుగా వీరి చేసిన నేరాలను నిరూపించి, ఆపై ఇక్కడకు తీసుకొచ్చి ఆ నేరాలకు ఇక్కడ ఎటువంటి శిక్షలు అమలు చేయాలనే విషయాన్ని పరిశీలించాలి. ఇంత జరిగే సమయానికి ఇక్కడ దాదాపు రెండూ,మూడు ప్రభుత్వాలు మారిపోతాయి. ఇక్కడ చెప్పేదేముందు ఇక్కడ నుంచి ఆయా కేసులు రాజకీయ రంగు పులుముకుంటాయి. 'మీ హయంలో అంటే మీ హయాంలోనే'.. అంటూ ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం తప్పవిడిచి చేసేదేమీ లేదు. అంతిమంగా నష్టపోయేది ఎవరంటే... బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటున్న సామాన్యులు. ఇలాంటి పరిస్థితి చరమగీతం పాడేలా భారతీయ చట్టాలు ఎప్పుడు మారతాయో మరి.. ఆర్థిక అక్రమాలకు పాల్పడటం... అవి బయటపడే సమయానికి దేశం విడిచి పరారవడం... ఆర్థిక నేరగాళ్ల మోడస్ ఆపరెండీగా మారిపోయింది. నేటి నీరవ్ మోడీ... నిన్నటి విజయ్ మాల్యా... మొన్నటి సంజయ్ భండారీ, నేటి విక్రమ్ కొఠారీ లాంటి వారంతా ఈ కోవలోనివారే. ఇవీ వారి వివరాలు..



సంజయ్ భండారీ : ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీ.. రూ.150 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించి పన్ను ఎగ్గొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆఫ్‌సెట్ ఇండియా సొల్యూషన్స్ అనే సంస్థ ద్వారా అనేక అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఢిల్లీ కోర్టు అతడిని నేరగాడిగా కూడా ప్రకటించింది. కేసులు బిగిస్తున్న సమయంలో నేపాల్ మీదుగా దేశం విడిచి పారిపోయాడు.



దీపక్ తల్వార్ : రూ. వెయ్యి కోట్లకు పైగా ఆస్తుల వివరాలు వెల్లడించకుండా పన్నులు ఎగ్గొట్టిన వ్యక్తి దీపక్ తల్వార్. ఇతను కార్పొరేట్ కంపెనీలకు సలహాదారు. యూపీయే హయాంలో విమానయాన సంస్థలకు 'ప్రయోజనాలు' చేకూర్చి పెట్టడంలో కీలకపాత్ర పోషించాడు. రాజకీయాల్లో పలుకుబడి ఉన్న నేతలు, అధికారులు, పాత్రికేయులతో సంబంధాలున్నాయి. ఐటీ అధికారులు 5 కేసులు పెట్టి లెక్కలు అడిగేసరికి యూఏఈ పారిపోయాడు. భారత్ ప్రయత్నం ఫలితంగా యూఏఈ నుంచి ఏ దేశానికీ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



లలిత్ మోడీ : ఐపీఎల్ ద్వారా ఎనలేని గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి లలిత్ మోడీ. 2010లో కొచ్చి టీమ్ హక్కుల విషయంలో ఆరోపణలు వచ్చాయి. ఫెమా నిబంధనల ఉల్లంఘనపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు సంస్థలు నోటీసులు ఇచ్చాయి. అదే సమయంలో ఐపీఎల్ చైర్మన్ పదవీ ఊడింది. ఈడీ మేలుకొనేలోపే కుటుంబంతో కలిసి బ్రిటన్ చెక్కేశాడు. ఇతనిపై ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసు జారీ అయ్యింది. ఈడీ చర్యలను లండన్ కోర్టులో సవాల్ చేశాడు. బీజేపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. వసుంధరారాజేతో ఉన్న సంబంధాల నేపథ్యంలో.. ఒకానొక సమయంలో లలిత్‌మోడీని రాజస్థాన్ సూపర్ సీఎంకూడా పేర్కొనేవారు.

నీరవ్ మోడీ : పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 11,520 కోట్ల రూపాయల 'ఖరీదైన కుచ్చుటోపీ' పెట్టిన ఘరానా మోసగాడు నీరవ్ మోడీ. ఇతగాడు జనవరిలోనే దేశం నుంచి 'జంప్' అయ్యాడు. స్విట్జర్లాండ్లో వాలిపోయాడు.



విజయ్‌మాల్యా: బ్యాంకులకు 9వేల కోట్ల రూపాయల మేర ఎగ్గొట్టిన ఈ లిక్కర్ కింగ్.. తన పాపం పండే సమయానికి బ్రిటన్‌కు పారిపోయి అక్కడ దలదాచుకుంటున్నాడు. గ్లామర్ మోడల్లు.. ఖరీదైన యాట్‌లలో కాస్ట్లీ పార్టీలు... ఆ పార్టీల్లో పారే మందు గురించి అప్పట్లో కథనాలు ప్రచురించని పేపర్లు లేవు. ప్రసారం చేయని చానళ్లు లేవు.



ఆయన ఆస్తులపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఆయన ఆఫీసులు, షోరూములు, డైమండ్ వర్క్షాపులై దాదులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు రూ.5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. అనేక డాక్యుమెంట్లు కూడా స్వాధీనం చేసుకుంది. ఇప్పటిదాకా ఈ కేసులో ఎవ్వరినీ అరెస్టు చేయలేదు. సదరు ఈ వ్యక్తి జల్సాగా అమెరికాలోని విలాసవంతమైన సూట్‌లో మకాం పెట్టాడు.



విక్రమ్ కొఠారి: ప్రముఖ రొటొమాక్ పెన్నుల కంపెనీ మాతృసంస్థ భారత్‌లోని వివిధ బ్యాంకుల్లో రూ.800 కోట్ల రుణాలు తీసుకొని ఎగనామం పెట్టినట్లు సమాచారం. ఆ కంపెనీ యజమాని అయిన విక్రమ్ కొఠారి ఐదు బ్యాంకుల్లో రూ.800 కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు సమాచారం. అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు పలు నియమాలను ఉల్లంఘించి కొఠారికి అప్పులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొఠారి యూనియన్ బ్యాంకు నుంచి రూ.485 కోట్లు, అలహాబాద్ నుంచి రూ.352 కోట్ల రుణం తీసుకున్నారు. అయితే ఆయన ఇప్పటివరకూ అసలును కానీ, వడ్డీని కానీ బ్యాంకులకు తిరిగి చెల్లించనట్లు తెలుస్తోంది.



అవిశ్వాసానికి సిద్ధం

- టీడీపీకి, పవన్ కల్యాణ్‌కు వైఎస్ జగన్ సవాల్
- ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీతో ఒరిగేదేమీ లేదు

విశాలాంధ్ర-ఒంగోలు : కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి వైసీపీ సిద్ధంగా ఉందని, మీరు సిద్ధమా అని టీడీపీకి, పవన్ కల్యాణ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. జగన్ ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లాలోని కందుకూరు పట్టణంలో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ సంవత్సరంలోపు ఎన్నికలు రాబోతున్నాయని కార్యకర్తలను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారని అన్నారు. నాలుగేళ్ల బాబు పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేరన్నారు. రైతన్నలకు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తామని వారిని మోసం చేశారని, ఉద్యోగం ఇస్తామని లేకపోతే నిరుద్యోగ భృతి అంటూ ప్రచారం చేశారని, అయితే 45 నెలల కాలంలో ప్రతి ఇంటికీ రూ.90 వేలు చంద్రబాబు బాకీ పడ్డారన్నారు. రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని, ఆరోగ్యశ్రీని పూర్తిగా నాశనం చేశారన్నారు. చంద్రబాబు ఎన్నికలు వస్తే బీసీల మీద ప్రేమ అంటూ నాలుగు కత్తెరలు, ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ప్రకాశం జిల్లాలో రబీలో 71 శాతం వర్షపాతం మాత్రమే నమోదయినా, జనవరిలోనూ ఒక్క చినుకు పడకపోయినా కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించలేదని పేర్కొన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు చంద్రగ్రహణం పట్టిందని, వైఎస్ హయాంలో 80 శాతం పనులు పూర్తయ్యాయని కేవలం రూ.20 కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయన్నారు. సాగు భూములకు నీరు అందించాలన్న ధ్యాసే చంద్రబాబుకు లేదన్నారు. జిల్లాలో శెనగ, పొగాకు, కంది, మినుము పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతన్నలు అల్లాడుతున్నారని తెలిపారు. నాలుగేళ్లుగా కేంద్రంలో టీడీపీ ఎంపీలను మంత్రులుగా పెట్టారని, బడ్జెట్‌లో రాష్ట్రానికి అరుణ్ జైట్లీ ఏమీ చేయకపోయినా శాలువాలు కప్పారన్నారు. సంవత్సరంలో ఎన్నికలు జరగబోతు న్నాయని బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయటం మొదలుపెట్టారన్నారు. పవన్ కల్యాణ్ జాయింట్ ఫ్యాక్ట్ కమిటీతో ఒరిగేదేమీ లేదని అన్నారు. ప్రత్యేక హోదా మా హక్కు అని పోరాడాలని పవన్‌కు హితవు పలికారు. ప్రత్యేక హక్కుకు సమానంగా ప్యాకేజీ ఇచ్చేశామని బీజేపీ నాయకులు చెబుతున్నారని, ఆ రోజున రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు వెంకయ్య నాయుడు రాజ్యసభలో ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలన్నారు. మార్చి 5న పార్లమెంట్ సమావేశాలు మొదలవుతాయని, మార్చి 1న కలెక్టరేట్ల దిగ్బంధనానికి పిలుపు ఇచ్చామని జగన్ చెప్పారు. మార్చి 3న ఢిల్లీకి పార్టీ నేతలు వెళ్లేందుకు పాదయాత్ర ప్రాంతం నుంచే యాత్రను ప్రారంభిస్తామన్నారు. మార్చి 5న పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీ నడిబొడ్డున కూర్చొని కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. హోదాపై ప్రకటన రాని మరుక్షణం పార్లమెంట్ సమావేశాల చివరి రోజున ఎంపీలు రాజీనామాలు చేస్తారని తెలిపారు. చంద్రబాబు ప్రత్యేక హోదా గురించి ఒక్క మాట మాట్లాడలేదని, రాజీనామా అంశాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా చిత్తశుద్ధితో అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాలంటే 50 మంది ఎంపీలు కావాలని, పార్టీ తరఫున 5 మంది ఎంపీలు రెడీగా ఉన్నారని, మిగిలిన వారిని చంద్రబాబు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేశారన్నారు. ఈ సభలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

1న గుంటూరులో రాష్ట్రస్థాయి సదస్సు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను నెరవేర్చాలని డిమాండు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వరుస కార్యక్రమాలను నిర్వహించాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నిర్ణయించింది. సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఐవీ ప్యాలెస్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలతోపాటు ప్రజాసంఘాల నేతల హాజరై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఢిల్లీలో మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీల అమలుపై చర్చ జరిగే విధంగా కేంద్రంపై వత్తిడి తీసుకువచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పార్లమెంటులో పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతునివ్వాలని కోరుతూ రాష్ట్రానికి చెందిన ఎంపీలను కలసి లేఖలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే కాంగ్రెస్, వైసీపీ కొన్ని కార్యక్రమాలకు పిలుపునివ్వగా వాటికి సమితి తరపున సంపూర్ణ మద్దతు తెలియచేయడమే కాకుండా ఉమ్మడి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఈ వివరాలను సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, కె రామకృష్ణ విలేకరులకు వివరించారు.

ఉమ్మడి కార్యక్రమాలు

- మార్చి 1 వ తేదీన గుంటూరులో ప్రత్యేక హోదా, విభజన హామీలపై రాష్ట్రస్థాయి సదస్సు
- మార్చి 2 నుంచి 4 వరకూ జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే దీక్షల్లో అందర్నీ భాగస్వాములు చేయడం.
- మార్చి 5 నుంచి ఢిల్లీలో పార్లమెంటు ఎదుట నిరసన కార్యక్రమాలు
- ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీలోపు జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించడం.
- ఫిబ్రవరి 21న విజయవాడలో ఉద్యమ గీతాల ఆవిష్కరణ
- మార్చి 1వ తేదీలోపు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లోని విద్యార్థులతో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు అంశాలపై సదస్సుల నిర్వహణ.

ముందే ప్రకటించిన అన్ని పక్షాల కార్యక్రమాలకు మద్దతు

రాష్ట్రంలో కాంగ్రెస్, వైసీపీ సహా వివిధ సంస్థలు, సంఘాలు ప్రత్యేకహోదా విభజన హామీల సమస్యలపై ఆందోళనలు ప్రకటించాయి. ఈ ఆందోళనలు, ఉద్యమాలు, ధర్నాలు, కార్యక్రమాలకు సమావేశం సంఘీభావంతోపాటు మద్దతు ప్రకటించింది.

- ఫిబ్రవరి 19న ఒంగోలులో ఏపీజేఏఫ్ ఆధ్వర్యంలో దీక్ష
- ఫిబ్రవరి 19 నుంచి 28 వరకూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆత్మవగౌరవ దీక్షలు
- ఫిబ్రవరి 21న ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం
- ఫిబ్రవరి 22న ఏపీజేఎఫ్ ఆధ్వర్యంలో చెన్నైలో అవగాహన సదస్సు
- ఫిబ్రవరి 28న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో బెంగళూరులో అవగాహన సదస్సు
- మార్చి 1న వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- మార్చి 4న ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో విశాఖపట్నం బీచ్‌లో కొవ్వత్తుల ర్యాలీ
- మార్చి 5 నుంచి 10 వరకూ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలో 'పార్లమెంటు ముట్టడి'
- మార్చి 5న వైసీపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా మార్చి 6,7 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో దీక్షలు
- మార్చి 8న కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఛలో పార్లమెంట్'
- మార్చి 17న వీసీకే పార్టీ ఆధ్వర్యంలో ఛలో అమలాపురం
- ఏప్రిల్ 20న రాజమండ్రిలో బహిరంగసభ

మరో అంతర్జాతీయ సదస్సుకు కేటీఆర్

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రసంగించాలని కోరుతూ జర్మన్ ఏషియా పసిఫిక్ బిజినెస్ అసోసి యేషన్ నిర్వహించే 98వ సమావేశానికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు ఆహ్వానం అందింది. తెలంగాణ కోసం ప్రత్యేకంగా రౌండు టేబుల్ సమావేశం ఏర్పాటు చేసే సంస్థ. మరో అంతర్జాతీయ సంస్థ నుంచి కేటీ ఆర్‌కు ఆహ్వానం లభించింది. జర్మనీలోని హంబర్గ్‌లో మార్చి 2వ తేదీన సమావేశం జరుగుతుంది. ఆసియా దేశాలతో జర్మనీ నిర్వహించే వ్యాపార వాణిజ్య అవకాశాలను చర్చించే ఈ సమావేశానికి అంతర్జా తీయంగా పేరున్న 300 మంది వాణిజ్య వేత్తలు, రాజకీయ నాయకులు, దౌత్య వేత్తలు హాజరవుతారని అసోసియేషన్ తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, ఆర్థిక కార్యక్రమాలపై జర్మన్ వ్యాపార వర్గాలకు ఆసక్తి ఉందని. అందుకే తమదేశంలోని అగ్రస్థాయి వ్యాపారవేత్తలతో ప్రత్యేకంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపింది. తెలంగాణ, జర్మన్ మధ్య వాణిజ్య బంధం మరింత విస్తృతమ వుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తంచేసింది.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ, బీజేపీ

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్: ప్రత్యేక హోదాపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను మోసంచేసిన టీడీపీ, బీజేపీ, వైఎస్ఆర్‌సీపీలపై ఏపీ రాష్ట్ర ప్రజలు తిరుగబడాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్ల మూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించడంలో అన్ని రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆరోపించారు. విభజన చట్టం 2014లో ఇచ్చిన ఏ ఒక్క అంశాన్ని కేంద్రప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. ప్రతిపక్ష వైసీపీ, బీజేపీతో రాజకీయ సంబంధాలు కొనసాగిస్తూ, అవకాశ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. జనసేన చంద్రబాబుతో చేతులు కలుపుతూ రాజకీయ నాటకలు ఆడుతున్నారని ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్రప్రజలను టీడీపీ, బీజేపీ దగా చేస్తున్నదన్నారు.

మరో అగ్రిగోల్డ్ బాధితుడు మృతి



విశాలాంధ్ర-ఒంగోలు: ప్రభుత్వ అలసత్వానికి మరో అగ్రిగోల్డ్ బాధితుడు బలయ్యాడు. జిల్లాలోని కొత్త పట్నం మండలం ఈతముక్కల పల్లె పాలెం గ్రామానికి చెందిన గొల్లపోతు కోటేశ్వరరావు(55) స్థానిక కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. కోటేశ్వరరావు అంతిమ కార్యక్రమాలను ఆదివారం ఆయన స్వగ్రామం ఈదముక్కలలో నిర్వహించారు. అగ్రిగోల్డ్ కంపెనీలో గత 12 సంవత్సరాలుగా పని చేస్తూ, బంధువులు, గ్రామస్థుల నుంచి సుమారు రూ1 కోటి పై చిలుకు డబ్బులు అగ్రిగోల్డ్ కంపెనీలో కట్టించడమే గాక,తన సొంత కుటుంబీకుల నుంచి సుమారు రూ.30 లక్షల కట్టించారు. అగ్రిగోల్డు బాధితులపై ప్రకటనలు చేస్తూ ప్రభుత్వం కాలయాపన చేయడంతో మనోవేదనకు గురై, ఆరోగ్యం దెబ్బతిని కోటేశ్వరరావు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్లో చేరినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అగ్రిగోల్డ్ బాధితుల కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ. 4 వేల కోట్లు కేటాయించి,బాధితులను ఆదుకోవాలనిఅగ్రిగోల్డ్ కస్టమర్స్అండ్ ఏజెంట్స్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు నాయడు శ్రీనివాసరావు డిమాండు చేశారు. అగ్రిగోల్డ్ బాధిత మిత్రులందరు సోమవారం నుంచి ప్రారంభమయ్యే రిలే దీక్షలలో పాల్గొనాలని.ఆ సంస్థ రాష్ట్ర కమిటీ చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొని మరో మరణం సంభవించకుండా చూద్దామని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

వారికి నిబంధనలు వర్తించవా ?

కొడుకును విడిపించుకున్న పోలీసు బాస్

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: ప్రజలకు నీతి సుత్రాలు చెప్పే పోలీసులు వారి కుమారులకు ఎందుకు చెప్పడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. తమకు వర్తించే నిబంధనలు వారి కుటుంబసభ్యులకు ఎందుకు వర్తించవని నిలదీస్తున్నారు. ఇప్పటికే పలు విషయాల్లో పోలీసుల వ్యవ హారశైలి వివాదాస్పదంగా మారుతున్న నేపథ్యంలో తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రతి శుక్ర, శనివారాల్లో పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే శనివారం ఒమెగా ఆసుపత్రి వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తని ఖీలు చేపట్టారు. అక్కడికి వచ్చిన ఓ కారును పోలీసులు ఆపే ప్రయత్నం చేసినా అతను ఆపకుండా వెళ్లేందుకు ప్రయ త్నించాడు. పోలీసులు ఆ వాహనాన్ని అడ్డుకు న్నారు. తాను పోలీసులకు సంబంధించిన వ్యక్తినే అంటూ ట్రాఫిక్ పోలీసులపై పెత్తనం చెలాయించే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు వాహనం తనిఖీ చేయగా అందులో పోలీసుల లాఠీ దొరకడంతో అతనిని పక్కకు తీసుకెళ్లారు. చివరకు విషయం ఆరాతీయగా అతను ఓ అడిషనల్ డీసీపీ కుమా రుడని తేలింది. దీంతో పోలీసులు కంగుతిన్నారు. పరువు పోతుందనే భయంతో తన కుమారుడిని విడిచిపెట్టాలని ఆ పెద్దాయన పోలీసులకు ఫోన్ చేశారు. అతని వ్యవహా రశైలి సరిగా లేదని, అతని వల్ల పోలీస్ వ్యవస్థ పరువు పోయేలా ఉందని, అతని అదు పులో పెట్టాలని ట్రాఫిక్ పోలీసులు సూచించినట్లు తెలిసింది. మొత్తం మీద ఆ అధికారి కుమారుడిని తప్పించడంతో మిగతా వాహనదారులు పెదవి విరిచారు. సామాన్యులకు ఒక న్యాయం, పోలీసు కుటుంబ సభ్యులకు ఒక న్యాయమా అంటూ మండిపడ్డారు.

నిలదీద్దాం! (మొదటిపేజీ తరువాయి)



వరకూ ఏకోన్ముఖంగా వరుస కార్యక్రమాలు, ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాలతోపాటు వివిధ వ్యాపార, వాణిజ్య సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్లడానికి ప్రత్యేక హోదా సాధన సమితి కార్యక్షేత్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని ఐవీ ప్యాలెస్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వామపక్షపార్టీలతోపాటు కాంగ్రెస్, వైసీపీ, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్‌వాదీపార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, నవతరం తదితర పార్టీలతోపాటు వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు. సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక తరగతి హోదా పదేళ్లు కాదు.. 15 ఏళ్లు ఇవ్వాలని వాదించిన బాబు తర్వాత రోజుల్లో హోదా సంజీవని కాదని, స్పెషల్ అసిస్టెంట్స్‌గా ఇచ్చే సాయం హోదాతో సమానమంటూ రకరకాలుగా ప్రజలను నమ్మిస్తూ నాలుగేళ్లు గడిపేసారని తెలిపారు. చివరకు 2018-19 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగడంతో రాజకీయ లబ్ధికోసమే ఎంపీలతో హడావిడి చేయిస్తున్నారే తప్ప కేంద్రంపై వత్తిడి తీసుకురావడంలేదన్నారు. కేంద్రాన్ని ఐక్యంగా నిలదీయాలని, మోడీతో ధైర్యంగా మాట్లాడే, పోరాడే ఎవరితోనైనా సరే కలసి సీపీఐ పని చేస్తుందని రామకృష్ణ స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇచ్చేందుకు, విభజన హామీలను అమలు చేసేందుకు బీజేపీ సిద్ధంగా లేదన్నారు. హోదా కంటే ప్యాకేజీ మేలని అప్పట్లో మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమేనని చెప్పడంతో రాష్ట్రానికి అన్యాయం చేసిన మొదటి ముద్దాయిగా నిలుస్తాడనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన జాతీయ విద్యా సంస్థలకు రూ. 6,600 కోట్లు అవసరం అవుతాయన్నారు. అయితే కేంద్రం రూ. 421 కోట్లు మాత్రమే ఇవ్వడం వల్ల అవి 30 ఏళ్లయినా నరే పూర్తికావన్నారు. ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన చంద్రబాబుకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి మాట్లా డుతూ మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిద్దిదాలని, లేదంటే విభజన చట్టంలో మార్పులైనా చేయాలన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. హోదాను కనుమరుగుచేసే కుయు క్తులు జరుగుతున్నాయనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ ఇప్పటికైనా భేషజాలను విడిచి హోదాకోసం ముందుకొస్తే కలసి పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే భవిష్యత్తులో సాధన సమితి తీసుకునే ప్రతి నిర్ణయానికి సంపూర్ణ మద్దతునివ్వడమే కాకుండా కలసి పనిచేస్తామని రఘువీరా హామీ ఇచ్చారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి కె పార్థసారధి మాట్లాడుతూ గత బడ్జెట్‌లో ఎక్కువ సాధించామని చంకలు గుద్దుకున్న చంద్రబాబు ఈ ఏడాది అన్యాయం జరిగిందని చెప్పడం కేవలం ప్రజలను మోసగించడమే అవుతోందన్నారు. పార్లమెంటరీ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలంటే ఉద్యమాలను మరింత తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం రాష్ట్రంలో జరిగే ఉద్యమాలతో ఢిల్లీ పీఠం కదలాలని ఆకాంక్షించారు. ఈ ఉద్యమాలకు ఏ పార్టీలు పిలుపునిచ్చినా సరే సంఘీభావం తెలియచేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ ఉద్యమానికి అన్ని రాజకీయపార్టీలు ఒకే వేదికపైకి రావడంతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకోవాలని సూచించారు. మార్చిలో జరిగే ఏపీ బడ్జెట్ సమావేశాల్లో మండలిలో ఈ విషయాన్ని లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీలు పీజే చంద్రశేఖరరావు, కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ ఎంపీలు పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలన్నారు. అలాగే రాజకీయ, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి.. ఇలా అన్ని సంఘాలతో జేఏసీలను ఏర్పాటు చేయాలని కోరారు. సినీనటుడు శివాజీ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యక్ష కార్యాచరణకు రావాల్సిన సమయం, సందర్భం వచ్చిందన్నారు. అందరూ కలసి రాబోయే తరాల కోసం గట్టిగా పోరాటాలు సాగిద్దామన్నారు. సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ హోదా, విభజన హామీల సాధన కోసం పోరాటం చేయనివారిపై ఆంధ్రాద్రోహులుగా ముద్రవేస్తామని హెచ్చరించారు. మోసపూరిత మాటలతో ఇంకా ప్రజలను నమ్మకద్రోహం, నయవంచనకు పాల్పడితే భూస్థాపితం కావడం ఖాయమన్నారు. సమైక్యంగా వాదనలు వినిపిద్దామని, దిక్కులు పిక్కటిల్లే విధంగా ఉద్యమం సాగాలన్నారు. ఇంకా జనసేన నేత పోతిన వెంకట మహేష్, లోక్‌సత్తా నేత భీశెట్టి బాబ్జి, ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్రనేత పి వెంకట రామారావు, సమాజ్‌వాదీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, ఎంసీపీయూ రాష్ట్ర నేత శివయ్య, ఇండియన్ ముస్లిం లీగ్ నేత బషీర్ అహ్మద్, ఏపీజేఎఫ్ నేత కృష్ణాంజనేయులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుడు అమరయ్య, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, న్యూడెమోక్రసీ నేతలు కె పోలారి, రామారావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై ఈశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత లెనిన్‌బాబు, ఎస్ఎఫ్ఐ నేత సూర్యారావు తదితరులు ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అతిథులను ఆహ్వానించారు. ఇంకా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, జి ఓబులేసు, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, కాంగ్రెస్ నాయకులు పి తులసిరెడ్డి, కొలనుకొండ శివాజీ, సుంకర పద్మశ్రీ, వైసీపీ నేతలు మల్లాది విష్ణు, సీపీఎం నేతలు వైవీ రావు, రైతు సంఘం నేతలు కేవీవీ ప్రసాద్, వై కేశవరావు, టీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయులు, డీహెచ్‌పీఎస్ నేత కరవది సుబ్బారావు, ఫార్వర్డ్‌బ్లాక్ నేత సుందరరామరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు గని, చంద్రానాయక్, పిచ్చయ్య, ఏఐఎస్ఎఫ్ నేత రంగన్న, నవతరంపార్టీ నేత రావు సుబ్రహ్మణ్యం, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి లక్ష్మీపతి తదితరులు రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యారు.

నేడు సీఈసీతో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ భేటీ

విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణపై క్షేత్రస్థాయి సమాచా రాన్ని వివరించేందుకు సోమవారం టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో భేటీ కానుంది. మర్రి శశిధర్‌రెడ్డి నాయకత్వంలో టీపీసీసీ కమిటీ సభ్యులు డి.కె.అరుణ, నిరంజన్, శ్యాంమోహన్‌లు ఈ భేటిలో పాల్గొంటారు. ఈ బృందం ఉదయం 11గంటలకు కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో ఢిల్లీలోని ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కలిసి ఇక్కడి పరిస్థితులను వివరిస్తుంది. ఈనెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించిన ఈ బృందం ఓటర్ జాబితాలో జరిగిన తప్పిదాలపై నివేదికను తయారు చేసింది. ఈ నివేదికను ఎన్నికల కమిషనర్‌కు అందిస్తుంది.

ఐఈఎస్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: గతనెల 7న నిర్వహించిన 'ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్)' ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం విడుదల చేసింది. పీఎస్‌సీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్లో ఫలితాలను ఉంచింది. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి జులై 1న మెయిన్స్ పరీక్షను నిర్వహిస్తారు.

వరల్డ్‌కప్‌కు సిద్ధంగా లేం

- మిడిలార్డర్‌లో లోపాలున్నాయి
- ఇదేరకమైన ఫాం మరికొన్ని నెలలు ఉండాలి
- టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి

జొహనెస్‌బర్గ్: పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. సెంచూరియన్ వేదికగా జరిగిన ఆరో వన్డేలో భారత సారథి విరాట్ కోహ్లి వన్డేలో 35వ శతకం బాదేసి, జట్టుకు ఏకంగా 8వికెట్ల తేడాతో అద్భుతమైన విజయాన్ని అందించాడు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా గడ్డపై ఇప్పటివరకూ ఏ కెప్టెన్‌కు సాధ్యపడని అరుదైన రికార్డును కోహ్లి తన ఖాతాలో వేసుకున్నాడు. సఫారీ జట్టును వారి గడ్డపైనా 5-1తేడాతో ఓడించడమంటే మామూలు విషయం కాదు. ఈ సిరీస్ ఇచ్చిన గెలుపుతో రానున్న 2019 వరల్డ్ కప్‌కు భారత్ సిద్ధంగా ఉందంటూ క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ, టీంఇండియా కోచ్ రవిశాస్త్రి మాత్రం వారి మాటలను కరాఖండీగా వ్యతిరేకిస్తున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఆరో వన్డే అనంతరం రవిశాస్త్రి ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విధంగా ముచ్చటించాడు. "2019లో జరుగునున్న వరల్డ్‌కప్‌కు టీంఇండియా సిద్ధంగా లేదు. సఫారీలపై మేం సాధించింది గొప్ప విజయమే. కానీ వరల్డ్ కప్‌లో విజయం సాధించాలంటే ఇదే జోరును ఇంకొన్ని నెలలపాటు కొనసాగిస్తేనే పూర్తి స్థాయిలో టీంఇండియా సిద్ధమైనట్లు" అని రవిశాస్త్రి అన్నాడు. 2019 వరల్డ్ కప్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నీ కంటే ముందే టీం ఇండియాకు కొన్ని నెలల్లో అక్కడే ద్వైపాక్షిక సిరీస్ ఉండటం లాభదాయకం. ఇంగ్లండ్ టూర్‌కు ముందే ఇండియన్ ప్రీమియర్ లీగ్ రూపంలో భారీ టోర్నీ ఉండనే ఉంది. దీంతో టీంఇండియా ఆటగాళ్లు వారి ఫామ్ ఇలాగే కొనసాగిస్తే ఇంగ్లండ్‌లో విజయవంతమయ్యే అవకాశం ఉంటుందని శాస్త్రి అంటున్నాడు. సగటు భారతీయ అభిమానిగా టీంఇండియా ప్రదర్శన చూసి ఆనందపడొచ్చు. కానీ ఒక బాధ్యతగల కోచ్‌గా మాత్రం జట్టులో ఉన్న లోపాలను సరిచేయడమే తన ప్రధాన కర్తవ్యమని రవిశాస్త్రి చెప్పాడు. "సిరీస్ గెలుపులో బౌలర్లదే ప్రధాన భూమిక. మొదటి నాలుగు స్థానాలలో వచ్చిన బ్యాట్స్‌మెన్ మంచి ప్రదర్శన చూపించినా, మిడిల్ ఆర్డర్ మాత్రం బలంగా లేదని నా అభిప్రాయం. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో 5, 6, 7 స్థానాల్లో వచ్చే బ్యాట్స్‌మెన్ కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలి. దక్షిణాఫ్రికాతో టీ20సిరీస్ కూడా పూర్తయిన తర్వాత మిడిల్ ఆర్డర్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని" రవిశాస్త్రి తెలిపాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ సాధారణంగా ఉందని నేను ముందుగానే గుర్తించాను. మొదటి వరుసలో వచ్చిన బ్యాట్స్‌మెన్ ఇచ్చిన శుభారంభాలను కూడా భారీ స్కోరుగా మలిచే క్రమంలో విఫలమయ్యాం. కాబట్టి ఇకనుంచి మిడిల్ ఆర్డర్ బలోపేతం అయ్యేందుకు కృషి చేయాల్సిందే. అదేవిధంగా దేశవాళీ టోర్నీలలో ఆటగాళ్ల అత్యుత్తమంగా రాణించేలా ప్రత్యేక దృష్టి పెట్టాం. దానిమూలంగానే గత ఆరు నెలలుగా అక్కడ మెరుగైన ప్రదర్శన చేసినవాళ్లు ప్రస్తుతం టీమిండియా జట్టులో స్థానాన్ని పదిలం చేసుకుంటున్నారు. నైపుణ్యం, ఫిట్‌నెస్, సవాళ్లు ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నవాళ్లకే జట్టులో స్థానం దక్కుతుందని శాస్త్రి తెలిపాడు. మణికట్టు ద్వయం కుల్‌దీప్, చాహల్‌తో పాటు ఫాస్ట్ బౌలర్ బుమ్రా గురించి ఎంత చెప్పినా తక్కువే. వారు సిరీస్‌లో అత్యుత్తమంగా రాణించారని రవిశాస్త్రి ఆనందం వ్యక్తం చేశాడు.



శిఖర్ ఇటు.. భువీ అటు..!



- 28 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ
- ఐదు వికెట్లు తీసిన భువనేశ్వర్‌కుమార్
- రాణించిన టీమిండియా టాప్ ఆర్డర్
- హెండ్రిక్స్ అర్ధసెంచరీ వృథా

జొహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన తొలి టీ20లో టీమిండియా 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వన్డేల్లో జోరును టీ20ల్లోనూ కొనసాగించింది. మూడు టీ20 మ్యాచ్‌ల్లో భాగంగా 1-0 తేడాతో ఆధిక్యం సంపాదించింది. 'గబ్బర్' శిఖర్ ధావన్ (72, 39 బంతుల్లో 10×4, 2×6) తాండవం ఆడాడు. ఇటు బాల్‌తో భువనేశ్వర్ చెలరేగి ఐదు వికెట్లు సాధించాడు. ధావన్ సొగసైన ఆటతీరుతో, అద్భుతమైన షాట్లతో ప్రత్యర్థి జట్టుపై విరుచుకుపడ్డాడు. తెరపి లేకుండా వర్షం పడ్డట్టు ఒకటే బౌండరీలు వాన కురిపించాడు. అతడికి కోహ్లి, మనీశ్ తోడవ్వడంతో భారత్ భారీ స్కోరు చేసింది. సఫారీలకు 204 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. చివరి నాలుగు టీ20ల్లో ఇక్కడ ఛేదనకు దిగిన జట్టే విజయం సాధించింది. అంటే చురకత్తుల్లాంటి బంతులు విసిరి ప్రత్యర్థిని బెంబేలెత్తిస్తే గానీ ఈ స్కోరును కాపాడుకోవడం కొంచెం కష్టమే!

గబ్బర్ దూకుడు

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఒక రకంగా శుభారంభం లభించిందనే చెప్పాలి. రోహిత్ శర్మ (21, 9 బంతుల్లో 2×4, 2×6) ఆడింది తొమ్మిది బంతులే అయినా ఎడాపెడా బాదేసి బ్యాటింగ్‌కు ఊపు తెచ్చాడు. అతడిని 1.5వ బంతికి జూనియర్ డాలా ఔట్ చేశాడు. చాన్నాళ్ల తర్వాత జట్టులో చోటు దక్కించుకొని మూడో స్థానంలో వచ్చిన సురేశ్ రైనా (15, 7 బంతుల్లో 2×4, 1×6) ఒక చక్కని సిక్సర్ బాదేశాడు. జట్టు స్కోరు 49 వద్ద అతడినీ డాలానే వెనక్కి పంపించాడు. ఈ క్రమంలో సారథి విరాట్ కోహ్లి (26, 20 బంతుల్లో 2×4, 1×6) అండతో శిఖర్ ధావన్ (72) చెలరేగి ఆడాడు. వరుస బౌండరీలతో విరుచుకుపడ్డాడు. దీంతో రన్‌రేట్ 10కి పైగా కొనసాగింది. ఉన్నంత వరకు ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు శిఖర్. 27 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన అతడిని 14.4వ బంతికి 155 పరుగుల వద్ద ఫెలుక్‌వాయో ఔట్ చేశాడు. స్లో బంతిని స్కూప్ చేయబోయి కీపర్ క్లాసెన్ చేతికి చిక్కాడు.

నిలకడగా మనీశ్

శిఖర్ కన్నా ముందే కోహ్లిని షంషి వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. వికెట్లు పడుతున్నా టీమిండియా దూకుడుగా ఆడేందుకే ప్రయత్నించింది. మనీశ్ పాండే (29 నాటౌట్, 27 బంతుల్లో 1×6) నిలకడగా ఆడాడు. వికెట్ పడకుండా అడ్డుకున్నాడు. అయితే షాట్లు మాత్రం ఆడలేదు. చివరి ఐదు ఓవర్లలో దక్షిణాఫ్రికా బౌలింగ్ సైతం బాగుండటం గమనార్హం. ధోనీ (16, 11 బంతుల్లో 2×4)తో కలిసి మనీశ్ పరుగులు సాధించాడు. 18.1వ బంతికి జట్టు స్కోరు 183 వద్ద క్రిస్‌మోరిస్ ధోనీని బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో హార్దిక్ పాండ్య (13, 7 బంతుల్లో 2×4)తో కలిసి మనీశ్ పాండే ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకుపోయాడు. వీరిద్దరూ ధాటిగా ఆడటంతో చివరి నాలుగు ఓవర్లలో 39 పరుగులు వచ్చాయి. దీంతో భారత స్కోరు 203కు చేరుకుంది. ఆఖరి ఓవర్లలో పాండే, పాండ్య జోడీ మరింత బాగా ఆడాల్సి ఉంది.

ఆచి..తూచి..

204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మొదటి నుంచి ఆచితూచి ఆడింది. భారీగా షాట్లు కొడుతున్న స్మట్స్‌ను భువనేశ్వర్ పెవిలియన్‌కు పంపాడు. 29 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా మొదటి వికెట్ కోల్పోయింది. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన సారథి డుమిని పెద్దగా పరుగులేమీ సాధించకుండానే భువనేశ్వర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అనంతరం వచ్చిన మిల్లర్‌కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. దీంతో ప్రొటీస్ పీకల్లోతు కష్టాల్లో మునిగింది. ఈ దశలో బరిలోకి దిగిన బెహార్డైయిన్ హెన్‌డ్రింక్స్‌కు జత అయ్యాడు. వీరిద్దరూ కలిసి కుదురుకుని భారీగా షాట్లు కొడుతూ స్కోరు బోర్డును ఉరకలెత్తించారు. ప్రమాదకరంగా మారుతున్న బెహార్డైయిన్(28 బంతులు, 39 3×4, 2×6)ను చాహల్ అద్భుతమైన బంతితో బురిడీ కొట్టించి పెవిలియన్‌కు పంపాడు. అనంతరం మరో ప్రమదాకర బ్యాట్స్‌మేన్ హెండ్రిక్స్‌ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. దీంతో ఇక దక్షిణాఫ్రికా కోలుకునే అవకాశం రాలేదు. క్లాసెన్, మోరిస్, ప్యాటరసన్ వికెట్లను రెండు, మూడు పరుగుల తేడాతో కోల్పోయింది. ఆఖరిగా పెహ్లుక్‌వాయోను ఉనాద్కట్ ఔట్ చేయడంతో, భారత్‌ను విజయం వరించింది. బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ ఐదు వికెట్లు తీసుకోగా, ఉనాద్కట్, పాండ్య, చాహల్‌లకు చెరో వికెట్ దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ ఈనెల 21న సెంచూరియన్ వేదికగా జరగనున్నది.



వచ్చే ఏడాది వన్డేల జాతర



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ప్రపంచప్ జరగబోతున్న నేపథ్యంలో ఆ లోపు భారత్ పెద్ద ఎత్తున వన్డే మ్యాచ్‌లు ఆడబోతోంది. ఏడాది కాలంలో దాదాపు 30 వన్డే మ్యాచ్‌ల్లో భారత్ తలపడనుందని అంచనా. వచ్చే 12 నెలల్లో భారత మొత్తం 63 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుండగా.. అందులో దాదాపు సగం వన్డేలే. దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన అనంతరం భారత్.. వచ్చే నెలలో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో ముక్కోణపు వన్డే సిరీస్ ఆడుతుంది. ఐపీఎల్ తర్వాత ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్, వెంటనే బెంగళూరులో అఫ్గానిస్థాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడతారు. తర్వాత సుదీర్ఘ ఇంగ్లండ్ పర్యటన ఉంటుంది. ఆ పర్యటనలో 5 టెస్టులు, 3 వన్డేలు, 3 టీ20లు ఆడతారు. అక్టోబర్లో వెస్టిండీస్‌తో భారత్ రెండు టెస్టులు, ఐదు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌కు ఆతిథ్యమిస్తుంది. దానికంటే ముందు ఆసియా కప్ వన్డే టోర్నీ ఉంటుంది. దాని తేదీలు, వేదిక ఇంకా ఖరారవ్వలేదు. నవంబరు-డిసెంబరు నెలల్లో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత్.. నాలుగు టెస్టులు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుంది. ఆ తర్వాత మొదలయ్యే న్యూజి లాండ్ పర్యటనలో ఐదు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. ఆపై ఆస్ట్రేలియా భారత్‌కు వచ్చి ఐదు వన్డేలు, రెండు టీ20లు ఆడుతుంది. సీజన్ చివర్లో సొంతగడ్డపై భారత్.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో తలపడుతుంది.

విదేశాల్లో వారిద్దరూ కీలకం



ముంబై: మణికట్టు స్పిన్నర్లు యజు వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ భవిష్యత్‌లోనూ విదేశాల్లో భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అభిప్రాయ పడ్డాడు. ప్రత్యర్థి జట్లు ఈ ఇద్దరిని ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై ప్రణాళికలు రచించుకుంటాయని అన్నాడు. 2019 వన్డే ప్రపంచకప్‌నకు మన జట్టు సన్నాహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని సచిన్ పేర్కొన్నాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ పెంపునకు బీసీసీఐ తీసుకున్న చర్యలు ఫలితాన్నిస్తున్నాయని ప్రశంసించాడు.

అశ్విన్‌పై కిర్మాని ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను టీమిండియా మాజీ కీపర్ సయ్యద్ కిర్మాణీ ప్రశం సించాడు. ఆటపై అతడి కున్న అంకితభావం ఎంతో గొప్పదని పేర్కొన్నాడు. యువ క్రికెటర్లకు అతడో రోల్ మోడల్ అని కొనియాడాడు. అశ్విన్ సాధించిన విజయాలపై మాట్లాడేందుకు తనకు మాటలు రావడం లేదని కిర్మాని పేర్కొన్నాడు. క్రికెట్ లెజెండ్‌గా మారనున్న అతడికి అభినందనలు చెబుతున్నానన్నాడు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అశ్విన్‌కు 'ఐకాన్ ఆఫ్ చెన్నై' అనే అవార్డును ప్రదానం చేశారు. దీనికి హాజరైన కిర్మాని మాట్లాడుతూ అశ్విన్‌ను ప్రశంసించాడు. తమిళనాడుకే కాకుండా మొత్తం దేశానికే అశ్విన్ గర్వకారణమని పేర్కొన్నాడు. యువ క్రికెటర్లకు ఆయన రోల్ మోడల్‌గా నిలుస్తాడని ప్రశంసించాడు.



ఈ టీ20 వారికి ప్రత్యేకం

జొహనెస్‌బర్గ్: ఫార్మాట్ మారింది. ఇక నుంచి అన్ని ధనాధన్ ఇన్నింగ్స్‌లే. పరిమిత ఓవర్ల క్రికెట్ అందించిన సిరీస్ విజయోత్సవంతో భారత్ మరో టైటిల్‌పై కన్నేసింది. దక్షిణాఫ్రికాతో జరుగనున్న టీ20 సిరీస్‌కు భారత్ సర్వం సిద్ధమైంది. జోహనెస్‌బర్గ్ వేదికగా జరుగుతున్న తొలి టీ20 మ్యాచ్ భారత్‌కు ప్రత్యేకమైంది. సారథి విరాట్ కోహ్లి, మాజీ సారథి మహేంద్రసింగ్ ధోని ఈ టీ20మ్యాచ్ ద్వారా మరో మైలురాయిని చేరుకొనున్నారు. విరాట్ కోహ్లి మరో 44పరుగులు సాధిస్తే టీ20లలో 2000పరుగుల మైలురాయిని చేరనున్న మూడో ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. టీ20లలో 51 ఇన్నింగ్స్ ఆడినా విరాట్ 52.86 సగటుతో 1956 పరుగులు చేశాడు. పొట్టి క్రికెట్లలో కోహ్లి స్ట్రయిక్ రేటు 137.84. కోహ్లి కంటే ముందు న్యూజిలాండ్ మాజీ సారథి బ్రెండన్ మెక్‌కల్లమ్(2188), కివీస్ మరో ఆటగాడు మార్టిన్ గప్తిల్(2250) మాత్రమే ఉన్నారు. ఇక మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోని విషయానికొస్తే.. సఫారీ గడ్డపైనే తొలి టీ20 ప్రపంచ కప్ అందుకున్న ధోని ఈ మ్యాచ్‌లో మరో మూడు క్యాచ్‌లు అందుకుంటే టీ20లలో 50 క్యాచ్‌లు అందుకున్న రెండో ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. ధోని కంటే ముందు దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలియర్స్(65 క్యాచ్‌లతో) ముందున్నాడు. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం భారత్ ఇప్పటి వరకూ పది టీ20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఏడుసార్లు విజయం సాధించింది. ప్రస్తుతం భారత జట్టులో సురేశ్ రైనా, కేఎల్ రాహుల్, జయదేవ్ ఉనద్కత్ చేరారు. మరోవైపు ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఉన్న కారణంగా దక్షిణాఫ్రికా కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చింది.

మూడూ కలిస్తే... కోహ్లి : రషీద్

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లిని అభిమానులు ముద్దుగా ఛేజ్ మాస్టర్, రన్ మెషిన్, కింగ్ కోహ్లి తదితర ముద్దు పేర్లతో పిలుస్తూ ఉంటారు. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లి ప్రదర్శనపై ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో పాకిస్థాన్ మహిళా క్రికెటర్లతో పాటు అఫ్గానిస్థాన్ స్టార్ ఆటగాడు రషీద్ ఖాన్ కూడా చేరారు. 'పరుగుల యంత్రం, శతకాల యంత్రం, ఛేజింగ్ యంత్రం కోహ్లి' అంటూ రషీద్ ఖాన్ పెట్టిన ట్వీట్ ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. రషీద్ ఖాన్ ఐపీఎల్‌లో గత ఏడాది సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడాడు. ఈ ఏడాది మరోసారి సన్‌రైజర్సే అతడ్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. 'కోహ్లి ఓ మేధావి. అతని బ్యాటింగ్ ప్రదర్శన ఆశ్చర్యపరిచింది. 35వ శతకం' 'వాట్ ఎ ప్లేయర్' అంటూ పాకిస్థాన్ మహిళా క్రికెటర్లు సయ్యేద అబిది, ఇంతియాజ్ ట్విటర్లో పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాతో ముగిసిన ఆరు వన్డేల సిరీస్‌లో కోహ్లి 558 పరుగులు సాధించాడు. వన్డే చరిత్రలోనే ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో 500కు పైగా పరుగులు చేసిన తొలి ఆటగాడిగా కోహ్లి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.

మూడో టీ20లో పోరాడి ఓడిన అమ్మాయిలు



జొహనెస్‌బర్గ్: వరుసగా మూడో మ్యాచ్ నెగ్గి టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోవాలన్న టీమిండియా ఆశలు నెరవేరలేదు. కీలకమైన మూడో టీ20లో దక్షిణాఫ్రికా చేతిలో భారత మహిళల క్రికెట్ జట్టు పోరాడి ఓడింది. ఐదు వికెట్ల తేడాతో హర్మన్‌ప్రీత్ సేన ఓటమి చవి చూసింది. భారత్ నిర్దేశించిన 134 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య దక్షిణాఫ్రికా మరో 6 బంతులు మిగిలుండగానే విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భారత ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 17.5 ఓవర్లకు 133 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మిథాలీ రాజ్ (0) విఫలమైంది. సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ (48, 30 బంతుల్లో 6×4, 2×6), స్మృతి మంధాన (37, 24 బంతుల్లో 6×4, 1×6), వేద కృష్ణమూర్తి (23, 14 బంతుల్లో 4×4) రాణించారు. దూకుడుగా ఆడారు. అయితే ఇస్మాయిల్ (5/30) బౌలింగ్ ధాటికి టెయిలెండర్లు, మిడిలార్డర్ అంతగా రాణించలేదు. లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా దూకుడుగా ఆడింది. సన్ లూస్ (41, 42 బంతుల్లో 5×4), క్లో ట్రెయన్ (34, 15 బంతుల్లో 4×4, 2×6), డేన్ వాన్ నికెర్క్ (26, 20 బంతుల్లో 5×4) వేగంగా ఆడి జట్టుకు విజయం అందించారు. చివర్లో టీమిండియాకు అవకాశాలు వచ్చినా అప్పటికే ఆలస్యమైంది. భారత్ మరో 20 పరుగులు చేసుంటే అవకాశాలు ఉండేవి. పూజా 2, రాజేశ్వరి గైక్వాడ్, అనుజ పాటిల్, పూనమ్ యాదవ్ తలో వికెట్ తీశారు.



కార్మిక నాయకులు సింగారవేలుకు ఘన నివాళి

పుదుచ్చేరి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వ్యవస్థాపక సభ్యులు, ప్రముఖ కార్మిక నాయకులు మైలాపూర్ సింగారవేలు చెట్టియార్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అందరూ ఆయనను ఎం. సింగారవేలు, సింగారవేలర్‌గా పిలుస్తారు. భారతదేశంలో మొట్టమొదటి కార్మిక సంఘాన్ని ఆయన నిర్మించారు. శ్రామిక దినోత్సవం మేడేని దేశంలో మొట్టమొదటిసారిగా 1923 మే 1న ఆయనే నిర్వహించారు. 1860 ఫిబ్రవరి 11వ తేదీన జన్మించిన సింగారవేలు 1946 ఫిబ్రవరి 11న తుదిశ్వాసవిడిచారు. ఆయన 157వ జయంతి సందర్భంగా పుదుచ్చేరిలోని ఆయన విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. సింగారవేలు విగ్రహానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి మల్లాడి కృష్ణారావు, సీపీఐ జాతీయ కార్యదర్శులు డి. రాజా, డా॥ కె. నారాయణ, రాష్ట్ర నాయకులు విశ్వనాథ్, కలైనాథన్, సలీం ప్రభృతులు పుష్పమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.